ప్రభాతనవ

SINGIDI | తెలుగు దినపత్రిక

# సింగిడి

ప్రతి రంగూ ఓ నిజం singidinews.com

సోమవారం 14 సెప్టెంబర్ 2026 సంపుటి: 1 సంచిక: 89 పేజీలు 12 వెల: 6.50

Published from: Hyderabad, Karimnagar, Warangal, Khammam, Nizamabad,Mahabubnagar



పాఠకులు, ప్రకటనకర్తలు, శ్రేయోభిలాషులకు

వినాయక చవితి శుభాకాంక్షలు

పండుగ సందర్భంగా నేడు మా కార్యాలయానికి సెలవు. మంగళవారం సంచిక వెలువడదు.. పున:దర్శనం బుధవారం

- మేనేజ్‌మెంట్, సింగిడి

## రాష్ట్ర ప్రజలకు వినాయక చవితి శుభాకాంక్షలు: సీఎం రేవంత్



తెలంగాణ రాష్ట్ర ప్రజలకు సీఎం రేవంత్‌రెడ్డి వినాయక చవితి పండగ శుభాకాంక్షలు తెలిపారు. ప్రతి ఒక్కరి జీవితంతో విఘ్నాలు తొలగాలని ఆకాంక్షించారు. విఘ్నేశ్వరుడి కృపతో ప్రజలంతా ఆనందం, ఆరోగ్యంతో వర్ధిల్లాలని కోరారు. వేడుకల సందర్భంగా ప్రజలకు ఇబ్బందులు కలగకుండా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు.

- హైదరాబాద్ (సింగిడి)

## రోశయ్య దూరదృష్టి వల్లే తెలంగాణకు మిగులు బడ్జెట్

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

2



**ఉప్పల్ భగాయత్‌లో ఆర్యవైశ్య ఆత్మగౌరవ భవన్‌కు భూమిపూజ**

**ఆర్యవైశ్యుల సమస్యలను పరిష్కరిస్తానని హామీ**

**హైదరాబాద్‌లో రోశయ్య విగ్రహం ఏర్పాటు చేస్తా**

**ఆర్యవైశ్య ఆత్మగౌరవ సభలో రేవంత్**

ఆర్యవైశ్యులు సౌమ్యులు, ఆత్మాభిమానం కలిగిన వారన్న సీఎం రేవంత్ రెడ్డి పేదరికం ఉన్నా ఆర్యవైశ్యులు కడుపులో దాచుకుంటారని స్పష్టం చేసారు. ఆయన ఇవాళ హైదరాబాద్ ఉప్పల్ భగాయత్‌లో ఆర్యవైశ్య ఆత్మగౌరవ భవన్‌కు భూమిపూజ చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో పాల్గొన్నముఖ్యమంత్రి ఆర్యవైశ్య భవన నిర్మాణానికి సహకరిస్తానని, వారి సమస్యలు పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.

- హైదరాబాద్, సెప్టెంబర్ 13 (సింగిడి)




## బ్రిక్స్ పగ్గాలు చైనాకు..

ఇకపై ఫలితాలు చూపించాల్సిందే

2

**బ్రిక్స్ ముగింపు సమావేశంలో ప్రధాని మోదీ**

**ఢిల్లీ డిక్లరేషన్‌ను కాలపరిమితితో అమలు చేయాలని బ్రిక్స్ దేశాలకు మోదీ సూచన**

## తెలంగాణలో లోక్ అదాలత్ సక్సెస్

సైబర్ బాధితులకు రూ.42 కోట్ల వాపసు

2

**తెలంగాణలో మూడో జాతీయ లోక్ అదాలత్ విజయవంతం**

**మొత్తం 1.51 లక్షలకు పైగా క్రిమినల్ కేసులు పరిష్కారం**

**3,896 సైబర్ ఫ్రాడ్ కేసుల సెటిల్‌మెంట్.. బాధితులకు రూ.42.29 కోట్ల వాపసు**

**కేసుల పరిష్కారంలో హైదరాబాద్, ఖమ్మం, గద్వాల యూనిట్లు టాప్**

**న్యాయవ్యవస్థ, పోలీసుల సమన్వయంతో కేసుల భారం తగ్గింపు**



తెలంగాణ వ్యాప్తంగా నిర్వహించిన మూడో జాతీయ లోక్ అదాలత్ విజయవంతంగా ముగిసింది. ఈ కార్యక్రమంలో 3,896 సైబర్ మోసాల కేసులతో సహా మొత్తం 1.51 లక్షలకు పైగా రాజీపడదగిన (కాంపౌండబుల్) క్రిమినల్ కేసులను పరిష్కరించినట్లు తెలంగాణ పోలీస్ శాఖ ఆదివారం వెల్లడించింది. ఈ సెటిల్‌మెంట్ల ద్వారా సైబర్ నేరాల బాధితులకు ఏకంగా రూ.42.29 కోట్లు తిరిగి అందజేయడం గమనార్హం.

- హైదరాబాద్, సెప్టెంబర్ 13 (సింగిడి)

## దంచికొడుతున్న వానలు

**పలు జిల్లాలకు ఎల్లో అలర్ట్**

**తెలంగాణపై అల్పపీడన ప్రభావం.. రెండ్రోజులు వర్షాలే**

**ఉత్తర తెలంగాణలోని పలు జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ**

**గత 24 గంటల్లో పలుచోట్ల రికార్డుస్థాయి వర్షపాతం నమోదు**

**ప్రాజెక్టులకు పెరుగుతున్న వరద నీరు.. అప్రమత్తమైన అధికారులు**

2

## ఉచితాల హామీలు..

# లక్ష కోట్ల లెక్కలు

## కవిత కొత్త పార్టీ.. భారీ ప్రకటనలు

**ప్రైవేట్ విద్యకు పూర్తి ఖర్చు భరిస్తామన్న ప్రతిపాదన**

**ఉచిత ప్రైవేట్ వైద్యం.. రూ.40 వేల కోట్ల అంచనా**

**నిరుద్యోగులకు రూ.2 లక్షల నుంచి రూ.20 కోట్ల వరకు రుణ సౌకర్యం**

**తొలి ఏడాదే 4 లక్షల ఉద్యోగాల ప్రకటన**

**మొత్తం ఆర్థిక అవసరం లక్ష కోట్లకు పైమాటే**

**అమ్మ జేబు చూడదంటున్న కవిత.. మరి డబ్బెక్కడి నుంచి?**

తెలంగాణ రాజకీయాల్లో కొత్త పార్టీతో కవిత ముందుకొచ్చారు. అయితే.. కొత్త రాజకీయ ఆలోచనలు, కొత్త ఆర్థిక విధానం కంటే.. ఉచితాలు, భారీ వాగ్దానాలే ప్రధానంగా కనిపిస్తున్నాయన్న విమర్శలు వస్తున్నాయి. ముఖ్యమంత్రి అయితే ప్రైవేట్ విద్యకు పూర్తి ఖర్చు.. ప్రైవేట్ వైద్యానికి ప్రభుత్వ భరోసా.. భారీ రుణ సౌకర్యాలు.. ఉద్యోగాల కల్పన అంటూ వరుస ప్రకటనలు చేశారు. వీటన్నింటినీ అమలు చేయాలంటే ప్రభుత్వ ఖజానాపై పడే ఒత్తిడి ఎంత అన్నదే ఇప్పుడు చర్చ.

హైదరాబాద్ బ్యూరో (సింగిడి)

**ఉచిత విద్యకు రూ.20 వేల కోట్లు**

ప్రభుత్వ విద్యతో పాటు ప్రైవేట్ విద్యకు అయ్యే ఖర్చును కూడా ప్రభుత్వం భరిస్తుందని కవిత ప్రకటించారు. అంచనాల ప్రకారం దీనికి సుమారు రూ.20 వేల కోట్ల వరకు అవసరం అవుతుంది. ఇంత మొత్తాన్ని ప్రతి ఏడాది ఏ ఆదాయ వనరుల నుంచి సమకూరుస్తారన్నది కీలకంగా మారింది.

**వైద్యానికి మరో రూ.40 వేల కోట్లు**

ప్రైవేట్ వైద్య ఖర్చును కూడా ప్రభుత్వమే భరిస్తుందని తెలిపారు. దీనికి సుమారు రూ.40 వేల కోట్ల వరకు కేటాయించాల్సి ఉంటుందన్న అంచనా ఉంది. విద్య, వైద్యం కలిపితేనే దాదాపు రూ.60 వేల కోట్ల అవసరం ఏర్పడుతుంది.




**లోన్లకు రూ.20 వేల కోట్లు**

నిరుద్యోగులకు రూ.2 లక్షల నుంచి రూ.20 కోట్ల వరకు డైరెక్ట్ లోన్ సౌకర్యం కల్పిస్తామని చెప్పారు. తెలంగాణలోని సుమారు 30 లక్షల మంది నిరుద్యోగుల్లో 10 లక్షల మందికి కనీసం రూ.2 లక్షల చొప్పున రుణం అందించినా.. దాదాపు రూ.20 వేల కోట్లు కావాల్సి ఉంటుంది.

**ఉద్యోగాలకే రూ.25 వేల కోట్లు**

ప్రభుత్వం ఏర్పడిన తొలి ఏడాదిలోనే 4 లక్షల ఉద్యోగాలు ఇస్తామని..

...మిగతా 2లో

## కేజ్రీవాల్ కొత్త కూటమి



వినాయక చవితి పండుగ వేళ గోవా రాజకీయంలో భారీ సంచలనం నమోదైంది. వచ్చే ఏడాది జరగనున్న గోవా శాసనసభ ఎన్నికల నేపథ్యంలో ఆమ్ ఆద్మీ పార్టీ , విజయ్ సర్దేశాయ్ నేతృత్వంలోని గోవా ఫార్వర్డ్ పార్టీ మధ్య పొత్తు ఖరారైంది.

- న్యూఢిల్లీ, సెప్టెంబర్ 13 (సింగిడి)

2



## ఏపీ టెట్ ఫలితాలు విడుదల

ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ అర్హత పరీక్ష ఫలితాలను మంత్రి నారా లోకేశ్ విడుదల చేశారు. ఇన్ సర్వీస్ టీచర్లలో 51 శాతం మంది, రెగ్యులర్ అభ్యర్థుల్లో 47 శాతం మంది ఉత్తీర్ణత సాధించారు.

- అమరావతి, సెప్టెంబర్ 13 (సింగిడి)

2

## నడిసంద్రంలో మునిగిన నౌక

**240 మంది గల్లంతు**

ఇండోనేషియాలోని జావా సముద్రంలో ప్రయాణికులతో వెళ్తున్న ఒక నౌక అకస్మాత్తుగా గల్లంతయింది. ట్రాన్స్‌పోర్ట్ 8 నౌక ప్రయాణంలో ఉండగా సిగ్నల్స్ కోల్పోయి, కమ్యూనికేషన్ కట్ అయిపోయింది. న్యూఢిల్లీ (సింగిడి)



2

# మళ్లీ మంత్రినవుతా

**మంత్రి పదవి పోయిందని ఇంట్లో కూర్చోను.. అల్లర్లు చేద్దామంటే వద్దన్నాను**

**పదవి పోతే పోనీ అని సారీ చెప్పలేదు.. వరంగల్‌లో కార్యకర్తల భేటీలో కొండా సురేఖ**



వరంగల్‌లో కార్యకర్తల భేటీలో కొండా సురేఖ దంపతులు కీలక వ్యాఖ్యలు చేశారు. కొండా సురేఖను సారీ చెప్పమన్నారని, కానీ అందుకు ఆమె అంగీకరించలేదన్నారు. కాంగ్రెస్‌లోనే ఉంటామని, రాహుల్‌గాంధీని ప్రధానిగా చేయడమే తమ లక్ష్యమన్నారు. మంత్రివర్గం నుంచి బర్తరఫ్ తర్వాత, వరంగల్‌లో తొలిసారి కొండా సురేఖ, కొండా మురళి కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కీలక వ్యాఖ్యలు చేశారు. రేవంత్‌రెడ్డి లాంటి మాస్ లీడర్ కాంగ్రెస్‌కు అవసరమని చెప్పిన మొదటి వ్యక్తిని తానేనని కొండా సురేఖ తెలిపారు. రేవంత్‌రెడ్డి రైతుల కోసం పాదయాత్ర చేశారని, అదృష్టవశాత్తు కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిందని, తనకు మంత్రి పదవి వచ్చిందన్నారు. ఎలాంటి తప్పులు చేయకుండా మంత్రి బాధ్యతలు నిర్వర్తించానన్నారు.

- వరంగల్ (సింగిడి)

2



## కాంగ్రెస్‌ను వీడేది లేదు

**వచ్చే ఎన్నికల్లో మేమే టికెట్లు ఇస్తాం..**

**కొండా మురళి సెన్సేషనల్ కామెంట్స్**

కాంగ్రెస్‌ను వీడటంపై కొండా మురళి సంచలన వ్యాఖ్యలు చేశారు. పదవులు వస్తుంటాయి, పోతుంటాయి కానీ మా రక్తంలో, మా కుటుంబంలో కృతజ్ఞత ఉందన్నారు. తాము కాంగ్రెస్‌ను వీడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. మంత్రి పదవి నుంచి కొండా సురేఖ బర్తరఫ్ అయ్యాక తొలిసారి వరంగల్‌లో తమ కార్యకర్తలో కొండా దంపతులు భేటీ అయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడిన మురళి.. ఎన్ని రోజులు బతికామన్నది ముఖ్యం కాదని ఎలా బతికామన్నదే ముఖ్యం అన్నారు. రాహుల్ గాంధీని ప్రధాని చేయడమే లక్ష్యం అని చెప్పారు.

## హర్మూజ్ జలసంధిపై కొత్త మార్గాలు

ఇరాన్, ఒమన్ కీలక ఒప్పందం!

**హర్మూజ్‌లో కొత్త ఎంట్రీ, ఎగ్జిట్ మార్గాలపై ఇరాన్, ఒమన్ అవగాహన**

**సోమవారం గల్ఫ్ దేశాలకు వివరాలు వెల్లడించనున్న ఇరు దేశాలు**

**పశ్చిమాసియాలో ఉద్రిక్తతల వేళ కీలక పరిణామం**



పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు పెరుగుతున్న వేళ, ప్రపంచ దేశాల చూపు మరోసారి హర్మూజ్ జలసంధిపై పడింది. ప్రపంచ చమురు, ఇంధన సరఫరాకు అత్యంత కీలకమైన ఆ మార్గంలో ఇరాన్, ఒమన్ కలిసి కీలక నిర్ణయం తీసుకున్నాయి.

టెహ్రాన్ (సింగిడి)

2

ప్రభాతనవ సింగిడి
ప్రతి రంగూ ఓ నిజం
Singidi
సోమవారం 14 సెప్టెంబర్ 2026




# రోశయ్య దూరదృష్టి వల్లే తెలంగాణకు మిగులు బడ్జెట్

భవిష్యత్ ఉంటుందని రోశయ్య ఆనాడే సలహా ఇచ్చారు : ఆర్యవైశ్యులు ఆకలితో ఉన్నవారి ఆకలి తీరుస్తున్నారని రేవంత్ రెడ్డి ప్రశంసించారు. ఆర్యవైశ్య సోదరులు పేదలకు ఉదారంగా అప్పు ఇస్తారని, తాను సుదీర్ఘ కాలం రాజకీయాల్లో రాణిస్తానని మాజీ సీఎం రోశయ్య గుర్తించారని పేర్కొన్నారు. అసెంబ్లీలో దూకుడుగా మాట్లాడు తుంటే ఆవేశం తగ్గించుకోవాలని చెప్పారని, ఆవేశానికి ఆలోచన తోడయితే భవిష్యత్ ఉంటుందని రోశయ్య సలహా ఇచ్చారని గుర్తు చేసుకున్నారు. రోశయ్య ఎవరినైనా విమర్శిస్తారు కానీ దూషించరని కొనియాడారు. రోశయ్య విగ్రహం హైదరాబాద్‌లో ఉండాలని నిర్ణయించామని, హైదరాబాద్‌తోనే తన అనుబంధం ముడిపడి ఉందని రోశయ్య చెప్పేవారని సీఎం వెల్లడించారు.

ఆర్యవైశ్యులు కలిసికట్టుగా ఉంటేనే బలం : ఆర్యవైశ్యులు ఆర్థిక క్రమశిక్షణ కలిగిన వారన్న రేవంత్ రెడ్డి కాంగ్రెస్ హయాంలో గల్లాపెట్టె వ్యవహారం ఆర్యవైశ్యులకే ఇచ్చామని అన్నారు. ఆర్థికలావాదేవీల్లో సలహాల కోసం ఆర్యవైశ్యులనే అడుగుతారని, సీఎంలు ఎంతమంది మారినా ఆర్థికమంత్రిగా రోశయ్యనే ఉన్నారని, రోశయ్య దూరదృష్టి వల్లే తెలంగాణకు మిగులు బడ్జెట్ వచ్చిందని కొనియాడారు. ఆర్యవైశ్యులు కలిసికట్టుగా ఉంటేనే బలమని సూచించారు. ఆర్యవైశ్యుల బిడ్డ గాంధీ అంటే ప్రపంచంలో తెలియనివారు లేరని, ఆంధ్ర రాష్ట్ర కోసం ప్రాణత్యాగం పొట్టి శ్రీరాములు ఆర్యవైశ్యుడేనని గుర్తు చేశారు.

"ఆర్యవైశ్యులు ఆర్థిక క్రమశిక్షణ కలిగిన వారు. కాంగ్రెస్ హయాంలో గల్లాపెట్టె వ్యవహారం ఆర్యవైశ్యులకే ఇచ్చాం. ఆర్యవైశ్య భవన నిర్మాణానికి సహకరిస్తా. ఆర్యవైశ్యుల సమస్యలు నేను పరిష్కరిస్తాను. ఆర్యవైశ్యులు కలిసికట్టుగా ఉంటేనే బలం. ఆర్యవైశ్యులు సౌమ్యులు, ఆత్మాభిమానం కలిగిన వారు. పేదరికం ఉన్నా ఆర్యవైశ్యులు కడుపులో దాచుకుంటారు. ఆర్యవైశ్యులు ఆకలితో ఉన్నవారి ఆకలి తీరుస్తున్నారు" – రేవంత్ రెడ్డి, సీఎం

# బ్రిక్స్ పగ్గాలు చైనాకు..




బ్రిక్స్ ఇక కేవలం దేశాల కూటమి కాదని, పరిష్కారాల వ్యవస్థ అన్న ప్రధాని బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సు రెండో రోజు ప్రధాని నరేంద్ర మోదీ కీలక వ్యాఖ్యలు చేశారు. బ్రిక్స్ దేశాలు తీసుకున్న నిర్ణయాలు కేవలం పత్రాలకే పరిమితం కాకుండా, క్షేత్రస్థాయిలో కనిపించే ఫలితాలుగా మారాలని స్పష్టం చేశారు. దిల్లీలో ఆమోదించిన డిక్లరేషన్, బ్రిక్స్ దేశాల ఉమ్మడి లక్ష్యాలకు స్పష్టమైన దిశ చూపుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. దిల్లీలోని భారత్ మండపంలో జరిగిన 18వ బ్రిక్స్ సదస్సు ముగింపు సమావేశంలో ఆదివారం మధ్యాహ్నం మోదీ మరోసారి మాట్లాడారు. రెండు రోజుల పాటు జరిగిన చర్చలు బ్రిక్స్‌పై తమ నమ్మకాన్ని మరింత పెంచాయని అన్నారు. బ్రిక్స్ కేవలం కొన్ని దేశాలు కలిసి పనిచేసే వేదిక మాత్రమే కాదని, ప్రపంచ సమస్యలకు పరిష్కారాలు వెతికే వ్యవస్థగా మారుతోందని పేర్కొన్నారు.

**ఫలితాలు కనిపించాలి!**

బ్రిక్స్ సదస్సులో తీసుకున్న నిర్ణయాలను ఇకపై కాలపరిమితితో అమలు చేయాల్సిన అవసరం ఉందని మోదీ స్పష్టం చేశారు. నిర్ణయాలు, ప్రకటనలు కేవలం ఫైళ్లలో ఉండిపోకూడదని, ప్రజలకు నేరుగా ఉపయోగపడేలా వాటిని అమలు చేయాలని అన్నారు. చివరి స్థాయిలోనూ ఫలితాలు కనిపించేలా కలిసి పనిచేయాలని బ్రిక్స్ దేశాలకు పిలుపునిచ్చారు. ప్రపంచం ఇప్పుడు బ్రిక్స్ నుంచి కేవలం ఆలోచనలు, హామీలను మాత్రమే ఆశించడం లేదని అన్నారు. స్పష్టమైన ఫలితాలను కోరుకుంటోందని, బ్రిక్స్ మూడో దశాబ్దంలోకి అడుగుపెడుతున్న సమయంలో ఈ అంచనాలను అందుకోవాల్సిన బాధ్యత ఉందన్నారు.

కీలక ఖనిజాలు, సరఫరా వ్యవస్థల విషయంలో బ్రిక్స్ దేశాల మధ్య సహకారం మరింత పెరగాల్సిన అవసరం ఉందని మోదీ చెప్పారు. బ్రిక్స్ లాజిస్టిక్స్ సప్లై చైన్ కోఆపరేషన్ ఫ్రేమ్‌వర్క్ ద్వారా సరఫరా వ్యవస్థలను మరింత నమ్మకంగా, బలంగా మార్చుకోవచ్చని తెలిపారు. కీలక ఖనిజాలు ప్రస్తుతం ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు చాలా ముఖ్యమైనవిగా మారుతున్నాయని అన్నారు. ఇంధన భద్రతతో పాటు తక్కువ కాలుష్యంతో కూడిన సాంకేతికతల అభివృద్ధిలో వీటి పాత్ర కీలకమని చెప్పారు. వనరులు ఉన్న దేశాల హక్కులను గౌరవిస్తూ సరఫరా వ్యవస్థలను నమ్మకంగా, వైవిధ్యంగా, స్థిరంగా మార్చుకోవాల్సిన అవసరం ఉందన్నారు.

టెక్నాలజీ విషయంలో అందరికీ అవకాశం!

టెక్నాలజీ, కీలక ఖనిజాలను రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగించడం బ్రిక్స్ దేశాల ఉమ్మడి అభివృద్ధికి అడ్డంకిగా మారే అవకాశం ఉందని మోదీ హెచ్చరించారు. సాంకేతికతను అందిపుచ్చుకునే విషయంలో అందరికీ సమాన అవకాశాలు ఉండాలని అన్నారు. ఇదే సమయంలో కొత్త ఆవిష్కరణలకు బ్రిక్స్ ప్రాధాన్యం ఇస్తోందని చెప్పారు. బ్రిక్స్ ఇంక్యుబేటర్ నెట్‌వర్క్ ద్వారా స్టార్టప్‌లు, ఇంక్యుబేటర్లను అనుసంధానం చేయనున్నట్లు తెలిపారు. కొత్త ఆలోచనలు, పెద్ద స్థాయిలో అమలు చేయగల పరిష్కారాలను ప్రోత్సహించేందుకు బ్రిక్స్ స్టార్టప్ ఇన్నోవేషన్ ఫండ్‌ను ప్రతిపాదించినట్లు వెల్లడించారు. వ్యవసాయ రంగంలోనూ టెక్నాలజీని మరింత సమర్థంగా ఉపయోగించుకునేలా బ్రిక్స్ నెట్‌వర్క్ ఆన్ డిజిటల్ అగ్రికల్చర్‌ను ఏర్పాటు చేయనున్నట్లు మోదీ తెలిపారు. కృత్రిమ మేధ, భౌగోళిక సాంకేతికత, డిజిటల్ మౌలిక వసతులను రైతుల అవసరాలకు అనుగుణంగా ఉపయోగించుకోవడమే దీని లక్ష్యమన్నారు. గ్లోబల్ సౌత్ దేశాల్లో బ్రిక్స్‌పై నమ్మకం పెరుగుతోందని మోదీ చెప్పారు. ఆయా దేశాల గొంతుకను వినడం, వారి అనుభవాలను గౌరవించడం, వారికోసం మాత్రమే కాకుండా వారితో కలిసి పరిష్కారాలను రూపొందించడం వల్లే ఈ నమ్మకం పెరిగిందన్నారు.

**బ్రిక్స్ బలం వైవిధ్యంలోనే!**

వేర్వేరు దేశాలు, వేర్వేరు పరిస్థితులు ఉన్నప్పటికీ సహకారంతో ముందుకు సాగడమే బ్రిక్స్ ప్రత్యేకత అని ప్రధాని అన్నారు. వైవిధ్యమే తమ బలం అని పేర్కొన్నారు. ఈ సహకారం మానవాళికి ఉపయోగపడేలా ఉండాలని ఆకాంక్షించారు. సదస్సులో పాల్గొన్న దేశాల నేతలు, ప్రతినిధులకు మోదీ కృతజ్ఞతలు తెలిపారు. వారి సూచనలు, ఆలోచనలు బ్రిక్స్ సహకారానికి మరింత బలం చేకూర్చాయని అన్నారు. తదుపరి బ్రిక్స్ సదస్సుకు ఆతిథ్యం ఇవ్వనున్న చైనాకు శుభాకాంక్షలు తెలిపారు. న్యూఢిల్లీ సదస్సును విజయవంతం చేసిన అన్ని దేశాల బృందాలను అభినందించారు. దిల్లీ డిక్లరేషన్‌తో బ్రిక్స్ మరింత విస్తృతంగా, బలమైన లక్ష్యాలతో ముందుకు సాగాలని మోదీ స్పష్టం చేశారు.

# నడిసంద్రంలో మునిగిన నౌక

తూర్పు జావాలోని సురబయ నుంచి దక్షిణ కలిమంతన్ ప్రాంతంలోని బంజర్మసిన్‌కు ప్రయాణికులతో బయలుదేరిన విర్గో ట్రాన్స్‌పోర్ట్ 8 నౌక ప్రయాణంలో ఉండగా ఒక్కసారిగా సిగ్నల్స్ కోల్పోయి, కమ్యూనికేషన్ కట్ అయిపోయింది. ఈ నౌకలో సుమారు 240 మంది ప్రయాణికులు ఉన్నట్లుగా అధికార వర్గాలు వెల్లడించాయి.

**ప్రతికూల వాతావరణం వల్లే..**

తూర్పు జావా ప్రావిన్స్ నుంచి బయలుదేరిన ఈ నౌక మార్గమధ్యంలో ప్రతికూల వాతావరణాన్ని ఎదుర్కొన్నట్లుగా తెలిసింది. బంజర్మసిన్‌లోని ప్రధాన కేంద్రానికి సుమారు 148 కి.మీ దూరంలో జావా సముద్రంలో ఉండగా నౌకతో సంబంధాలు పూర్తిగా తెగిపోయాయి. ఈ అనూహ్య పరిణామంతో అప్రమత్తమైన ఇండోనేషియా రెస్క్యూ అధికారులు వెంటనే అప్రమత్తమయ్యారు. నౌక గల్లంతైన సమాచారం అందుకున్న వెంటనే సెర్చ్ అండ్ రెస్క్యూ అధికారులు సహాయక చర్యలను ముమ్మరం చేశారు. బంజర్మసిన్‌లోని త్రిశక్తి పోర్టు కేంద్రంగా ప్రత్యేక ఆపరేషన్ రూమ్‌ను ఏర్పాటు చేసి గాలింపు చర్యలు చేపట్టారు. ఇప్పటి వరకు సముద్రంలో నిర్వహించిన రెస్క్యూ ఆపరేషన్‌లో భాగంగా దాదాపు 102 మందిని రక్షించినట్లుగా అధికారులు తెలిపారు. గల్లంతైన మిగతా ప్రయాణికుల కోసం నేవీ, రెస్క్యూ బోట్లు, ప్రత్యేక బృందాలతో గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి.

# ఉచితాల హామీలు.. లక్ష కోట్ల లెక్కలు

మొదటి పేజీ తరువాయి

ఉద్యమకారులకు మరో లక్ష ఉద్యోగాలు.. సూపర్ న్యూమరీ పోస్టులు సృష్టిస్తామని ప్రకటించారు. మొత్తం 5 లక్షల పోస్టులుగా తీసుకుంటే.. ఒక్కో ఉద్యోగికి ఏడాదికి రూ.5 లక్షల వ్యయం అనుకున్నా.. జీతాలకే సుమారు రూ.25 వేల కోట్లు అవసరం అవుతాయి.

**లక్ష కోట్ల లెక్క ఎలా?**

విద్యకు రూ.20 వేల కోట్లు.. వైద్యానికి రూ.40 వేల కోట్లు.. రుణాలకు మరో రూ.20 వేల కోట్లు.. ఉద్యోగుల జీతాలకు సుమారు రూ.25 వేల కోట్లు.. ఈ నాలుగు అంశాలకే దాదాపు రూ.1.05 లక్షల కోట్ల అవసరం కనిపిస్తోంది. మరి ఈ మొత్తాన్ని ఏ మార్గంలో సమకూరుస్తారన్నదే ఇప్పుడు కీలకమైన ప్రశ్న.

**అప్పుల రాజకీయమేనా?**

తెలంగాణను కేసీఆర్ ప్రభుత్వం అప్పుల్లోకి నెట్టిందని రేవంత్‌రెడ్డి గతంలో విమర్శించారు. ఆరు సంవత్సరాల్లో రూ.2.05 లక్షల కోట్ల అప్పు తీసుకొచ్చారని ఆరోపించారు. అదే సమయంలో కేసీఆర్ కంటే ఎక్కువ వాగ్దానాలు చేసి రేవంత్‌రెడ్డి అధికారంలోకి వచ్చారని రాజకీయంగా చర్చ జరిగింది. ఇప్పుడు ప్రభుత్వంపై ఆర్థిక ఒత్తిడి ఉందని చెబుతూనే.. హామీల అమలుకు భూములను లీజుల పేరుతో వినియోగించుకోవడం, కొత్త రుణాలు సమీకరించడం వంటి చర్యలు చేపడుతున్నారన్న విమర్శలు ఉన్నాయి.

**కొత్త పార్టీ.. పాత రాజకీయమేనా**

ఇప్పటికే అధికార, ప్రతిపక్ష పార్టీలు ఉచితాలు, సంక్షేమ పథకాలతో ఓటర్లను ఆకర్షించే రాజకీయాలు చేస్తున్నాయన్న విమర్శలు ఉన్నాయి. ఇప్పుడు కవిత పార్టీ కూడా అదే మార్గంలో వెళ్తోందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అమ్మ జేబు చూడదు అంటున్న కవిత.. మరి లక్ష కోట్లకు పైగా అవసరమయ్యే ఈ పథకాలకు నిధులు ఎక్కడి నుంచి వస్తాయి? అప్పులు చేస్తారా.. కొత్త పన్నులు వేస్తారా.. ఆదాయాన్ని పెంచే మార్గాలు చూపిస్తారా? ప్రజలకు భారీ వాగ్దానాలు చేయడం ఒక ఎత్తయితే.. వాటిని అమలు చేయడానికి కావాల్సిన నిధులు చూపించడం మరో ఎత్తు. అందుకే కొత్త పార్టీకి అసలు పరీక్ష.. ఉచితాల ప్రకటనలు కాదు.. ఆ హామీలకు ఆర్థిక వనరులు ఎక్కడి నుంచి తెస్తారన్నదే.



# కేజ్రీవాల్ కొత్త కూటమి

వినాయక చవితి పండుగ వేళ గోవా రాజకీయంలో భారీ సంచలనం నమోదైంది. వచ్చే ఏడాది జరగనున్న గోవా శాసనసభ ఎన్నికల నేపథ్యంలో ఆమ్ ఆద్మీ పార్టీ , విజయ్ సర్దేశాయ్ నేతృత్వంలోని గోవా ఫార్వర్డ్ పార్టీ మధ్య పొత్తు ఖరారైంది. ఈ రెండు పార్టీలు ఉమ్మడిగా 'గోవా ఫస్ట్' పేరుతో కూటమిగా ఏర్పడినట్లు ఆప్ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ అధికారికంగా ప్రకటించారు. ఆదివారం గోవా వేదికగా నిర్వహించిన మీడియా సమావేశంలో కేజ్రీవాల్ మాట్లాడుతూ.. గోవాలో సుదీర్ఘకాలంగా కొనసాగుతున్న బీజేపీ, కాంగ్రెస్ పార్టీల లాలూచీ రాజకీయాన్ని అంతమొందించేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన స్పష్టం చేశారు.

**బీజేపీ, కాంగ్రెస్ కు ప్రత్యామ్నాయం:**

ఇన్నాళ్లూ గోవా ప్రజలకు బీజేపీ లేదా కాంగ్రెస్ తప్ప మరొక ప్రత్యామ్నాయం లేకపోయింది. కానీ ప్రజలు కోరుకుంటున్న అసలైన, పటిష్టమైన ప్రత్యామ్నాయం 'గోవా ఫస్ట్' కూటమితో సాకారమైందన్నారు. మేం మా స్వశక్తిపైనే ఈ ఎన్నికల్లో పోటీ చేసి ప్రభుత్వం ఏర్పాటు చేస్తామని ధీమా వ్యక్తం చేశారు. ప్రస్తుత బీజేపీ ప్రభుత్వం కాంగ్రెస్ ఫిరాయింపుదారులతోనే నడుస్తోంది. దానికి ఎటువంటి సిద్ధాంతాలు లేవు. ఇది కేవలం సొంత జేబులు నింపుకునే 'పాకెట్ ఫస్ట్' ప్రభుత్వం మాత్రమేన్నారు.

ఒక నిజమైన బీజేపీ ఓటరు ఎప్పటికీ కాంగ్రెస్‌కు ఓటు వేయరు. బీజేపీ పాలనపై ఎంత నిరాశ ఉన్నా వారు మా 'గోవా ఫస్ట్' కూటమిని ఆదరిస్తారు కానీ కాంగ్రెస్‌ను మాత్రం నమ్మరని కీలక వ్యాఖ్యలు చేశారు.

**గోవా రాజకీయంలో మలుపులు:**

తాజా కూటమి ఏర్పాటు నేపథ్యంలో గోవా కూటమి రాజకీయాల్లో అనేక మలుపు ఉన్నాయని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. 2017లో ఎన్నికల అనంతరం గోవా ఫార్వర్డ్ పార్టీ బీజేపీతో చేతులు కలిపి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయగా 2022 శాసనసభ ఎన్నికల్లో గోవా ఫార్వర్డ్ పార్టీ కాంగ్రెస్‌తో పొత్తు పెట్టుకుంది. ఆ ఎన్నికల్లో ఆప్ ఒంటరిగా బరిలోకి దిగింది. ఇక 2024 లోకసభ ఎన్నికల్లో కాంగ్రెస్, ఆప్, జీఎఫ్‌పీ కలసి పోటీ చేశాయగా ప్రస్తుతం రాబోయే ఎన్నికల కోసం ఆప్, జీఎఫ్‌పీ కలసి 'గోవా ఫస్ట్' రూపంలో కొత్త ప్రత్యామ్నాయంగా అవతరించాయి. దీంతో గోవా రాజకీయంలో చోటుచేసుకుంటున్న ఈ వరుస మార్పులు మాండోవి నది మలుపుల కంటే మించిన మలుపులు ఈ కూటమి రాజకీయాల్లో కనిపిస్తున్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి.

**ఇకపై 100 సార్లు చెక్ చేసుకుంటాం:**

ఆమ్ ఆద్మీ పార్టీకి చెందిన రాఘవ్ చద్దా, సందీప్ పాఠక్ సహా 7 మంది రాజ్యసభ ఎంపీల ఫిరాయింపు ఘటనపై కేజ్రీవాల్ తొలిసారి బహిరంగంగా స్పందించారు. మా పార్టీ ద్వారానే వారు రాజ్యసభకు వెళ్లారు. ప్రజలు వారిని నేరుగా ఎన్నుకోలేదు. పార్టీకి వారు తీవ్రమైన ద్రోహం చేశారన్నారు. ఈ పరిణామం మా ఎంపిక విధానంలో ఉన్న బలహీనతను చూపించిందని, ఇది ఆప్‌కు ఒక పెద్ద పాఠం అన్నారు. ఇకపై ఎవరినైనా రాజ్యసభకు పంపే ముందు వారు నమ్మదగినవారా లేదా అని 100 సార్లు వారి విశ్వసనీయతను తనిఖీ చేశాకే నిర్ణయం తీసుకుంటామన్నారు.

# దంచికొడుతున్న వానలు

**హైదరాబాద్, సెప్టెంబర్ 13 (సింగిడి)**

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో తెలంగాణ వ్యాప్తంగా వర్షాలు కురుస్తున్నాయి. రానున్న రెండ్రోజులు పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. ఈ మేరకు ఉత్తర తెలంగాణలోని పలు జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది.

వాతావరణ శాఖ అంచనా ప్రకారం.. ఆదివారం ఆదిలాబాద్, కుమ్రం భీం ఆసిఫాబాద్, మంచిర్యాల, పెద్దపల్లి జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. సోమవారం కూడా ఆదిలాబాద్, ఆసిఫాబాద్‌తో పాటు నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట జిల్లాల్లో వర్షాలు పడతాయని తెలిపింది. ఈ సమయంలో గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తాయని, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు పడతాయని పేర్కొంది.

గడిచిన 24 గంటల్లో రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో భారీ వర్షపాతం నమోదైంది. కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా రెబ్బెనలో అత్యధికంగా 9.35 సెం.మీ., ఖమ్మం జిల్లా కారేపల్లిలో 6.5 సెం.మీ. వర్షం కురిసింది. మంచిర్యాల జిల్లా కన్నెపల్లిలో ఏకంగా 13.55 సెం.మీ. వర్షపాతం నమోదైనట్లు తెలంగాణ అభివృద్ధి ప్రణాళిక సంస్థ (టీజీడీపీఎస్) గణాంకాలు వెల్లడించాయి.

ఈ వర్షాల కారణంగా ఉత్తర తెలంగాణలోని ప్రాజెక్టులకు వరద నీరు వచ్చి చేరుతోంది. ఆసిఫాబాద్ జిల్లాలోని వట్టివాగు, కుమరం భీం ప్రాజెక్టుల్లోకి 2,172 క్యూసెక్కుల వరద వస్తుండగా, అధికారులు 1,378 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. దీంతో రైతులు, లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. ఇక హైదరాబాద్ నగరంలో ఆకాశం మేఘావృతమై, తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉంది.

# మళ్లీ మంత్రినవుతా



మంత్రి పదవి నుంచి తొలగించినందుకు బాధ లేదని, కానీ అకారణంగా పదవి నుంచి తొలగించారని బాధ ఉందని కొండా సురేఖ అన్నారు. మంత్రి పదవి నుంచి తొలగించిన అనంతరం అల్లర్లు చేయాలని కొందరు ఫోన్ చేశారని కొండా సురేఖ వెల్లడించారు. కానీ తాను వారిని వారించానని వివరించారు. అధిష్ఠానం నిర్ణయానికి కట్టుబడి ఉండాలని కార్యకర్తలకు చెప్పానని, అండగా ఉన్నందుకు వారికి ధన్యవాదాలని చెప్పారు.

పదవులు ఇవాళ ఉంటాయి, రేపు పోతాయన్న సురేఖ, ప్రజల్లో చిరస్థాయిగా ఉండటమే తమ లక్ష్యమన్నారు. ప్రస్తుతం అవకాశవాద రాజకీయాలు ఎక్కువయ్యాయని ఆందోళన వ్యక్తం చేశారు. మంత్రి పదవి పోయిందని ఇంట్లో కూర్చోబోమని, ప్రజల్లోనే ఉంటామని, మున్సిపల్ ఎన్నికల్లో అన్నీ సీట్లు గెలుస్తామని సురేఖ స్పష్టం చేశారు. ఎవరు ఎంత ప్రయత్నం చేసినా వరంగల్ ఈస్ట్ నుంచి తనకే టికెట్ వస్తుందని కొండా సురేఖ ధీమా వ్యక్తం చేశారు. మళ్లీ ప్రభుత్వంలోకి వస్తామని, తాను మరోసారి మంత్రి పదవి చేపడతానన్నారు.

'రేవంతన్న లాంటి మాస్ లీడర్ కాంగ్రెస్‌కు అవసరమని చెప్పిన మొదటి వ్యక్తిని నేను. అదృష్టవశాత్తు కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చింది, నాకు మంత్రి పదవి వచ్చింది. ఎలాంటి తప్పులు చేయకుండా మంత్రి బాధ్యతలు నిర్వర్తించాను. పదవి నుంచి తొలగించినందుకు బాధ లేదు, కానీ అకారణంగా పదవి నుంచి తొలగించారనే బాధ ఉంది' – కొండా సురేఖ, మాజీ మంత్రి

తాము నమ్మిన రాజశేఖర్‌రెడ్డి కోసం గతంలో మంత్రి పదవికి రాజీనామా చేశానని గుర్తు చేశారు. గతంలో కొంతమంది తమకు టికెట్ రాకుండా చేశారని, అప్పుడు కాంగ్రెస్‌లో టికెట్ రాకపోతే, కేసీఆర్ పిలిచి వరంగల్ ఈస్ట్ టికెట్ ఇచ్చారని తెలిపారు. అప్పట్లో కేసీఆర్ తమకు అవకాశం ఇచ్చినందుకు నాడు మంత్రిగా ఉన్న వ్యక్తిని ఓడించామన్నారు. నాడు వరంగల్ ఈస్ట్‌లో తాము గెలిచినందునే ప్రజలు ప్రశాంత జీవితం గడిపారని, కొండా మురళి ఉన్నారనే ధైర్యంతో వరంగల్ ఈస్ట్ ప్రజలు ఉండేవారన్నారు. అక్కడ నుంచి పరకాల వస్తే ప్రజలు ఆదరించారన్నారు.

అంతకు ముందు మాట్లాడిన కొండా మురళి తాము కాంగ్రెస్‌లోనే కొనసాగుతామన్నారు. ఇటీవల ఘటనపై సురేఖను సారీ చెప్పమన్నారని, పదవి ఉంటే ఉండనీ, పోతే పోనీ అని సారీ చెప్పలేదన్నారు. కృతజ్ఞత తమ రక్తంలో, కుటుంబంలో ఉందన్నారు. రాహుల్‌గాంధీని ప్రధాని మంత్రిని చేయడమే తమ లక్ష్యమన్నారు.

## కాంగ్రెస్‌ను వీడేది లేదు

పదవుల మీద నాకు వ్యామోహం లేదని కొండా సురేఖను సారీ అని ఒక్క మాట చెప్పమన్నారని అన్నారు. కానీ నా పదవి ఉంటే ఉండనీ. పోతే పోనీ అని నా భార్య సారీ చెప్పలేదన్నారు. కొండా సురేఖను గెలిపించడంలో రాహుల్ గాంధీ పాత్ర ఉందని రాహుల్ గాంధీని ప్రధానిగా చేయడమే మా లక్ష్యం అన్నారు. మాట కోసం నిలబడతామని పదవులు ఇవాళ వస్తాయి.. రేపు పోతాయన్నారు. నా శరీరంలో నాలుగు బుల్లెట్లు ఉన్నాయి. బుల్లెట్లున్నా నేను బతికే ఉన్నా. కొండా సురేఖది నాది ఒక్కటే మాట. మా బిడ్డది మాత్రం వేరే మాట, వేరే బాట అన్నారు. రేవంత్ రెడ్డి, మహేశ్ గౌడ్ కష్టాల నుంచి వచ్చినవారే కార్పొరేషన్ ఎన్నికల్లో ఇక్కడ తిరుగుతాం. గెలుపు గుర్రాలకు టికెట్లు మేమే ఇస్తామన్నారు.

# తెలంగాణలో లోక్ అదాలత్ సక్సెస్

రాష్ట్రవ్యాప్తంగా కోర్టులలో కేసుల భారాన్ని తగ్గించడంతో పాటు, కక్షిదారుల సమయం, డబ్బు ఆదా చేసే లక్ష్యంతో ఈ లోక్ అదాలత్ నిర్వహించారు. ఇరు పక్షాల మధ్య రాజీ, పరస్పర అంగీకారం ద్వారా వివిధ రకాల కేసులను పరిష్కరించేందుకు ఈ కార్యక్రమం దోహదపడింది. ఈ అవకాశాన్ని ప్రజలు పూర్తిగా సద్వినియోగం చేసుకోవాలని పోలీసులు ప్రోత్సహించారు. ఇందుకోసం పరిష్కారానికి అర్హత ఉన్న కేసులను గుర్తించి, ఇరువర్గాలకు పోలీసులు నోటీసులు జారీ చేశారు. డీజీపీ కార్యాలయం విడుదల చేసిన ప్రకటన ప్రకారం, సెప్టెంబర్ 3న ప్రారంభమైన కేసుల పరిష్కార ప్రక్రియ సెప్టెంబర్ 12న ముగిసింది. ఈ సమయంలో మొత్తం 1,51,164 కేసులు పరిష్కారమయ్యాయి. వీటిలో 21,843 ఎఫ్ఐఆర్ కేసులు, 1,404 విపత్తు నిర్వహణ కేసులు, 61,052 పెట్టీ కేసులు, 62,969 మోటార్ వాహన చట్టం కేసులు ఉన్నాయి. ప్రత్యేకించి, 3,896 సైబర్ క్రైమ్ కేసుల పరిష్కారం ద్వారా బాధితులకు రూ.42.29 కోట్ల మొత్తాన్ని తిరిగి చెల్లించారు.

కేసుల పరిష్కారంలో అత్యుత్తమ పనితీరు కనబరిచిన పోలీస్ యూనిట్లలో హైదరాబాద్ (15,944 కేసులు), ఖమ్మం (10,955 కేసులు), గద్వాల (8,469 కేసులు), వరంగల్ (8,404 కేసులు), మల్కాజ్‌గిరి (8,109 కేసులు) ముందున్నాయి.

తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ, జిల్లా జడ్జిలు, మేజిస్ట్రేట్లు, జిల్లా న్యాయ సేవాధికార సంస్థలు , పోలీస్ కమిషనర్లు, జిల్లా ఎస్పీల సమష్టి కృషితో ఇంత పెద్ద సంఖ్యలో కేసులను పరిష్కరించడం సాధ్యమైందని డీజీపీ తెలిపారు. ఈ సమన్వయంతో కూడిన ప్రయత్నం వల్ల లోక్ అదాలత్ గొప్ప విజయాన్ని సాధించిందని ఆయన పేర్కొన్నారు.

# హర్మూజ్ జలసంధిపై కొత్త మార్గాలు

హర్మూజ్ జలసంధిలో కొత్త ఎంట్రీ, ఎగ్జిట్ మార్గాలను ఏర్పాటు చేసేందుకు ఇరు దేశాలు అంగీకరించినట్లు సమాచారం. ఈ మార్గాలకు సంబంధించిన వివరాలను గల్ఫ్ దేశాలకు కూడా వివరించేందుకు సిద్ధమవుతున్నాయి. చైనా ప్రభుత్వ వార్తా సంస్థ జిన్హువా వెల్లడించిన వివరాల ప్రకారం, కొత్త మార్గాలపై ఇరాన్, ఒమన్ మధ్య చర్చలు జరిగాయి. ఆ చర్చల్లో మార్గాల విషయంలో ఒక అవగాహనకు వచ్చాయి. సోమవారం ఒమన్ రాజధాని మస్కట్‌లో జరగనున్న ప్రాంతీయ సమావేశంలో గల్ఫ్ దేశాలకు ఈ వివరాలను వెల్లడించనున్నట్లు ఇరాన్ అధికారులు తెలిపారు.

**హర్మూజ్‌పై పెరిగిన ఫోకస్**

ఇరాన్, ఒమన్ మధ్య తాజా అవగాహనకు పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్తతల నేపథ్యంలో ప్రాధాన్యం ఏర్పడింది. హర్మూజ్ జలసంధి ప్రపంచ ఇంధన రవాణాలో అత్యంత కీలకమైన మార్గాల్లో ఒకటి. ఈ ప్రాంతంలో ఎలాంటి అంతరాయం ఏర్పడినా అంతర్జాతీయ వాణిజ్యం, ఇంధన సరఫరాపై ప్రభావం పడే అవకాశం ఉంటుంది. అందుకే హర్మూజ్ జలసంధిలో రాకపోకలు సాఫీగా కొనసాగడం ఇప్పుడు ప్రాంతీయ దేశాలతో పాటు ప్రపంచ దేశాలకు కూడా ముఖ్యమైన అంశంగా మారింది. ఈ నేపథ్యంలో కొత్త ఎంట్రీ, ఎగ్జిట్ మార్గాలపై ఇరాన్, ఒమన్ తీసుకున్న నిర్ణయం ఆసక్తిని రేపుతోంది.

**బ్రిక్స్ వేదికగా ఇరాన్ అధ్యక్షుడి కీలక వ్యాఖ్యలు**

ఇదే సమయంలో దిల్లీలో జరుగుతున్న బ్రిక్స్ సదస్సు వేదికగా ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్ కీలక వ్యాఖ్యలు చేశారు. భారత్ వేదికగా ఇచ్చిన ఓ ప్రత్యేక ఇంటర్వ్యూలో ఆయన బ్రిక్స్ లక్ష్యాలను వివరించారు. అమెరికా విధిస్తున్న ఏకపక్ష ఆంక్షలకు ప్రత్యామ్నాయంగా బ్రిక్స్ దేశాలు కలిసి పనిచేయాల్సిన అవసరం ఉందని పెజెష్కియాన్ అన్నారు. ఒక దేశం తనకు నచ్చిన దేశంపై ఆంక్షలు విధించే పరిస్థితిని మార్చడమే బ్రిక్స్ ఉద్దేశాల్లో ఒకటని చెప్పారు. ఆంక్షలతో సంబంధం లేకుండా బ్రిక్స్ దేశాల మధ్య వాణిజ్యం, సహకారం కొనసాగేలా కొత్త మార్గాలను అభివృద్ధి చేయాలని ఆయన అభిప్రాయపడ్డారు. ఏకపక్ష విధానాలకు వ్యతిరేకంగా సభ్య దేశాలు ఒకరికొకరు మద్దతుగా నిలవాలని అన్నారు.

**పశ్చిమాసియాపై బ్రిక్స్ ఏకాభిప్రాయం**

మరోవైపు పశ్చిమాసియాలో పరిస్థితిపై బ్రిక్స్ దేశాల మధ్య ఏకాభిప్రాయం కుదిరిందని భారత విదేశాంగ శాఖ ఆర్థిక సంబంధాల కార్యదర్శి సుధాకర్ దలేలా తెలిపారు. దిల్లీలో బ్రిక్స్ సదస్సు ముగిసిన తర్వాత నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన ఈ విషయం వెల్లడించారు. పశ్చిమాసియాలో సమస్యలకు చర్చలు, దౌత్య మార్గాలే పరిష్కారమని బ్రిక్స్ దేశాలు భావిస్తున్నాయని చెప్పారు. భిన్నమైన అభివృద్ధి నమూనాలు, ఆర్థిక వ్యవస్థలు ఉన్న దేశాలు బ్రిక్స్‌లో సభ్యులుగా ఉన్నందు, ప్రతి దేశం తన అభిప్రాయాన్ని స్వేచ్ఛగా చెప్పేందుకు భారత్ వేదిక కల్పించిందని తెలిపారు. అందరి అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని ఏకాభిప్రాయానికి వచ్చినట్లు దలేలా చెప్పారు. శాశ్వత శాంతి, భద్రత, స్థిరత్వం కోసం చర్చలు, దౌత్యమే ప్రధాన మార్గాలని స్పష్టం చేశారు.

# ఏపీ టెట్ ఫలితాలు విడుదల

టెట్‌లో విజయం సాధించిన అభ్యర్థులకు మంత్రి లోకేశ్ అభినందనలు తెలిపారు. అర్హత సాధించలేకపోయిన వారు నిరుత్సాహపడొద్దని కోరారు. ఈ ఫలితాలను https://tet2dsc. apcfss.in/లో చూసుకోవచ్చు. వాట్సాప్ ద్వారా 9552300009 నెంబర్‌లోనూ ఫలితాలు తెలుసుకోవచ్చు.



# మెగా డీఎస్సీ: కూటమి ప్రభుత్వంపై జగన్ మరోసారి ఫైర్

**డీఎస్సీ పోస్టింగ్‌లో అక్రమాలు జరిగాయంటూ వైసీపీ అధినేత జగన్ ఆరోపణలు**

**అమరావతి, సెప్టెంబర్ 13 (సింగిడి)**

టీడీపీ ప్రభుత్వం చేపట్టిన మెగా డీఎస్సీ నియామక ప్రక్రియలో భారీ స్కాం జరిగిందంటూ వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్ ఆరోపిస్తుండడం తెలిసిందే. దీనిపై ఆయన సోషల్ మీడియా వేదికగా మరోసారి ధ్వజమెత్తారు. ఓ అభ్యర్థి విషయంలో జరిగింది సరైన, పారదర్శక విధానమేనా? అని ముఖ్యమంత్రి చంద్రబాబును నిలదీశారు. ఈ మేరకు ఆయన సోషల్ మీడియా వేదికగా పలు ప్రశ్నలు సంధించారు. జగన్ తన పోస్టులో పేర్కొన్న వివరాల ప్రకారం, ఒక అభ్యర్థికి 65 టెట్ మార్కులతో, ఏడు దశల వెరిఫికేషన్ తర్వాత ఉద్యోగం కేటాయించారు. అయితే, ఆ తర్వాత అదే అభ్యర్థి అనర్హుడని డీఈవో నిర్ధారించారని తెలిపారు. అలాంటప్పుడు ఆ ఏడు దశల వెరిఫికేషన్‌లో ఏం జరిగిందని ప్రశ్నించారు. తనకు ఉద్యోగం ఎలా వచ్చిందో తెలియదని అభ్యర్థే చెప్పిన విషయాన్ని కూడా జగన్ ప్రస్తావించారు. విమర్శలు వెల్లువెత్తిన తర్వాత, ఆ అభ్యర్థికి 2018 టెట్‌లో 77 మార్కులు వచ్చాయని అధికారులు చెప్పడంపై జగన్ సందేహాలు లేవనెత్తారు. ఆ మార్కులు ముందే ఉంటే, డీఈవో ఎందుకు అనర్హుడని ప్రకటించారని ప్రశ్నించారు. అంతేకాకుండా, ఆ 77 మార్కులు ఎస్‌జీటీ పోస్టుకు అవసరమైన పేపర్–I–Aకు బదులుగా, స్కూల్ అసిస్టెంట్ స్పెషల్ ఎడ్యుకేషన్‌కు సంబంధించిన పేపర్–II–Bలో వచ్చాయని, అయినా ఎలా అర్హత కల్పించారని నిలదీశారు. 2018 టెట్ స్కోర్‌తోనే ఉద్యోగానికి అర్హత ఉంటే, ఆ అభ్యర్థి 2025లో మళ్లీ టెట్ ఎందుకు రాశారని జగన్ ప్రశ్నించారు. ఇన్ని మలుపుల తర్వాత ఈ నియామక ప్రక్రియను పారదర్శకంగా జరిగిందని చెప్పగలరా? అని అన్నారు. ఇది డీఎస్సీ స్కామ్‌ను ప్రోత్సహించడం కాదా? అని ప్రశ్నిస్తూ, దీనికి చంద్రబాబు నైతిక బాధ్యత వహించాలని జగన్ డిమాండ్ చేశారు.

## బొల్లారం ఆయుధాల చోరీ కేసు

# మల్లేశ్‌కు లోపలి వ్యక్తి సహకారం!

**హైదరాబాద్, సెప్టెంబర్ 13 (సింగిడి)**

దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన మద్రాస్ రెజిమెంట్ ఆయుధాల చోరీ కేసు విచారణను పోలీసులు వేగవంతం చేశారు. ఈ వ్యవహా రం వెనక ఇంకా పెద్ద ముఠా ఏమైనా ఉం దా? లేక ఎవరైనా కీలక పాత్ర పోషించారా? అనే అనుమానం బలపడుతోంది. చోరీ జరిగిన తీరు, ఆయుధాల భద్రతను దాటు కొని ప్రవేశించిన తీరు చూస్తుంటే ఇదంతా ఒక్కడితో జరిగే పని కాదనే కోణంలో దర్యాప్తు సంస్థలు విచారణను తీవ్రతరం చేశాయి. సికింద్రాబాద్ బొల్లారంలోని మద్రాస్ రెజిమెంట్ 20వ బెటాలియన్ పరిధిలోని ఆయుధాల చోరీ కేసును పోలీసులు భిన్న కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు. కేసులో ప్రధాన నిందితుడు మాజీ హవల్దార్ మల్లేశ్‌ను అరెస్ట్ చేసి ఆయుధాలను స్వాధీనం చేసుకున్నా, దర్యాప్తు చేస్తున్న కొద్దీ అనేక విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. కిలోల కొద్దీ బరువుండే ఏకే–47, పిస్తోళ్లు, మందుగుండు సామగ్రిని ఒక్కడే ఎలా ఎత్తుకెళ్లాడు? ఆ కుట్ర వెనక ఇంకెవరైనా సూత్రధారులు ఉన్నారా? అనే కోణంలో పోలీసులు లోతుగా ఆధారాలు సేకరిస్తున్నారు. ఆయుధాలు ఎత్తుకెళ్లేందుకు స్థానికంగా ఆర్మీలో పని చేస్తున్న ఒక ఉద్యోగి సహకారం తీసుకున్నట్లు సమాచారం.

ప్రభాతనవ సింగిడి ప్రతి రంగూ ఓ నిజం
Singidi సోమవారం 14-9-2026

## సురక్షిత సిద్ధిపేట సాధనకు కృషి చేయాలి

- పోలీస్ కమిషనర్ రష్మీ పెరుమాళ్




**సిద్ధిపేట బ్యూరో, సెప్టెంబర్ 13 (సింగిడి):** సిద్దిపేట మహిళా పోలీస్ స్టేషన్ అధికారులు, సిబ్బందితో పోలీస్ కమిషనర్ రష్మి పెరుమాళ్ రోజున ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పోలీసు స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులు, బాధితులతో వ్యవహరించే తీరు, అవగాహన కార్యక్రమాలు, మహిళా రక్షణ చర్యలపై సిబ్బందికి పలు కీలక సూచనలు చేశారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే బాధితులు, ఫిర్యాదుదారులు వారి కౌన్సెలర్లతో ఎంతో శాంతంగా, ఓర్పుతో మాట్లాడాలన్నారు. సమస్యలను సమగ్రంగా విని, ఇరు వర్గాలకు కౌన్సెలింగ్ ఇచ్చి సాధ్యమైనంత వరకు సమస్యలను సజావుగా పరిష్కరించేలా చొరవ చూపాలన్నారు. విద్యార్థులకు, ముఖ్యంగా బాలికలకు నాణ్యమైన అవగాహన కార్యక్రమాలను పాఠశాలలు, కళాశాలల్లో క్రమం తప్పకుండా నిర్వహించాలన్నారు. ప్రస్తుత డిజిటల్ యుగంలో మహిళలు, యువతులు ఎదుర్కొంటున్న సైబర్ మార్ఫింగ్, సోషల్ మీడియా వేధింపులు మరియు ఆన్‌లైన్ మోసాలపై స్పష్టమైన అవగాహన కల్పించాలన్నారు. అత్యవసర సమయాల్లో 112 హెల్ప్‌లైన్ నంబర్ ప్రాముఖ్యత, మహిళా భద్రతా చట్టాల పై ప్రజలకు పూర్తి అవగాహన కల్పించాలి అని సూచించారు. క్విక్ రెస్పాన్స్ టీమ్ ఆధ్వర్యంలో విద్యార్థినులు, ఉద్యోగినులకు ప్రాథమిక ఆత్మరక్షణ నైపుణ్యాలను నేర్పించేందుకు శిక్షణ తరగతులు ఏర్పాటు చేయాలన్నారు. ప్రభావవంతమైన సమాజ అవగాహన కార్యక్రమాల ద్వారా మహిళలపై జరిగే అరాచకాలను అరికట్టి, సమాజంలో సానుకూల సామాజిక మార్పును తీసుకురావడమే ధ్యేయం కావాలి అని తెలిపారు. ప్రజల్లో నమ్మకం పెంచేలా పోలీసింగ్ ఉండాలని, అందరూ కలిసికట్టుగా పనిచేసి సురక్షిత సిద్ధిపేట సాధనకు కృషి చేయాలని సీపీ పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో మహిళా పోలీస్ స్టేషన్ సీఐ దుర్గా, భరోసా సిబ్బంది పాల్గొన్నారు.

## జ్యూట్ బ్యాగులతో పర్యావరణహిత వినాయకుడు

- త్రివేణి పాఠశాలలో ఘనంగా వినాయక చవితి వేడుకలు
- ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన విద్యార్థుల సృజనాత్మకత



**రామచంద్రాపురం, సెప్టెంబర్ 13 (సింగిడి):** సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు నియోజకవర్గం పరిధిలోని రామచంద్రాపురం మండలంలో బీరంగూడ కమాన్ వద్ద ఉన్న త్రివేణి స్కూల్‌లో వినాయక చవితి వేడుకలను శనివారం భక్తిశ్రద్ధలతో, ఉత్సాహభరిత వాతావరణంలో ఘనంగా నిర్వహించారు. భారతీయ సంస్కృతి, సంప్రదాయాలతో పాటు పర్యావరణ పరిరక్షణపై విద్యార్థుల్లో చైతన్యం కల్పించే లక్ష్యంతో ఈ కార్యక్రమం చేపట్టారు. ఈ వేడుకల్లో ప్లాస్టర్ ఆఫ్ పారిస్ (పీవోపీ), ప్లాస్టిక్ వంటి హానికర పదార్థాలకు స్వస్తి పలుకుతూ సహజసిద్ధమైన జ్యూట్ బ్యాగులతో విద్యార్థులు స్వయంగా రూపొందించిన పర్యావరణహిత వినాయక విగ్రహం విశేషంగా ఆకట్టుకుంది. పండుగ సంబరాలతో పాటు ప్రకృతిని కాపాడాలనే సందేశాన్ని విద్యార్థులు చాటిచెప్పారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన భక్తిగీతాలు, నృత్యాలు, సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. ఈ సందర్భంగా పాఠశాల యాజమాన్యం మాట్లాడుతూ.. చిన్నతనం నుంచే చిన్నారుల్లో పర్యావరణ స్పృహ, సమాజం పట్ల బాధ్యత, సంస్కృతిపై గౌరవాన్ని పెంపొందించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రకృతికి హాని కలగకుండా పండుగలు జరుపుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ వీరేంద్ర చౌదరి, సీఆర్ఓ సాయి నరసింహారావు, ప్రిన్సిపల్ భవాని, క్యాంపస్ ఇన్‌చార్జ్ శ్రీకాంత్‌తో పాటు ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రకృతిని కాపాడండి... పర్యావరణాన్ని పరిరక్షించండి

### పర్యావరణహిత మట్టి గణపతి విగ్రహాల ఉచిత పంపిణీ

### ఎన్విరాన్మెంటల్ ఇంజనీర్ బి. రాజేందర్ పిలుపు



**మేడ్చల్ కలెక్టరేట్, సెప్టెంబర్ 13 (సింగిడి):** ప్రకృతిని కాపాడండి పర్యావరణాన్ని పరిరక్షించండి పర్యావరణ సహిత మట్టి గణపతి విగ్రహాలను పూజించండని ఎన్విరాన్మెంటల్ ఇంజనీర్ బి రాజేందర్ పిలుపునిచ్చారు. వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని పర్యావరణ పరిరక్షణలో భాగంగా తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి (టి జి పి సి బి), ప్రాంతీయ కార్యాలయం--మేడ్చల్ ఆధ్వర్యంలో మేడ్చల్--మల్కాజ్‌గిరి జిల్లాలోని పలు ప్రాంతాల్లో ప్రజలకు పర్యావరణహిత మట్టి గణపతి విగ్రహాలను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ ఉచిత పంపిణీ కార్యక్రమం క్రింది ప్రాంతాల్లో నిర్వహించబడింది: 1. జీడిమెట్ల ఇండస్ట్రీస్ అసోసియేషన్ భవనం 2. బీబీఆర్ ఆసుపత్రి సమీపంలో, బాలానగర్3. కూకట్‌పల్లి మెట్రో స్టేషన్ సమీపంలో4. బోధి సత్వ స్కూల్, సుభాష్‌నగర్, కుత్బుల్లాపూర్5. కొంపల్లి6. ఆనంద్‌బాగ్7. రాంపల్లి8. నాగారం ఈ సందర్భంగా ప్రజలకు మట్టి గణపతి విగ్రహాల వినియోగం వల్ల కలిగే పర్యావరణ ప్రయోజనాలను అధికారులు వివరించారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలు మరియు కృత్రిమ రంగుల వినియోగం వల్ల నీటి వనరులు కలుషితమయ్యే అవకాశం ఉన్నందున, వాటికి బదులుగా సహజ మట్టితో తయారు చేసిన పర్యావరణహిత గణపతి విగ్రహాలను వినియోగించాలని సూచించారు. మట్టి గణపతి విగ్రహాలు నీటిలో సులభంగా కరిగిపోవడంతో పాటు పర్యావరణానికి అనుకూలంగా ఉంటాయని, ప్రజలు పర్యావరణహిత పద్ధతుల్లో వినాయక చవితి పండుగను నిర్వహించాలని టీజీ పిసీబీ అధికారులు ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమాన్ని శ్రీ బి. రాజేందర్ గారు, ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్, తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి, ప్రాంతీయ కార్యాలయం--మేడ్చల్, వారి ఆధ్వర్యంలో కార్యాలయ సిబ్బందితో కలిసి నిర్వహించారు.

## మట్టి వినాయకులను పూజిద్దాం పర్యావరణ పరిరక్షణ ను కాపాడుదాం

### మాజీ కార్పొరేటర్ మేకల సునీత రాము యాదవ్



**మల్కాజిగిరి, సెప్టెంబర్ 13 (సింగిడి):** వినాయక నవరాత్రుల సందర్భంగా గౌతమ్ నగర్ డివిజన్ సాయి నగర్ లోని మాజీ కార్పొరేటర్ మేకల సునీత రామ యాదవ్ తన కార్యాలయం లో మట్టి వినాయకులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాజీ కార్పొరేట్ మేకల సునీత రాము యాదవ్ మాట్లాడుతూ మట్టి వినాయకులను పూజిద్దాం పర్యావరణ పరిరక్షణ కాపాడుదాం అన్నారు. ఈ కార్యక్రమంలో ఉత్తమ్ నగర్, దయానంద్ నగర్, ఏకలవ్య నగర్, గౌతమ్ నగర్, మల్లికార్జున్ నగర్, హనుమాన్ పేట్, కాలనీ వాసులు, బిఆర్ఎస్ సీనియర్ నాయకులు బైరు అనిల్ కుమార్, నాగేష్ గౌడ్, మర్రి శ్రీనివాస్, శంకర్, చిట్టీ బాబు, లక్ష్మణ్ యాదవ్, విజయ్, గణేష్ నాయక్, సుధాకర్, లక్ష్మణ్ చారి, హబీబ్, విఘ్నేష్, హనుమాన్ గణేశ్వర్, భూమయ్య, మహిళా నాయకురాలు సుమతి, విజయలక్ష్మి, సరిత, లక్ష్మి, మౌనిక తదితరులు పాల్గొన్నారు.

## మట్టి గణపతి పూజిద్దాం.. పర్యావరణాన్ని కాపాడుకుందాం



**కీసర, సెప్టెంబర్ 13 (సింగిడి):** ఘట్కేసర్ సర్కిల్, నాగారం డివిజన్ బిఆర్ఎస్ 6వార్డు మాజీ కౌన్సిలర్ అనంతరెడ్డి గ్రామ ప్రజలకు వినాయక చవితి శుభాకాంక్షలు తెలుపుతూ.. అందరూ మట్టి గణపతులకు పూజలు చేయాలని కోరుతూ డివిజన్ పరిధిలో గల మాజీమంత్రి, ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి చేతులమీదుగా ఉచితంగా మట్టి గణపతుల పంపిణీ 13వ తేదీ ఉదయం 10 గంటలకు రాంపల్లి మహంకాళి అమ్మవారి ఆలయం దగ్గర నిర్వహిస్తున్నామని, ఈ సందర్భంగా తెలిపారు. ఆసక్తి కలిగిన భక్తులు, గ్రామ ప్రజలు ఈ అవకాశవాన్ని సద్వినియోగం చేసుకుంటారని ఆశిస్తున్నాని తెలిపారు.

# తెల్లాపూర్ ఆర్‌యూబీ విస్తరణకు రూ. 21 కోట్లు మంజూరు

- ఎంపీ రఘునందన్ రావు
- 25 ఏళ్ల ప్రజల కష్టాలకు త్వరలోనే పరిష్కారం
- రైల్వే, జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి క్షేత్రస్థాయి పరిశీలన
- కాలనీవాసులకు ఇబ్బంది లేకుండా పనులు పూర్తి చేయాలని ఆదేశం




**రామచంద్రపురం, సెప్టెంబర్ 13 (సింగిడి):** సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు నియోజకవర్గం పరిధిలోని రామచంద్రపురం పరిధిలోని తెల్లాపూర్ డివిజన్ పరిధిలో దశాబ్దాలుగా నెలకొన్న ట్రాఫిక్ సమస్యకు త్వరలోనే మోక్షం లభించనుందని మెదక్ పార్లమెంట్ సభ్యులు రఘునందన్ రావు తెలిపారు. తెల్లాపూర్ నుండి విద్యుత్ నగర్ వెళ్లే మార్గంలోని రైల్వే అండర్ బ్రిడ్జ్ (ఆర్‌యూబీ) చాలా ఇరుగ్గా ఉండటంతో గత 25 సంవత్సరాలుగా స్థానిక కాలనీవాసులు, వాహన దారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యను కేంద్ర రైల్వే శాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్లి ప్రత్యేక చొరవతో రూ. 21 కోట్ల నిధులు మంజూరు చేయించినట్లు ఎంపీ పేర్కొన్నారు. ఈ మేరకు రైల్వే, జీహెచ్ఎంసీ ఉన్నతాధికారులతో కలిసి ఎంపీ రఘునందన్ రావు క్షేత్రస్థాయిలో బ్రిడ్జి పరిసర ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. "తెల్లాపూర్, విద్యుత్ నగర్ పరిసర ప్రాంతాలు శరవేగంగా అభివృద్ధి చెందుతున్న తరుణంలో, ఇరుకైన ఈ అండర్ పాస్ వల్ల నిత్యం ట్రాఫిక్ స్తంభించి ప్రజలు తీవ్ర అవస్థలు ఎదుర్కొంటున్నారు. గత 25 ఏళ్లుగా ఈ సమస్య అపరిష్కృతంగా ఉంది. స్థానికుల కష్టాలను గుర్తించి కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లగా, తక్షణమే స్పందించి రూ. 21 కోట్లు మంజూరు చేసింది. ఆధునిక హంగులతో నూతన అండర్ పాస్ నిర్మాణం చేపట్టబోతున్నాం" అని తెలిపారు. అలాగే నిర్మాణ పనుల సమయంలో అండర్ పాస్‌కు ఇరువైపులా ఉన్న కాలనీల ప్రజలకు ఎలాంటి రాకపోకల ఇబ్బందులు కలగకుండా ముందస్తు ప్రణాళికతో పనులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ నిర్దేశిత గడువులోగా పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని రైల్వే, జీహెచ్ఎంసీ అధికారులకు పలు కీలక సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో రైల్వే శాఖ ఇంజనీరింగ్ విభాగం అధికారులు, డిప్యూటీ కమిషనర్ జ్యోతి రెడ్డి, జీహెచ్ఎంసీ అధికారులు, తెల్లాపూర్ డివిజన్ బిజెపి అధ్యక్షుడు రాంబాబు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## స్పీకర్‌ను పదే పదే దళితుడని అవమానం చేస్తున్నది కాంగ్రెస్ నాయకులే..

### ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్



**వికారాబాద్ ప్రతినిధి, సెప్టెంబర్ 13 (సింగిడి):** దళితులపై వల్లమాలిన కపటపు ప్రేమ చూపుతున్న కాంగ్రెస్ నాయకులు స్పీకర్ ప్రసాద్ కుమార్ పదే పదే దళితుడని అవమాన కరంగా మాట్లాడుతున్నారని బిఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్ ఎస్ ప్రవీణ్ కుమార్ అన్నారు. శనివారం జిల్లా పరిధిలోని నవాబుపేట మండలం కేంద్రంలో బిఆర్ఎస్ యువజన సమ్మేళనాన్ని జామ చంద్రం అధ్యక్షతన, సుధాకర్ ఆధ్వర్యంలో పార్టీ మండల అధ్యక్షుడు దయాకర్ రెడ్డి నేతృత్వంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి హజరైనా ఆర్ ఎస్ ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ యువత ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేయడం అభినందనీయ మన్నారు. కేటీఆర్ ఆదేశాల మేరకు తెలంగాణ లో జరుగుతున్న పరిణామాలు తెలుసుకున్న కాంగ్రెస్ 420 దొంగ హామీలు ఇచ్చి అమలు చేయకుండా మోసం చేసిందన్నారు. పార్టీ ఇచ్చిన పిలుపు ఏదైనా విజయవంతం చేయడం గొప్ప విషయమని మన్నారు. జిల్లా పరిధిలోని మర్పల్లిలో మండలం లో సోషల్ మీడియాలో ఒక విషయం రిపోస్టు చేసిన వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేసి 16 రోజులు రిమాండ్ చేయడం సిగ్గుచేటని అన్నారు. గద్వాలలో కులాంతర వివాహం చేసుకుని పోలిసులను ఆశ్రయించిన వారిపై దాడి చేయడం లో సీ ఎం హస్తం ఉందని ఆయన ఆరోపించారు. సీ ఎం స్వంత గ్రామంలో రైతులు సాగునీటికోసం రోడ్డుపై నిరసన దృశ్యం చిత్రికరించిన వారిని బెదిరించడం ఎంత సమంజసమని ప్రశ్నించారు. ఈలాంటి విషయాలపై పోలీసులకు ఫిర్యాదు చేయాలని యత్నిస్తే స్పందించే పోలీసులు స్పందించే స్థితిలో లేరని అన్నారు. పోలీస్ అధికారిగా పనిచేసిన నేను ఈ విషయం పై ఈవిధంగా మాట్లాడాల్సి రావవడం భాధకారమని అన్నారు. మాజీ సీ ఎం, రాష్ట్రాన్ని సాధించిన అధినేత చావు కోరుతున్న వైనం సిగ్గుచేటని అన్నారు. కాంగ్రెస్ నాయకులు ఫామ్ హౌస్ కు వచ్చిన నేపథ్యంలో చావు కోరిన వారి మయిల ను శుద్ధి చేయడానికి కులాన్ని అంటగట్టిన ప్రభుత్వం తీరు హాస్యాస్పదన్నారు. నాయకులకు బందోబస్త్ నిర్వహించే పోలీసులు భిన్నమైన బందోబస్త్ ఏర్పాటు చేసి మాజీ హోం మంత్రి సబితా ఇంద్రారెడ్డి పై కాంగ్రెస్ ప్రభుత్వం పైశాచికంగా వ్యవహరించిందని అన్నారు. బి ఆర్ ఎస్ శ్రేణులు ఉన్న సోషల్ మీడియా సద్వినియోగం పై దృష్టి సారించాలన్నారు. కేసీఆర్ ను మరో సారీ ముఖ్యమంత్రిని చేయాలన్న కాంక్ష అందరిలో ఉందని అన్నారు ఈ నేపథ్యంలో ప్రతి కార్యకర్త భాధ్యత యుతంగా పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. యువత అందుకోసం అమితంగా కృషి చేయాలని ఆయన సూచించారు. చేవెళ్ళ ఎమ్మెల్యే యాదయ్య కేసీఆర్ కు వెన్ను పోటు పొడిచారని దు య్యబట్టారు. దీంతో అభివృద్ధి పడిందని అన్నారు. న వా బ ు ే ప ట మండలం రాజకీయాలపై పూర్తి అవగాహన ఉన్నమండలమని అన్నారు. అయితే మండలం అభివృద్ధి నోచుకోవడం లేదని ఆయన అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాజకీయాలు తప్ప ప్రజాసమస్యలను పట్టించుకునే స్థితిలో లేదని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకుడు విజయఆర్యాక్షత్రియ, రాజమ హేంద్రవర్మ, జిల్లా నాయకుడు దేశమొల్ల ఆంజనేయులు, స్థానిక భరత్ నాయకులు భరత్ రెడ్డి, మహేశ్వర్ రెడ్డి, పురుషోత్తం, శాంతకుమార్, విజయ్ కుమార్, సుధాకర్, నరేందర్ రెడ్డి, సుభాన్ రెడ్డి, రాఘవేందర్, శ్రీనివాస్ గౌడ్, విరేంద్రగౌడ్, గౌస్, భాస్కర్, మాణిక్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేసిన కూన శ్రీశైలం గౌడ్




**కుత్బుల్లాపూర్, సెప్టెంబర్ 13 (సింగిడి):** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం రొడా మేస్త్రి నగర్ నగర్ డివిజన్ లెనిన్ నగర్‌లో రూ. 54 లక్షలతో మంజూరైన అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణ పనులకు కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత బిఆర్ఎస్ ప్రభుత్వ పదేళ్ల పాలనలో ప్రజల మౌలిక అవసరాలను పట్టించుకోకపోవడంతో పాటు, సరైన మౌలిక వసతులు కల్పించకపోవడం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రజల మౌలిక అవసరాలకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ నియోజకవర్గవ్యాప్తంగా సుమారు రూ. 50 కోట్లతో సీసీ రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపనలు చేపట్టినట్లు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న పలు సంక్షేమ పథకాలు నిరుపేదలకు ఎంతో ప్రయోజనం చేకూరుస్తున్నాయని పేర్కొన్నారు. ఉచిత విద్యుత్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, సన్న బియ్యం పంపిణీ వంటి పథకాల ద్వారా పేద, మధ్యతరగతి కుటుంబాలకు మేలు జరుగుతోందని తెలిపారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో రోడ్ల నిర్మాణానికి నిధులు విడుదల చేయడంలో సహకరించిన జిల్లా ఇన్చార్జి మంత్రి శ్రీధర్ బాబు కు కూన శ్రీశైలం గౌడ్ ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. నియోజకవర్గంలో ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించేందుకు నిరంతరం కృషి చేస్తామని కూన శ్రీశైలం గౌడ్ భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ మల్కాజిగిరి డిసిసి ఉపాధ్యక్షులు కూన శ్రీనివాస్ గౌడ్ తో పాటు స్థానిక నాయకులు బుచ్చిరెడ్డి, రషీద్ బెగ్, డివిజన్ అధ్యక్షులు మధుసూదన్ మరియు రాజి రెడ్డి, రవీందర్ రెడ్డి, రామ్ నర్సయ్య, సలీం, సాయిలు, రజాక్, నాగరాజు, రవి చారి, ఆది నారాయణ, ఉప్పల రవి, వెంకట్ రాజు తదితరులు పాల్గొన్నారు.

## క్రీడాకారులను అభినందించిన టీపీసీసీ మెంబర్ డా. టి. రితిక్ రెడ్డి



**వికారాబాద్ ప్రతినిధి, సెప్టెంబర్ 13 (సింగిడి):** జిల్లా పరిధిలోని పరిగి పట్టణంలో నంబర్ వన్ స్కూల్ గ్రౌండ్‌లో శనివారం నిర్వహించిన జోనల్ స్థాయి క్రికెట్, వాలీబాల్ పోటీల్లో విజేతలుగా నిలిచిన జట్లకు బహుమతులను స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులతో కలిసి యువ నాయకులు, టీపీసీసీ మెంబర్ డాక్టర్ టి. రితిక్ రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా విజేత జట్ల క్రీడాకారులను అభినందించారు. క్రీడలు యువతలో క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు, టీమ్ స్పిరిట్‌ను పెంపొందించడంతో పాటు ఆరోగ్యకరమైన జీవనశైలికి దోహదపడతాయని అన్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల క్రీడాకారుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు ఈలాంటి పోటీలు మరిన్ని నిర్వహించాల్సిన అవసరం ఉందని అన్నారు. విజేత జట్లకు షీల్డులు, బహుమతులు అందజేయడం ఆనందగా ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో పిఏసిఎస్ చైర్మన్ పార్థసారథి పంతులు, మున్సిపల్ చైర్మన్ రజిత వెంకటేష్, మార్కెట్ కమిటీ చైర్మన్లు పరశురాం రెడ్డి, ఆంజనేయులు ముదిరాజ్, కాంగ్రెస్ అధ్యక్షులు వెంకట్రాములు, రామకృష్ణ రెడ్డి, వైస్ చైర్మన్ రాజ పుల్లారెడ్డి కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, యూత్ కాంగ్రెస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## పోలీసు సిబ్బందిని అభినందించిన సీపీ రష్మి పెరుమాళ్



**సిద్దిపేట బ్యూరో, సెప్టెంబర్ 13 (సింగిడి):** శాంతిభద్రతల పరిరక్షణలో, నేరాల నియంత్రణలో ప్రతిభ కనబరిచిన పోలీసు అధికారులను, సిబ్బందిని ప్రోత్సహించేందుకు ప్రవేశపెట్టిన సీపీ కనెక్ట్ లో భాగంగా పోలీస్ కమిషనర్ రష్మి పెరుమాళ్ ఉత్తమ ప్రతిభ కనబరిచిన 09 మంది పోలీసు సిబ్బందిని ప్రత్యేకంగా అభినందించారు. కమిషనరేట్ కార్యాలయంలో శనివారం రోజున వారికి ప్రశంసా పత్రాలను, ప్రత్యేక కిట్లను అందజేశారు. అనంతరం సీపీ వారితో ముచ్చటించారు. గత వారం రోజులుగా విధినిర్వహణలో అద్భుతమైన ప్రతిభ కనబరిచిన పోలీసు సిబ్బందిని సీపీ కొనియాడారు. శ్రీధర్, హుస్నాబాద్ సీఐ, లింగ స్వామి హోమ్ గార్డ్ హుస్నాబాద్, సంపత్ కోహెడ హెడ్ కానిస్టేబుల్, వేణు కోహెడ కానిస్టేబుల్, విష్ణు చందర్ గౌరారం పోలీస్ కానిస్టేబుల్, రవి గౌరారం పోలీస్ కానిస్టేబుల్, రాకేష్, కార్తీక్, సాహితీ (ముగ్గురు సిఏఆర్ హెడ్ క్వార్టర్ కానిస్టేబుల్స్) రాత్రి సమయాల్లో అప్రమత్తంగా ఉంటూ, సాంకేతికతను ఉపయోగించి పాత నేరస్థులను పట్టుకోవడం, బందోబస్తులో అత్యుత్తమ విధులు, దొంగతనాలకు అడ్డుకట్ట వేయడం అభినందనీయమే అని చెప్పారు. నిబద్ధతతో సిబ్బంది అంతా పనిచేసి కమిషనరేట్ పరిధిలో నేరాల నియంత్రణకు కృషి చేయాలనీ సిబ్బందికి సూచించారు. ప్రజలకు సమర్థవంతంగా సేవ చేయడానికి 'సీపీ కనెక్ట్' చొరవ ద్వారా మరింత బలంగా స్పందించే బృందాన్ని నిర్మించడానికి పోలీస్ శాఖ నిరంతరం కృషి చేస్తుందని ఆమె తెలిపారు.

## పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన అదనపు కలెక్టర్ నగేష్




**కొల్చారం, సెప్టెంబర్ 13 (సింగిడి):** మెదక్ జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తున్న ప్రత్యేక క్యాంపియన్ డే కార్యక్రమంలో భాగంగా మెదక్ అదనపు కలెక్టర్ (రెవెన్యూ) నేడు కుల్చారం మండలంలోని పోతంశెట్టిపల్లి గ్రామం, పాపన్నపేట మండలంలోని లక్ష్మీనగర్ గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు అందిస్తున్న సేవలు, ఓటర్ల జాబితా పరిశీలన, ప్రత్యేక ప్రచార కార్యక్రమం నిర్వహణ తీరును అదనపు కలెక్టర్ పరిశీలించారు. పోలింగ్ కేంద్రాలకు వచ్చిన ఓటర్ల నుంచి స్వీకరిస్తున్న అభ్యంతరాలు, దరఖాస్తులు తదితర వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా ఆయా గ్రామాల్లో మ్యాపింగ్ కాని కేసులు (చీశీ మ్మీజుజూఱఅస్త్ర ఝుంవం) ఉన్నాయా అనే అంశాన్ని పరిశీలించి, సంబంధిత రికార్డులను అధికారులు, సిబ్బందితో కలిసి ధృవీకరించారు. ఓటర్ల జాబితా ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని, ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా ప్రతి వివరాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలని అధికారులకు సూచించారు. ప్రత్యేక ఓటరు కంపియన్ డే సందర్భంగా పోలింగ్ కేంద్రాలకు వచ్చే ఓటర్లకు అవసరమైన సమాచారం, సహాయాన్ని అందిస్తూ కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పాపన్నపేట తాసిల్దార్ సతీష్ సంబంధిత శాఖల అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేసిన రాగిరి మోహన్ రెడ్డి



**నాచారం, సెప్టెంబర్ 13 (సింగిడి):** నాచారం సర్కిల్ నాచారం డివిజన్ పరిధిలోని హనుమాన్ టెంపుల్ వద్ద భవాని నగర్ కాలనీ అసోసియేషన్ అధ్యక్షులు రాగిరి మోహన్ రెడ్డి మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో భవాని నగర్ కాలనీ సంక్షేమ సంఘం కార్యదర్శి మధుసూదన్ రెడ్డి, ఆనంద్ కుమార్, సాంబశివరావు, వీర ప్రతాపరెడ్డి, నాచారం డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నూతలకంటి రాజు, శ్రీనివాస్ రెడ్డి, రామ్ రెడ్డి, సంతోష్ రెడ్డి పాల్గొన్నారు.

## సుమంత్ తండ్రిని పరామర్శించిన మాజీ మంత్రి కొండా సురేఖ



**హన్మకొండ, సెప్టెంబర్ 13 (సింగిడి):** మాజీ మంత్రి కొండా సురేఖ మాజీ ఓ ఎస్ డీ సుమంత్ తండ్రి నార్ల సుబ్రహ్మణ్యం నిద్ర మాత్రలు మింగి అపస్మారక స్థితికి వెళ్ళిన విషయం తెలిసిందే. అయితే సుబ్రమణ్యం ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలుసుకున్న మాజీ మంత్రి కొండా సురేఖ శనివారం ఆసుపత్రికి వెళ్లి ఆయనను పరామర్శించారు. అనంతరం సుబ్రహ్మణ్యం ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకుని, మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు.

## నవరాత్రోత్సవాలను శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలి

- వివిధ కుల, మతాలకు చెందిన పెద్దలతో జెడ్.పి. హాల్‌లో పీస్ కమిటీ సమావేశం నిర్వహించిన జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్




**సంగారెడ్డి బ్యూరో, సెప్టెంబర్ 13 (సింగిడి):** వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకొని నిర్వహించే నవరాత్రి ఉత్సవాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా జిల్లా వ్యాప్తంగా పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేసినట్లు జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా జెడ్.పి. కార్యాలయంలో వివిధ కుల, మతాలకు చెందిన పెద్దలతో పీస్ కమిటీ సమావేశాన్ని నిర్వహించిన జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలను శాంతియుత వాతావరణంలో నిర్వహించుకోవాలని, ప్రజలు ఒకరి మత సంప్రదాయాలను మరొకరు గౌరవిస్తూ మత సామరస్యాన్ని కాపాడాలని అన్నారు. నవరాత్రి ఉత్సవాలు ప్రశాంతంగా నిర్వహించేలా ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా ఆయా మండలాల వారీగా వివిధ మతాలకు చెందిన పెద్దలు, గణేష్ ఉత్సవ కమిటీ నిర్వాహకులతో పీస్ కమిటీ సమావేశాలు నిర్వహించినట్లు తెలిపారు. ఇతరుల మనోభావాలు దెబ్బతినే విధంగా పాటలు, వ్యాఖ్యలు చేయకూడదని, తప్పుడు ప్రచారాలకు దూరంగా ఉండేలా యువతకు సూచించాలని అన్నారు. వినాయక ప్రతిమను ప్రతిష్ఠించదలచిన వారు ముందస్తు సమాచారం అందించేందుకు తెలంగాణ పోలీస్ పోర్టల్ https://policeportal.tspolice.gov.in/index.htm అందుబాటులో ఉందని తెలిపారు. ఈ పోర్టల్ ద్వారా మండపం వివరాలు, నిమజ్జనం తేదీ, నిమజ్జనానికి వెళ్లే మార్గం తదితర వివరాలను ముందస్తుగా నమోదు చేయాలని సూచించారు. వినాయక ప్రతిష్ఠాపన కోసం ఏర్పాటు చేసే మండపాలను రహదారులపై నిర్మించకుండా, ప్రజల రాకపోకలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. భద్రతా దృష్ట్యా ప్రతి మండపం వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకునేలా నిర్వాహకులు చర్యలు తీసుకోవాలని అన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ అధిక శబ్దంతో కూడిన లౌడ్‌స్పీకర్లు, డీజేలకు అనుమతి లేదని, నిబంధనలకు అనుగుణంగా మైకులు, స్పీకర్లను ఉదయం 6 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు మాత్రమే వినియోగించాలని సూచించారు. ఎవరైనా నిబంధనలకు విరుద్ధంగా డీజేలను ఏర్పాటు చేస్తే మండప నిర్వాహకులతో పాటు డీజే యజమానులపై కూడా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ముఖ్యంగా యువత సోషల్ మీడియా ద్వారా వచ్చే పుకార్లను నమ్మవద్దని, నిర్ధారణ లేని ఫార్వర్డ్ మెసేజ్‌లను ఇతరులకు పంపకుండా జాగ్రత్త వహించాలని ఎస్పీ సూచించారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే విధంగా సోషల్ మీడియాలో ఎలాంటి పోస్టులు, వ్యాఖ్యలు చేయవద్దని, అనుమానాస్పద సమాచారం లేదా తప్పుడు ప్రచారం కనిపిస్తే వెంటనే పోలీసుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, శాంతియుత వాతావరణంలో నిర్వహించేందుకు ప్రజలు, గణేష్ ఉత్సవ కమిటీ నిర్వాహకులు, వివిధ మతాల పెద్దలు పోలీసు శాఖకు సహకరించాలని జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ సూచించారు. ఈ కార్యక్రమంలో డిఎస్పీ సంగారెడ్డి, టి పిసిసి కార్యదర్శి తోపాజిఅనంత కిషన్, మున్సిపల్ కౌన్సిలర్ కూన సంతోష్, రెవిన్యూ శాఖ తరపున జైరామ్, మున్సిపల్ శాఖ తరపున జైరాం, డా ప్రవీన్ కుమార్ డి. ఎమ్. హెచ్. ఓ వివిధ కుల, మతాలకు చెందిన పెద్దలు, గణేష్ మండప నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభాతనవ సింగిడి ప్రతి రంగూ ఓ నిజం
Singidi
సోమవారం 14-9-2026

# ఎడిటోరియల్

Editorial

## జాతి ఐక్యతకు దోహదకారి హిందీ

భారత జాతీయోద్యమంలో అఖిల భారతాన్ని జాగృతం చేసి, ఏక తాటిపై నడిపి, హిందీ భాష ఆనాడు దోహద పడిందనే భావనతో గాంధీజీ స్ఫూర్తితో, 1949 సెప్టెంబరు 14న రాజ్యాంగం లోని 351 వ అధికరణం 8వ షెడ్యూల్‌లో హిందీని జాతీయ భాషగా గుర్తిస్తూ పొందు పరిచారు. అప్పటి నుంచి ప్రతి ఏటా నుండి ఈ తేదీని "హిందీ దివస్" (రాష్ట్ర భాషా దినోత్సవం) గా జరుపు కోవడం ఆనవాయితీ. ప్రశంసలు పొందిన భారతీయ పండితుడు, చరిత్ర కారుడు, వేదాంతవేత్త, సాహితీ వేత్త, హిందీ పండితుడు, సర్వోదయ కార్యకర్త, గాంధేయ వాది, పాత్రికేయుడు, రాజకీయ నాయకుడు, సంస్కృత భాషపై సాధికారికత కలిగిన, బహుముఖ ప్రజ్ఞాశాలి అయిన బియాహర్ రాజేంద్ర సింహా, 1949 సెప్టెంబర్ 14 న తన 50 వ పుట్టిన రోజున, హిందీని అధికారిక భాషగా స్వీకరించిన తరువాత వారి ప్రయత్నాలు ఫలించాయి. ఈ మేరకు హిందీకి అనుకూలంగా బియాహర్ రాజేంద్ర సింహాతో పాటు హజారీ ప్రసాద్ ద్వివేది, కాకా కలేల్కర్, మైథిలి శరణ్ గుప్త మరియు సేథ్ గోవింద్ దాస్ చేసిన కృషికి కృతజ్ఞతలు తెలుపుతూ భారత రాజ్యాంగ సభ భారతదేశ రిపబ్లిక్ యొక్క రెండు అధికారిక భాషలలో దేవనాగరి లిపిలో వ్రాయబడిన ఒకటిగా హిందీని రాజ్యాంగ సభ ఆమోదంతో స్వీకరించింది. 1949 సెప్టెంబరు 14వ తేదీన హిందీని జాతీయ భాషగా కేంద్ర ప్రభుత్వం ప్రకటించగా, ఈ నిర్ణయం 1950 జనవరి 26 న అమల్లోకి వచ్చిన భారత రాజ్యాంగం ఆమోదించింది. భారత రాజ్యాంగం లోని ఆర్టికల్ 343 ప్రకారం, దేవనాగరి లిపిలో వ్రాసిన హిందీని అధికారిక భాషగా స్వీకరించారు. మొత్తం మీద, భారత దేశంలో 22 షెడ్యూల్డ్ భాషలు ఉన్నాయి, వాటిలో రెండు అధికారికంగా యూనియన్ స్థాయిలో ఉపయోగించ బడతాయి: హిందీ, ఇంగ్లీష్. అధికారిక భాష హిందీ దేవనాగరిక లిపి నుంచి రూపొందించ బడింది. ఈ భాష ఇండో యూరోపియన్ భాష సంతతికి సంబంధించిన ఇండో-ఆర్యన్ శాఖకు చెందినది. హిందీ అంటే "పర్షియన్ కానుక" అని అర్థం. హిందీ" మరియు "హిందూ" అనే పదాలు పాత పర్షియన్ కు చెందినవి, ఇవి "సింధు నది"ని సూచించే సంస్కృత పేరు సింధు నుండి వచ్చాయి. దీని అర్థం " హింద్ (భారత దేశం) యొక్క లేదా చెందినది". హిందీ భాష చాలా వరకూ సంస్కృతం నుంచి గ్రహించ బడినది. అయితే కాలక్రమంలో ఉత్తర భారతదేశం లోని ముస్లిం ప్రభావం వల్ల పర్షియన్, అరబిక్, టర్కిష్ పదాలు హిందీలో చేరి ఉర్దూ భాష ఆవిర్భవించింది. మనం శుద్ధ హిందీ(ప్యూర్ హిందీ) భాషను రేడియోలలో, టి.వి. వార్తలలో వినవచ్చు. ప్రస్తుతం చలామణిలో ఉన్న హిందీ భాష చాలా వరకూ సులభతరం చేయ బడింది. ఉత్తర భారత దేశంలో ఇస్లామిక్ పరిపాలన వచ్చిన తరువాత, పాత హిందీ పెర్షియన్, అరబిక్ నుండి అనేక రుణ పదాలను సంపాదిం చింది. ఇది హిందూస్థానీ అభివృద్ధికి దారి తీసింది. అవధి మరియు బ్రజ్ భాష వంటి సాహిత్య ప్రామాణీ కరణ ద్వారా హిందీ బెల్ట్ యొక్క వివిధ మాండలికాలు మరియు భాషలు ప్రాముఖ్యతను సంతరించు కున్నాయి.

# తొలి తరం స్త్రీ నవలా రచయిత్రి బొమ్మ హేమాదేవి

### నేడు బొమ్మ హేమాదేవి జయంతి

బొమ్మ హేమా దేవి తెలుగు సాహిత్య చరిత్రలో తొలి తరానికి చెందిన స్త్రీ నవలా రచయిత్రిగా విశిష్ట స్థానం పొందిన అరుదైన ప్రతిభావతి. 1931 సెప్టెంబర్ 14వ తేదీన నిజామా బాద్‌లో రామా గౌడ్, గంగాదేవి దంపతులకు జన్మించిన ఈమెకు యమున అని పేరు పెట్టారు. దాతృత్వం, ఉదారతకు కీర్తి పొందిన అపర దానకర్ణుడు రాజా నర్సాగౌడ్ పెద్ద మనుమరాలు అయిన ఆమెను చెల్లెలు రంజనతో కలిసి హైదరాబాదు నారాయణ గూడలోని ఆంధ్ర



గర్ల్స్ హైస్కూలులో చదివించారు. ఆ పాఠశాలే ఆ కాలంలో నిజాం రాష్ట్రంలో ఏకైక తెలుగు మాధ్యమ విద్యాసంస్థ. విద్యాభ్యాసం ద్వారా సాహిత్యంపై ఆకర్షణ పెంపొందించి, ఆరంభ దశలోనే సృజనాత్మకతను ఆవిష్కరించ గలిగింది.

పదహారేళ్ల వయసులో కరీంనగర్ జిల్లా మానకొండూరుకు చెందిన బొమ్మ నారాయణ గౌడ్‌తో వివాహం జరిగింది. వివాహానంతరం రుక్మిణి అనే పేరుతో కుటుంబ జీవితం ప్రారంభించినా, రచనా రంగంలో మాత్రం యమున, దేవిరమ వంటి కలం పేర్లతో సాహిత్య సృజన మొదలు పెట్టింది. నారాయణగౌడ్ ఇంజనీరుగా హైదరాబాదులో స్థిరపడడంతో, ఆ నగరమే ఆమె జీవితానికి, రచనలకు కేంద్రమైంది. 1973లో కోడలి పేరుతో "హేమా దేవి" అనే కలం పేరు స్వీకరించి వ్రాసిన కుంకుమ పూలు కథకు తొలి బహుమతి దక్కడంతో ఆ పేరే శాశ్వతమైంది. అప్పటి నుండి ఆమె రచనలు "బొమ్మ హేమాదేవి" పేరిట తెలుగు పాఠక లోకంలో విస్తారంగా ప్రసిద్ధి చెందాయి.

హేమా దేవి రచనా ప్రస్థానం 1960లలో ప్రారంభమై, దాదాపు నలభై ఏళ్లపాటు అచంచలంగా కొనసాగింది. తొలి నవల భావన భార్గవి 1960లో వెలువడింది. అనంతరం నవధాన్యాలు, నవరసాలు, దీప, తార, లవ్ స్టోరీ, తపస్విని, కుంకుమ పూలు, నవ భారతి, ప్రేమే నేరమౌనా, వంటి నవలలు వెలువరించింది.

నవలలతో పాటు వందకు పైగా కథలను కూడా రచించింది. అన్నపూర్ణ, అభయ, ఆలింగనము, ఇజాజత్ హై, ఏక్ స్కూటర్ కీ వాపసీ, మిస్టర్ అనంత్, మేఘన, బాంచెన్ దొరసానీ, చిరుదీపం, నవతరం వంటి కథలు సామాజిక అన్యాయాలు, కుటుంబ విభేదాలు, ప్రేమ, మానవ సంబంధాల వివిధ కోణాలను స్పష్టంగా ప్రతిఫలించాయి. రేడియో నాటికల రచనలోనూ ఆమె ప్రతిభ ప్రతిభా సంపన్నమైంది. పొగమంచు వంటి రేడియో నాటికలు ఆ కాలంలో శ్రోతల ఆదరణ పొందాయి.

హేమా దేవి రచనలు ఆ కాలంలో ప్రసిద్ధిగాంచిన జయశ్రీ, ఆంధ్రభూమి, ఆంధ్రజ్యోతి, ప్రజాతంత్ర, తరుణ, కళాసాగర్, అనామిక, సామ్య, ప్రభవ మొదలైన పత్రికలలో ధారా వాహికలుగా వచ్చాయి. ఆమె సాహిత్యంలో మహిళా జీవితానుభవాలు, కుటుంబ ఆచారాలు, సంప్రదాయాల ఒత్తిడి మాత్రమే కాకుండా, బిసి వర్గాల వాస్తవాలు, దళిత జీవన చిత్రణ కూడా చోటు చేసుకున్నాయి. అందువల్ల ఆమెను తెలుగులో తొలి బిసి స్త్రీవాద రచయిత్రిగా పరిగణించారు. ఎవశ్రీబస్త్రబ ఔశీఎవఅ ఔతీఱ్‌వతీం 1950--1975 వంటి పరిశోధన గ్రంథాల్లో ఆమె రచనలకు ప్రత్యేక ప్రస్తావన లభించింది.

2017లో ప్రపంచ తెలుగు మహాసభల సందర్భంగా సంగిశెట్టి శ్రీనివాస్ సంపాదకత్వంలో "బొమ్మ హేమాదేవి కథలు" అనే కథల సంకలనం వెలువడింది. ఈ గ్రంథం ఆమె సాహిత్య వారసత్వాన్ని తదుపరి తరాలకు చేరువ చేసింది.

1996 నవంబరు 26న 65 ఏళ్ల వయసులో హేమాదేవి కన్నుమూశారు. కానీ ఆమె సాహిత్యం మాత్రం చిరస్థాయిగా నిలిచింది. మహిళా స్వరాన్ని వెలుగులోనికి తెచ్చిన ఆమె రచనలు స్త్రీ వాద చైతన్యానికి బలాన్నిస్తూనే, సమాజంలోని అన్యాయాలపై ప్రశ్నలెత్తే అగ్ని జ్వాలలుగా నిలిచాయి. సరళమైన శైలి, యదార్థ వాదం, సామాజిక చైతన్యం కలగలిపిన ఆమె నవలలు, కథలు నేటికీ పాఠక హృదయాలను కదిలిస్తూనే ఉన్నాయి. అందువల్ల బొమ్మ హేమా దేవి తెలుగు సాహిత్య చరిత్రలో చిరస్థాయి కీర్తిని సంపాదించిన విశిష్ట రచయిత్రిగా నిలిచారు.

**- రామ కిష్టయ్య సంగన భట్ల సీనియర్ ఇండి పెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...9440595494**

# విశ్వమంతా వినాయకుడు

విఘ్నాలను పోగొట్టేందుకు ఒక దేవతను పూజించడం అనేది మన దేశంలో మాత్రమే కాకుండా అన్ని ప్రాచీన నాగరికతల్లోనూ కనిపిస్తుంది. గ్రీకు వారు దర్శినస్ అని పిలిచినా, రోమన్లు జేనస్ అని, ఈజిప్షియన్లు గునీస్ అని పిలిచినా వారంతా వినాయక రూపాలే. భారతీయుల వినాయక ఆరాధనా సంప్రదాయాన్ని ప్రపంచం నలుమూలలా విస్తరింప చేశారు.

ఒక చేతిలో గొడ్డలి, మరో చేతిలో క్యారెట్ పట్టుకున్న వినాయకుణ్ణి గర్భధాతు గణపతి అంటారు. ఈ గణపతి విగ్రహాలు చైనా, జపాన్ దేశాల్లో లభించాయి. ఆగ్నేయాసియా దేశాలలో భారతీయులకు వాణిజ్య సంబంధాలు ఉండడం వల్ల భారతదేశానికి వెలుపల కూడా మన నాగరికత విస్తరించింది. అందులో ప్రముఖంగా చెప్పుకోవలసింది గణపతి ఆరాధనను గురించే.



కొలంబస్ కు ముందు నుంచి...

ప్రాచీనకాలం నుంచే అమెరికాలో వినాయకుడి ఆరాధన ఉంది. దివాన్ చమన్ లాల్ తన 'హిందూ అమెరికా' అనే గ్రంథంలో కొలంబస్ అమెరికా ఖండాన్ని కనుగొనే ముందే (1492) హిందువులు అక్కడికి చేరారనీ, వినాయకుని ఆరాధించారని అభిప్రాయపడ్డారు. అమెరికా ఖండంలోని పెరూ, మెక్సికోలలో ఇంకా తెగకు చెందిన ఆదివాసులలో గణపతి ఆరాధన ఉన్నట్లు ఆధారాలు లభిస్తున్నాయి.

లంకా ద్వీపంలో గణేశుడు..

శ్రీలంకలోని 'పోలిన్నరువ' సమీపంలోని శివాలయంలోని ఒక స్తంభంపైన చతుర్భుజాలు, చేతిలో కుడుమును కలిగి ఉన్న వినాయకుని శిల్పం ఉంది. కొలొంబోకు సుమారు 150 కిలోమీటర్ల దూరంలో 'కటర్ గమ్'లో శ్రీ సుబ్రహ్మణ్యస్వామి ఆలయం ఉంది. ఈ ఆలయంలో వినాయకునికి ప్రత్యేక సన్నిధి ఉంది. ఈ వినాయకుడిని హిందువులతో పాటు మహ్మదీయులు, క్రైస్తవులు కూడా పూజించడం విశేషం.

ఏనుగుల దొర...

చైనా భాషలో వినాయకుడిని 'కువాన్-- షి-ఆయేన్' అని పిలుస్తారు. ఇక్కడి శాసనాల్లో వినాయకుని ఏనుగుల దొరగా పేర్కొన్నారు. చైనాలో క్రీ.శ. 531 ప్రాంతానికి చెందిన వినాయకుని శిల్పం ఒకటి 'కుంగ్-హ్సియన్' ఆలయ గోడలపై లభించింది. అలాగే 'తుని హువాన్' గుహలోని గోడలపై వినాయకుని విగ్రహం కనిపిస్తుంది. వీటిలో వినాయకుడు ఒక చేతిలో కమలం, మరో చేత 'చింతామణి' ని ధరించి ఉన్నాడు. అలాగే ఇద్దరు వినాయకులు ఒకరినొకరు కౌగిలించుకున్న రూపంలోని ప్రతిమ కూడా లభించింది. ఈ కవల వినాయక ప్రతిమ జపాన్ వినాయక ప్రతిమను పోలి ఉన్నది.

బౌద్ధంలో వినాయకుడు...

గణపతి ఆరాధన 10వ శతాబ్దం నాటికి బాగా విస్తృతమైనట్లు తెలుస్తోంది. 'హేరంబ గణపతి'ని నేపాల్ లో ఆరాధిస్తారు. ఇక్కడ అనేక గణేశ కాంస్య విగ్రహాలు లభ్యమయ్యాయి. ఇక్కడ వినాయకునికి మూషికవాహనంతో పాటు సింహం కూడా వాహనంగా కనిపిస్తుంది. కొన్ని విగ్రహాల్లో ఒక కాలి కింద సింహం, మరో కాలి కింద మూషికం ఉండగా, మరికొన్నింటిలో రెండు కాళ్ళ క్రింద రెండు ఎలుకలు ఉండడం కనిపిస్తుంది. కాగా, ఈ దేశంలో బుద్ధుడు రాజగృహం వద్ద తన శిష్యుడైన ఆనందుడికి గణపతినీ స్తుతించే గణపతి హృదయాన్ని ఉపదేశించినట్లు ప్రచారంలో ఉంది. బౌద్ధ ప్రచారానికి శ్రీలంకకు చేరుకున్న మౌర్య సామ్రాజ్య చక్రవర్తి అశోకుడి కుమార్తె అక్కడ వినాయకుడి ఆలయాన్ని కట్టించినట్లు నేపాల్ దేశంలో ప్రచారంలో వుంది.

మూడు కన్నుల దేవర...

జావాలో అత్యంత ప్రాచీనకాలం నుంచే వినాయక ఆరాధన ఉన్నది. జావాలోని గణపతి విగ్రహాల్లో 'డియాంగ్ ప్లే బ్యూ'లోని విగ్రహం ప్రధానమైంది. 13వ శతాబ్ది నాటి ఈ విగ్రహం కిరీటాలంకృతునిగా కనిపిస్తుంది. బాలిద్వీపంలో 8, 9 శతాబ్దాలనాటి వినాయకుడి విగ్రహాలు అనేకం లభించాయి. వీటికి మూడు కన్నులు ఉండడం విశేషం.

సుమో యోధుడు...

జపాన్ లో వినాయకుని 'కాంగితెన్', 'వినాయక్ శోదెన్' అని వ్యవహరిస్తారు. కాంగి తెన్' అంటే శుభాన్నీ, సమృద్ధినీ ప్రసాదించేవాడు అని అర్థం. క్రీ.శ 806లో 'కోబోదాయిష్" అనే బౌద్ధమతస్తుడు జపనీయులకు వినాయకుడ్ని పరిచయం చేశారు. ఇద్దరు వినాయకులు ఒకరినొకరు కౌగిలించుకున్న రూపంలోని ప్రతిమలున్నాయి. రెండు, నాలుగు ఆరు, చేతులు కలిగి, వివిధ భంగిమలలో ఉన్న వినాయక విగ్రహాలు కూడా కనిపిస్తాయి. భక్ష్యపాత్ర, గొడుగు, ధనుర్బాణాలు, కందమూలాలను వినాయకుడు చేతులలో ధరించి కనిపిస్తాడు. సుమో యోధులను పోలిన విగ్రహాలు కూడా జపాన్ దేశంలో దర్శనమిస్తాయి.

ఇస్లాం దేశాల్లో...

ఆఫ్ఘనిస్తాన్లోని కొన్ని ప్రాంతాల్లో నేటికీ గణపతి ఆరాధన సాగుతూ ఉంది. కాబూల్ నగరానికి దగ్గరలో ఉన్న 'సకరేధర్' లో వినాయకుడి విగ్రహం లభించింది. నిలుచున్న ఈ వినాయకునికి ఇరువైపులా రెండు గణాలు కనిపిస్తాయి. చతుర్భుజాలు కలిగిన వినాయకుడు తన రెండు చేతులనూ ఈ గణాలపై ఉంచాడు. ఈ విగ్రహం గుప్తులు లేదా కుషాణుల కాలం నాటిదై ఉంటుందని చరిత్రకారుల భావన.

నాలుగు తలల గణపతి...

ప్రాచీన కాలం నుంచీ మన దేశంలో సాంస్కృతిక సంబంధాలను కలిగిన కాంబోడియలో గణపతి ఆరాధన అప్పటి నుంచే కనిపిస్తున్నది. 6వ శతాబ్దం నాటి అంకార్ వట్ శాసనం గణపతి ఆలయానికి బానిసలను దానం చేసినట్లు చెబుతున్నది. కాంబోడియాలోని 'చో మంగ్ డ్రి' లో గణపతి ఆలయ శిథిలాలు ఇంటికి కనిపిస్తున్నాయి. 'కుక్ ట్రాప్యాంగ్ కుల్' దేవాలయంలో వినాయకుని విగ్రహాలు ఉన్నాయి. 'స్టేక్ థార్స్ కెందల్' మ్యూజియంలో నాలుగు తలల గణపతి విగ్రహం ఉంది.

వియత్నాంలో...

ఈ దేశంలో గణపతి ఆలయాలను నిర్మించినట్లు 8వ శతాబ్దం నాటి శాసనాల్లో ఉంది. లభించిన అనేక వినాయకుడి విగ్రహాల్లో 'ద్విభుజ గణపతి' విగ్రహం అపూర్వమైంది. ఒక చేతిలో మోదకపాత్ర, మరొక చేతిలో చేతికర్రను ధరించిన వినాయకునికి తల బోడిగా ఉండడం, యజ్ఞోపవీతం, ఆభరణాలు లేకపోవడం దీని ప్రత్యేకతగా చెప్పవచ్చు.

ఇతర దేశాలలో...

మయన్మార్ (బర్మా)లో 11వ శతాబ్దం నాటికే గణపతి ఆరాధన ఉన్నట్లు తెలుస్తున్నది. రంగూన్ మ్యూజియంలో ఆరుచేతుల గణేశ ప్రతిమ ఉన్నది. థాయ్ లాండ్, బ్యాంకాక్ ఆలయంలోని వినాయక విగ్రహం జకార్తా మ్యూజియంలో గణేశ విగ్రహం గణేశారాధనకు నిదర్శనాలు. మంగోలియాలో నాట్య గణపతి విగ్రహాలు లభించాయి. ఇండోనేషియాలో గణపతి బొమ్మతో ఉన్న కరెన్సీ వాడకంలో ఉన్నది. సయామ్ లో లభించిన వినాయకుడు కూర్మ వాహనుడు. ఆయన చేతిలో చింతామణి ఉండడం ఒక విశేషం.

**రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...
9440595494**

# బ్రహ్మాండ నాయకుని బ్రహ్మోత్సవ సేవలో అష్టదిక్పాలకులు

కలియుగ వైకుంఠంలా అలరారుతోన్న తిరుమలలో ఏడాది వార్షిక (సాలకట్ల) బ్రహ్మోత్సవాలు తొమ్మిది రోజుల పాటు సాంప్రదాయ రీతిలో కన్నుల పండువగా కొనసాగ నున్నాయి. ఎందరో రాజులు, ఆర్కాటు నవాబులు, ఈస్టిండియా కంపెనీ ప్రతినిధులు, బ్రిటిష్ అధికారులు, తర్వాత హథీరాం మహంతుల హయాంలో ఉత్సవాలు కొనసాగాయి. ఒకప్పుడు నెలకు ఒకసారి బ్రహ్మోత్సవాలు జరిగేవట. కొన్ని ఇబ్బందులు, సమస్యల కారణంగా ఏడాదికి ఒకసారి, అధిక మాసంలో రెండుసార్లకు బ్రహ్మోత్సవాలు పరిమితం అయ్యాయి. భాద్రపదంలో నిర్వహించే ఉత్సవాలను సాలకట్ల శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలను సెప్టెంబర్ 15 నుండి 23 వరకు నిర్వహించ నున్నారు.



ఏడుకొండల స్వామికి తొలిసారిగా బ్రహ్మోత్సవాన్ని సృష్టికర్త అయిన బ్రహ్మదేవుడే జరిపించినట్లు భవిష్యోత్తర పురాణం పేర్కొంటున్నది. బ్రహ్మదేవుడు స్వయంగా ఆరంభించిన ఉత్సవాలు కావటంతో, ఇవి 'బ్రహ్మోత్సవాలు' అయ్యాయని; నవాహ్నిక దీక్షతో, నవబ్రహ్మలు తొమ్మిది రోజులు జరిపించే ఉత్సవాలు కాబట్టి ఇవి బ్రహ్మోత్సవాలని; తిరుమలలో పెద్దయెత్తున జరిగేవి కాబట్టి వీటిని బ్రహ్మోత్సవాలు అంటారనీ; పరబ్రహ్మ స్వరూపుడైన శ్రీవారికి చేసే గొప్ప ఉత్సవాలు కాబట్టి వీటిని 'బ్రహ్మోత్సవాలు అంటున్నారని; పలు విధాలుగా బ్రహ్మోత్సవాల గురించి చెపుతుంటారు. బ్రహ్మాది దేవతలచే కీర్తింప బడే కోనేటి రాయని బ్రహ్మోత్సవాలు నేటికీ ఘనంగా కొనసాగు తున్నాయి.

భారతావనిలో నారాయణ పర్వతంపై సౌరమాన కన్యామాస ఏకాదశి సోమవారం శ్రవణా నక్షత్రంతో కూడిన సిద్ధ యోగ శుభ సమయాన వైకుంఠ నాథుడు శ్రీనివాసునిగా అవతరించాడని పద్మ పురాణం చెపుతున్నది.

వేంకటేశ్వరుడు అర్చనామూర్తిగా ఆవిర్భవించింది ఆశ్వయుజ మాసంలో వచ్చే శ్రవణ నక్షత్ర శుభ ముహూర్తాన. రవి కన్యా మాసంలో ప్రవేశించిన తరువాత వచ్చే శ్రవణా నక్షత్రం రోజున అవబృధ కార్యక్రమాన్ని నిర్ణయించుకుని దానికి తొమ్మిది రోజులు నవాహ్నిక బ్రహ్మోత్సవాలుగా నిర్వహిస్తారు. దసరా నవరాత్రులలో చక్రస్నానం నాటికి తొమ్మిది రోజుల ముందు మొదలయ్యే విధంగా బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తారు. ధ్వజారోహణతో సకల దేవతలకు ఆహ్వానం పలికి, ధ్వజా వరోహణంతో ఆహ్వానితులైన దేవతలకు వీడ్కోలు పలికి ఉత్సవాలను ముగిస్తారు.

స్వామివారి వాహనం గరుడుడు కాబట్టి, ఒక నూతన వస్త్రం మీద గరుడుని బొమ్మను చిత్రీకరిస్తారు. దీన్ని 'గరుడ ధ్వజ పటం' అంటారు. ధ్వజస్తంభం మీద ఎగిరే గరుడ పతాకమే సకల దేవతలకు స్వామివారి బ్రహ్మోత్సవాలకు ఆహ్వానపత్రం. అష్ట దిక్పాలకులు, భూత, ప్రేత, యక్ష, రాక్షస, గంధర్వ గణాలకు ఇదే ఆహ్వానం. బ్రహ్మాండ నాయకునికి నిర్వహించే ఈ బ్రహ్మోత్సవాలకు సకల దేవతామూర్తులను ఆహ్వానిస్తారు. బ్రహ్మోత్సవాలలో తొలి దినం వైఖానస ఆగమ శాస్త్రోక్తంగా గరుడ కేంద్ర ప్రతిష్ట, కంకరణ ధారణ, ఆలయ ఆవరణంలోను, బయట, చుట్టూ అష్ట దిక్కులలోనూ స్వామి వారు శ్రీదేవి, భూదేవి సమేతంగా సపరివార దేవతలతో ఊరేగుతూ ఉండగా అష్ట దిక్పాలకులు ఆహ్వానింప బడతారు. అనంతరం స్వామి వారు ఆలయంలో ప్రవేశించి ధ్వజస్తంభం దగ్గరకు చేరు కుంటారు. మిగిలిన పరివార దేవతలైన అనంత, గరుడ, విష్వక్సేన, సుగ్రీవ, హనుమంత, అంగదుడు విమాన ప్రదక్షణలో ఉన్న మండపంలోకి చేరుకుంటారు. తదుపరి శ్రీదేవి, భూదేవి, మలయప్ప స్వామి వారి సమక్షంలో వేద గానాల మధ్య మంగళ వాయిద్యాలు మ్రోగుతుండగా అర్చక స్వాములు ధ్వజస్తంభంపై గరుడ ధ్వజాన్ని (గరుడ పటాన్ని ఎగురు వేస్తారు) దీనితో ధ్వజారోహణ కార్యక్రమం పూర్తి అవుతుంది.

అయితే స్వామివారి బ్రహ్మోత్సవాల సందర్భంగా పుణ్య స్థలిలో ఎనిమిది దిక్కులలో కొలువై ఉండి, బ్రహ్మోత్సవాల విజయవంతంలో అష్ట దిక్పాలకులదే ప్రధాన పాత్ర.

తూర్పు, దక్షిణం, పడమర, ఉత్తరం అనేవి నాలుగు దిక్కులు. ఆగ్నేయం, నైరుతి, వాయవ్యం, ఈశాన్యం అనేవి నాలుగు మూలలు లేక నాలుగు విదిక్కులు. ఈ ఎనిమిదింటిని కలిపి అష్ట దిక్కులని పేరు. ఈ అష్టదిక్కులకు పాలకులైన వారికి సంబంధించిన విశేషాలు...

అష్ట దిక్పాలకులకులలో ప్రథముడు ఇంద్ర దేవుడు: ఇంద్రుడు దేవతలకు రాజుగా వేదాల్లో కీర్తించ బడ్డాడు. ఇతను తూర్పు దిక్కునకు అధిపతి. అదితి కుమారుడు. ఇతని భార్య శచీదేవి. ఆయుధం వజ్రం. వాహనం ఐరావతం. నివాసం అమరావతి పట్టణం. పాలసముద్రంనుండి పుట్టిన ఐరావతమనే ఏనుగును, ఉచ్ఛైశ్రవమనే గుఱ్ఱమును ఇతడు గైకొన్నాడు.

అగ్నిదేవుడు: అగ్ని పంచ మహాభూతాల్లో ఒకడు. ఆగ్నే యాధిపతి. తేజస్వి. సప్త హస్తములు, చతుశ్శృంగములు, ఏడు నాల్కలు, రెండు శిరములు కలిగి శుభ్రమైన చిరునవ్వులు "చిందించు స్వరూపం కలవాడు. ఇతని తండ్రి పేరు వైశ్వా నరుడు. తల్లి శుచిష్మతి. భార్య స్వాహాదేవి. ఆయుధం శక్తి. వాహనం పొట్టేలు. నివాసం తేజోవతి పట్టణం.

యమ దేవుడు: యముడు పితృగణాధిపతి. దక్షిణ దిగ్భాగమున పరిపాలన ఇతనిదే. ఇతని తండ్రి సూర్యుడు. తల్లి సంజ్ఞాదేవి. భార్య శ్యామలా దేవి. ఆయుధం దండం. వాహనం మహిషం. నివాసం సంయమని పట్టణం.

నిర్రుతి దేవుడు: నిర్రుతి నైరుతి దిక్పాలకుడు. లోకాధి పతి. సత్పురుషుడు. కీర్తిమంతుడు. భార్య దీర్ఘాదేవి. ఆయుధం కుంతము. వాహనం నరుడు. నివాసం కృష్ణాంగన పట్టణం.

వరుణ దేవుడు: యజ్ఞ సమయాల్లో హవిర్భాగములను ఇవ్వడానికి ఆహ్వానింపబడే వరుణుడు పశ్చిమ దిక్పాలకుడు. జలాధిపతి. ఇతని తండ్రి కర్దమ ప్రజాపతి. భార్య కాళికాదేవి. ఆయుధం పాశము. వాహనం మొసలి. నివాసం శ్రద్ధావతి పట్టణం.

వాయు దేవుడు: వాయువు పంచ భూతాలలో ఒకరు. సర్వ వ్యాపకుడు. మహా బలవంతుడు. వాయవ్య దిశకు అధిపతి అయిన ఇతడు జీవకోటికి ప్రాణాధికం. ఇతని భార్య అంజనాదేవి. ఆయధం ధ్వజం. వాహనం జింక. నివాసం గంధవతి పట్టణం.

కుబేర దేవుడు: కుబేరుడు సకల దేవతాప్రియతముడు. ఉత్తర దిక్కునకు అధిపతి. ధనపతి. భాగ్యశాలి. కుబేరుని తండ్రి విశ్రవోబ్రహ్మ. తల్లి ఇలబిల. భార్య చిత్ర రేఖాదేవి. ఆయుధం ఖడ్గము. వాహనం గుఱ్ఱం. నివాసం అలకాపురి పట్టణం.

ఈశానుడు: సాక్షాత్తు ఈశాన్యాధిపతి పరమ శివుడు. జగదంబ పార్వతీదేవి ఇతని భార్య. ఆయుధం త్రిశూలము. వాహనం వృషభము. నివాసం యశోవతి పట్టణం. పార్వతీ పరమేశ్వరులకు ఆదిదంపతులని ప్రతీతి. శంకరుడు కోరినవారి కోరికలు కాదనకుండా నెరవేర్చడం చేత ఇతనికి బోళాశంకరుడని పేరు. మహాశక్తి మంతుడు. త్రిమూర్తులలో ఒకడు. సర్వస్వతంత్రుడు. భూత గణ సంసేవితుడై, తృటిలో భస్మం చేసేశక్తిగల మూడవ కన్నును కల్గిన ఇతడు లయకారకకర్త. కైలాసం ఇతని నివాసం. అష్టదిక్పాలకు లందరినీ కూడా వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవంలో స్మరించడం పుణ్యప్రదం.

**రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండి పెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...
9440595494**

# దళితుల సంక్షేమం కోరేది కాంగ్రెస్ ప్రభుత్వమే..

- దళితులపై బీఆర్ఎస్‌కు కపట ప్రేమ..
- త్వరలోనే దళితబంధు రెండో విడత నిధులు..
- ఎంఎంఎస్ సభలో తీపికబురు చెప్పిన ప్రణవ్



**జమ్మికుంట సెప్టెంబర్ 13 (సింగిడి):** దళితబంధు పథకం విషయంలో ఇక్కడ ఇంచార్జిగా ప్రణవ్ మంత్రులను,ఇంచార్జి మంత్రులను కలిసి నిధులు విడుదల అయ్యేందుకు కృషి చేస్తున్నాడని మాజీ మంత్రి మోత్కుపల్లి నరసింహులు అన్నారు.ఆదివారం నాడు జమ్మికుంట పట్టణంలోని ఎంపీఆర్ గార్డెన్స్ లో మాదిగ మహాశక్తి ఆధ్వర్యంలో మాదిగల ఆత్మీయ సమావేశానికి ముఖ్య అతిథిగా మాజీ మంత్రి మోత్కుపల్లి నరసింహులు, హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ హాజరయ్యారు.ఈ సందర్భంగా నిర్వాహకులు ఘన స్వాగతం పలికారు.అనంతరం ప్రణవ్ మాట్లాడుతూ దళిత జాతి అభ్యున్నతి కోసం కాంగ్రెస్ పార్టీ నిత్యం కృషి చేస్తుందని,ఎస్సీ వర్గీకరణ కోసం ఏ పార్టీ చేయని పనిని కాంగ్రెస్ ప్రభుత్వం రేవంత్ రెడ్డి చేసి చూపెట్టారని అన్నారు.దళిత స్పీకర్ గా ఉన్న వ్యక్తిపై వ్యక్తిగతదూషణ,తర్వాత వారు తిరిగిన ప్రాంతాన్ని పసుపునీటితో శుద్ధిచేయడం లాంటివి సమాజంలో ఎలాంటి పరిస్థితిని బీఆర్ఎస్ సృష్టిస్తుందో అర్థం చేసుకోవచ్చని విమర్శించారు.గత ప్రభుత్వంలో ఆనాడు ఎన్నికల సమయంలో ప్రవేశపెట్టిన దళితబంధు పథకం లబ్ధిదారులకు పూర్తిస్థాయిలో ఇవ్వకుండా వారిని రాజకీయాల్లో ఓట్ల కోసం వాడుకున్నారని,ఓట్లతో సంబంధం లేకుండా కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 8వేల చిల్లర పై చిలుకు ఉన్న దళితబంధు లబ్ధిదారులను 2025లో గ్రౌండింగ్ ప్రక్రియను మరల చేపట్టి అయిదువేల వరకు తీసుకువచ్చామని,వాటిని ఆపాలని ఎన్ని ప్రయత్నాలు చేసినా ప్రభుత్వం నిధుల విడుదలకు సిద్ధంగా ఉందని ఆ దిశగా ముందుకు వెళు తున్నామని,త్వరలోనే ఆ ప్రక్రియ చేపడతామని శుభవార్త తెలిపారు. ఈ ప్రకటనతో దళిత బంధు లబ్ధిదారుల్లో సంతోషం వెల్లివిరిసింది. ఈ కార్యక్రమంలో ఎంఎంఎస్ నిర్వాహకులు,కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రతినిధులు, నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## తల్లిదండ్రుల జ్ఞాపకార్థం హనుమాన్ దేవాలయ కమాన్ నిర్మాణం




**జమ్మికుంట సెప్టెంబర్ 13 (సింగిడి):** తనుగుల గ్రామానికి చెందిన తోట రాయలింగు – ఆగమ్మ దంపతుల జ్ఞాపకార్థం వారి సంతానం, తనుగుల హనుమాన్ దేవాలయానికి రోడ్ ద్వారం వద్ద 24000 వేల రూపాయలతో ఐరన్ కమాన్ చేయించి, వినాయక నవరాత్రి ఉత్సవాల సందర్భంగా నిలపడం జరిగింది. గతంలో మెయిన్ రోడ్ నుండి గుడి వరకు సిమెంట్ రోడ్ వేస్తున్న సందర్భంలో గ్రామ పెద్దల కోరిక మేరకు రోడ్ నిర్మాణానికి కొంత స్థలాన్ని ఇవ్వడం జరిగింది. సర్పంచ్ కిరణ్ మాట్లాడుతూ వీరి కుటుంబ సభ్యులు గ్రామానికి సేవ చేయాలనే ఉద్దేశంతో ముందుకు వచ్చి ఈ పనులు చేయించడం ఎంతో అభినందనీయమన్నారు. సామాజిక కార్యకర్త అంబాల రజనీకాంత్ మాట్లాడుతూ గతములో స్కూల్ విద్యార్థులు అందరికీ మధ్యన భోజనం ప్లేట్లు అందించడం, పలు సేవా కార్యక్రమాలు చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ జక్కే కిరణ్, సామాజిక కార్యకర్త అంబాల రజనీకాంత్, గ్రామ పురోహితులు వల్లూరి పవన్ కుమార్, విష్ణు, వాసాల సుధీర్, దేవేందర్ రెడ్డి, వెంకట్ రెడ్డి, యాద కిషన్, రాజు,దాసారపు రాజయ్య, ప్రశాంత్, సంజీవ్, సంపత్, కొమురయ్య, గ్రామ పంచాయతీ సిబ్బంది, దాత కుటుంబసభ్యులు తోట రాజు, సరిత, లక్ష్మీ ప్రియ, ఈశ్వర్ కార్తీక్, స్వరూప, కౌటమ్ రాజ్ కుమార్, అంజలి తదితరులు పాల్గొన్నారు.

## ప్రీ-ప్రైమరీ సిబ్బంది జీతాలు వెంటనే చెల్లించాలి

### మూడు నెలలుగా వేతనాలు పెండింగ్, న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలి




**కరీంనగర్, సెప్టెంబర్13(సింగిడి):** గత మూడు నెలలుగా పెండింగ్‌లో ఉన్న ప్రీ-ప్రైమరీ పాఠశాల బోధకులు, ఆయాల వేతనాలను వెంటనే చెల్లించాలని తెలంగాణ ప్రీ-ప్రైమరీ బోధకులు, ఆయాల సంఘం రాష్ట్ర న్యాయ సలహాదారు జక్కనపల్లి గణేష్, ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఇన్‌చార్జి ఎం. లక్ష్మణ్ డిమాండ్ చేశారు. పట్టణంలోని స్నేహ వృత్తి విద్యా జూనియర్ కళాశాలలో జరిగిన సంఘం సమావేశంలో వారు ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడారు.బోధకులు, ఆయాల పని సమయాన్ని తగ్గించి ఉద్యోగ భద్రత కల్పించాలని, కార్మికులకు ఉద్యోగుల రాష్ట్ర బీమా, భవిష్యనిధి సౌకర్యాలు అమలు చేయాలని కోరారు. ప్రస్తుతం చెల్లిస్తున్న వేతనాలు తక్కువగా ఉన్నందున కనీస వేతన చట్టం ప్రకారం జీతాలను సవరించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో కరీంనగర్ జిల్లా తాత్కాలిక కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా కన్వీనర్‌గా సుమయా సధాఫ్, సహ కన్వీనర్లుగా గుండ మమత, ఇటికాల ధనూజ, జవ్వాజి శ్రావ్య, బర్రె మౌనిక, దొంత అనిత, మేడి మౌనిక, అడప భాగ్యలక్ష్మి, సంయుక్త కన్వీనర్లుగా ఈదురు పద్మ, అక్కల మౌనిక, ఐతం మమత, పారిపల్లి శ్రీలత ఎన్నికయ్యారు.

## మట్టి వినాయకులతో పర్యావరణ పరిరక్షణ

### 48వ డివిజన్‌లో మట్టి వినాయక ప్రతిమలను పంపిణీ చేసిన, అప్పాల శ్రీనివాస్



**కరీంనగర్, సెప్టెంబర్13(సింగిడి):** వినాయక చవితిని పురస్కరించుకుని కరీంనగర్ నగరంలోని 48వ డివిజన్‌లో స్థానిక ప్రజలకు పశ్చిమ మండల ఇతర వెనుకబడిన తరగతుల మోర్చా ప్రధాన కార్యదర్శి అప్పాల శ్రీనివాస్ మట్టి వినాయక ప్రతిమలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పర్యావరణ పరిరక్షణ బాధ్యత ప్రతి ఒక్కరి పై ఉందన్నారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్, రసాయన రంగులతో తయారు చేసిన విగ్రహాల నిమజ్జనం వల్ల జలవనరులు, నేల కలుషితమవుతున్నాయని తెలిపారు. పర్యావరణాన్ని కాపాడటంతో పాటు సంప్రదాయాలను పరిరక్షించేందుకు మట్టి వినాయకులనే పూజించాలని సూచించారు. పర్యావరణహితంగా వినాయక చవితి వేడుకలు నిర్వహించేందుకు ప్రజలంతా సహకరించాలని పిలుపునిచ్చారు.

## ఫాగింగ్ వాహనాలు మూలకేనా?

### ప్రజల పన్నుల సొమ్ముతో కొనుగోలు చేసిన వాహనాలను వెంటనే వినియోగంలోకి తేవాలి

### నగర పాలక సంస్థ కమిషనర్, జిల్లా కలెక్టర్‌ను డిమాండ్ చేసిన మాజీ మేయర్ సర్దార్ రవీందర్‌సింగ్



**కరీంనగర్, సెప్టెంబర్13(సింగిడి):** నగరంలో దోమల బెడద, విషజ్వరాలు పెరుగుతున్న నేపథ్యంలో ప్రజల ఆరోగ్యం కోసం కొనుగోలు చేసిన పొగమందు పిచికారీ వాహనాలను పూర్తిస్థాయిలో వినియోగంలోకి తీసుకురాకపోవడంపై మాజీ మేయర్, తెలంగాణ రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ మాజీ చైర్మన్ సర్దార్ రవీందర్ సింగ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజల పన్నుల సొమ్ముతో కొనుగోలు చేసిన వాహనాలు ప్రజల సేవకు ఉపయోగ పడాల్సింది పోయి మూలన ఉండటం ఏమిటని ప్రశ్నించారు. ఫాగింగ్ వాహనాల కొనుగోలు, వినియోగం, నిర్వహణ, ఇంధనం, బిల్లులకు సంబంధించిన పూర్తి వివరాలను కరీంనగర్ నగర పాలక సంస్థ కమిషనర్, జిల్లా కలెక్టర్ ప్రజల ముందుంచాలని డిమాండ్ చేశారు. వాహనాలు ఎప్పుడు వచ్చాయి, ఇప్పటివరకు ఎక్కడెక్కడ వినియోగించారు, ఎంత ఖర్చు చేశారు అనే వివరాలపై సమగ్ర విచారణ జరపాలని కోరారు.ఒక్కో వాహనానికి సుమారు రూ. 2 లక్షల వరకు ముందస్తు చెల్లింపులు తీసుకున్నారనే అనుమానాలు ఉన్నాయని, ఇందులో వాస్తవాలను విచారణ ద్వారా తేల్చాలని అన్నారు. కొత్తగా వచ్చిన చెత్త సేకరణ వాహనాలను కూడా పరిశీలించి, అవసరమైన మరమ్మతులు పూర్తి చేసి ప్రజల సేవలోకి తీసుకురావాలని కోరారు. నగరంలో దోమల నివారణకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టి ప్రతి డివిజన్‌లో క్రమం తప్పకుండా పిచికారీ నిర్వహించాలని, నిల్వ నీరు, మురుగునీటి ప్రాంతాలను గుర్తించి చర్యలు తీసుకోవాలని సర్దార్ రవీందర్ సింగ్ డిమాండ్ చేశారు. ప్రజల ఆరోగ్యం, ప్రజాధనానికి సంబంధించిన అంశాల్లో నిర్లక్ష్యాన్ని సహించబోమని, అవకతవకలు తేలితే బాధ్యులపై చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.

## రాజ్యాధికారం కోసం మాదిగలు ఏకం కావాలి

### హక్కుల సాధనకై ఉద్యమించాలి

### మాజీ మంత్రి మోత్కుపల్లి నరసింహులు

### ఘనంగా మాదిగ మహాశక్తి ఆత్మీయ సమ్మేళనం



**జమ్మికుంట సెప్టెంబర్ 13 (సింగిడి):** రాజ్యాధికారం దక్కాలంటే మాదిగలు, బీసీలు కులాలు ఏకం కావాలని మాదిగ మహాశక్తి వ్యవస్థాపక అధ్యక్షుడు మోత్కుపల్లి నర్సింహులు అన్నారు. కరీంనగర్ జిల్లా జమ్మికుంట పట్టణంలోని ఎంపీఆర్ – గార్డెన్ లో మాదిగల బీసీల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ముఖ్య అతిథిగా మాదిగ మహాశక్తి వ్యవస్థాపక అధ్యక్షుడు మోత్కుపల్లి నర్సింహులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూరాజ్యాధికారం దక్కాలంటే మాదిగలు, బీసీ కులాలుఏకంకావాలన్నారు.స్వతంత్రం వచ్చినప్పటి నుండి రెడ్డి కులస్తులు ముఖ్యమంత్రులు అవుతున్నారని,వారు తిన్న తర్వాత వాళ్ళ కులానికి పంచుకోని మనకు సంక్షేమ పథకాలు ఇస్తున్నారని అని అన్నారు.119అసెంబ్లీ సీట్లలో 43సీట్లు ఒక్క రెడ్డి కులస్తులే తీసుకున్నారని,మన జాతుల్లో ఐకమత్యం లేకనే ఇలాంటివి జరుగుతున్నాయని వెల్లడించారు.ఎమ్మెల్సీ పదవిలో ఉండి తాతా మధు స్పీకర్ పై వాఖ్యలు చేయడాన్ని ఖండించారు .వేరే కులపు వాళ్లను అలా తిట్టలేడు, దళితుడు కాబట్టే తిట్టాడని ధ్వజమెత్తారు. 22ఏ జీవో కింద రాష్ట్రంలోని అన్ని భూములను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లాక్కున్నాడని అన్నారు.లబ్ధిదారులకు రెండవ విడత దళితబంధు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఆర్థికంగా రాజకీయంగా మాదిగలకు, బీసీలకు, రావలసిన హక్కులను పదవులను దక్కించుకోవాలని అన్నారు. దళితుల అభ్యున్నతి కోసం కాంగ్రెస్ పార్టీ కృషి చేస్తుందని రానున్న రోజుల్లో అతి త్వరలో దళిత బంధు నిధుల విడుదలలో ప్రజా పాలన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రభుత్వం కృషి చేస్తుందని నియోజకవర్గ ఇన్చార్జి ప్రణవ్ బాబు అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ గుండెడప్పు కనకయ్య, ప్రొఫెసర్ మురళీ దర్శన్ , రాష్ట్ర నాయకులు విజయ్ కుమార్ , రాష్ట్ర నాయకులు ఆసంపల్లి శ్రీనివాస్ వీరస్వామి , పలువురు నాయకులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.



## నూతన భవనంలోకి 'వాత్సల్య" ఆసుపత్రి

### ప్రారంభించిన మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్

### ఆధునిక పరికరాలతో కార్పొరేట్ స్థాయి వైద్యం

### తల్లి పిల్లలకు ఒకే చోట బెస్ట్ ట్రీట్‌మెంట్





**జమ్మికుంట, సెప్టెంబర్ 13 (సింగిడి):** జమ్మికుంట పట్టణ పరిధిలో బొమ్మల గుడి శివాలయం ఎదురుగా డాక్టర్ దేవేందర్ రెడ్డి వాత్సల్య పిల్లల హాస్పిటల్ ను మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జమ్మికుంట పట్టణ, పరిసర ప్రాంతా వాసులకు చిన్న పిల్లలు అనారోగ్యం చెందిన వారు జిల్లా స్థాయి హాస్పిటల్ కు వెళ్లకుండా మన జమ్మికుంటలోనే అన్ని రకాల సదుపాయాలతో అందుబాటులోకి రావడం జరిగిందని తెలిపారు. ఫర్టిలిటీ, తల్లి పిల్లల ఆస్పత్రిగా "వాత్సల్య" చక్కటి సేవలు అందించనున్నదని స్పష్టం చేశారు. వైస్ చైర్మన్ ముంతాజ్ అలీ జావేద్ఇం, ద్రసేనారెడ్డి పలువు డాక్టర్స్ తదితరులు ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు.

**పట్టణ నడిబొడ్డున..బొమ్మల గుడి ఎదురుగా..**

గత ఎనిమిది సంవత్సరాలుగా జమ్మికుంట పట్టణ పరిసర ప్రాంత ప్రజలకు చక్కటి వైద్య సేవలు అందించి.. ప్రజల మదిలో స్థానాన్ని సంపాదించుకున్న డాక్టర్ దేవేందర్ రెడ్డి వాత్సల్య పిల్లల హాస్పటల్ ఇక ఇప్పుడు తల్లి పిల్లల ఆస్పత్రిగా మారింది. పట్టణ నడిబొడ్డున బొమ్మల గుడి ఎదురుగా నూతన భవనంలో ఫెర్టిలిటీ, పిల్లల ఆస్పత్రిగా "వాత్సల్య" ఆస్పత్రిలో సేవలు అందలు ఉన్నాయి. 0 నుంచి 18 సంవత్సరాల వరకు పిల్లల, నవజాత శిశువుల ప్రత్యేక వైద్య నిపుణులుగా డాక్టర్ దేవేందర్ రెడ్డి కట్కూరి, ఫెర్టిలిటీ, గైనకాలజీ ప్రత్యేక వైద్య నిపుణురాలుగా డాక్టర్ ఆమని రెడ్డి చెరుకు 24/7 అందుబాటులో ఉండనున్నారు.

**గ్రామీణులకు కార్పొరేట్ స్థాయి వైద్యం లక్ష్యం**

గ్రామీణ ప్రాంతాలలోని ప్రజలకు కార్పొరేట్ స్థాయి వైద్యాన్ని అందించాలనే లక్ష్యంతో అకుంఠిత దీక్షతో చిన్ననాటి నుండి వైద్య వృత్తిపై ఉన్న మక్కువతో వైద్యవృత్తిని ఎంచుకొని వైద్యులుగా తన ప్రస్థానం ప్రారంభించి.. అంచలంచెలుగా ఎదుగుతూ అన్ని హంగులతో కూడిన ఆస్పత్రిని ఏర్పాటు చేసి వైద్య వృత్తిలో తనకంటూ ఒక ప్రత్యేకతను చాటుతూ డాక్టర్ దేవేందర్ ఆమని రెడ్డి దంపతులు ముందుకు దూసుకు పోతున్నారు. అధునాతన సౌకర్యాలు, అత్యాధునిక పరికరాలతో ఆసుపత్రిలో ది బెస్ట్ ట్రీట్మెంట్ అందిస్తూ.. వాత్సల్య.. ఇప్పటివరకు పిల్లల ఆసుపత్రి గా ఉండగా, ఇకపై తల్లి పిల్లలకు ఒకే చోట సేవలందించే ఆసుపత్రిగా, ప్రజా వైద్యశాలగా చక్కటి పేరు గడించి సేవలు విస్తృతంగా అందించనుందని ఈ సందర్భంగా పలువురు అభిప్రాయపడుతున్నారు.

## గణేష్ ఉత్సవాలకు పటిష్ట బందోబస్తు

### నేర నియంత్రణ, సైబర్ మోసాలు, మహిళలు,చిన్నారుల భద్రతపై సీపీ గౌష్ ఆలం సమీక్ష



**కరీంనగర్, సెప్టెంబర్ 13(సింగిడి):** గణేష్ నవరాత్రి ఉత్సవాలు, నిమజ్జన వేడుకలు ప్రశాంతంగా జరిగేలా పటిష్ట భద్రతా చర్యలు చేపట్టామని పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం తెలిపారు. కమిషనరేట్ కార్యాలయంలో నిర్వహించిన నెలవారీ నేర సమీక్ష సమావేశంలో నేర నియంత్రణ, పెండింగ్ కేసులు, సైబర్ నేరాలు, మహిళలు--చిన్నారుల భద్రత, మాదకద్రవ్యాలు, ట్రాఫిక్ తదితర అంశాలపై సమీక్షించారు. గణేష్ మండపాల వద్ద నిర్వాహకులు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి, అత్యవసర ఫోన్ నంబర్లను ప్రదర్శించాలని, వాలంటీర్లను అందుబాటులో ఉంచాలని సీపీ సూచించారు. మానకొండూర్, కొత్తపల్లి, చింతకుంట తదితర నిమజ్జన ప్రాంతాల్లో భారీ క్రేన్లు, నిరంతర విద్యుత్, గజ ఈతగాళ్లతో భద్రతా ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఊరేగింపు మార్గాల్లో ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని, సామాజిక మాధ్యమాల్లో వదంతులు, రెచ్చగొట్టే ప్రచారం చేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నేరాల దర్యాప్తును శాస్త్రీయ ఆధారాలతో వేగవంతం చేసి నిందితులకు శిక్ష పడేలా చర్యలు తీసుకోవాలని, పెండింగ్ కేసులను త్వరగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. మహిళలు, చిన్నారులపై నేరాలు, ముఖ్యంగా పోక్సో, అత్యాచార కేసుల్లో దర్యాప్తును వేగవంతం చేసి బాధితులకు సత్వర న్యాయం అందేలా చూడాలని సూచించారు. సైబర్ నేరాల్లో బాధితుల నగదు రికవరీకి ప్రాధాన్యం ఇవ్వడంతో పాటు, పోగొట్టుకున్న మొబైల్ ఫోన్లను కేంద్ర పరికర గుర్తింపు వ్యవస్థ ద్వారా త్వరగా రికవరీ చేయాలని ఆదేశించారు. మాదకద్రవ్యాలు, గుట్కా, పేకాట, అక్రమ ఇసుక రవాణాపై నిఘా పెంచి కఠిన చర్యలు తీసుకోవాలని, రోడ్డు ప్రమాదాల నివారణకు ట్రాఫిక్ నిబంధనలను కట్టుదిట్టంగా అమలు చేయాలని సూచించారు.

**4,268 కేసుల పరిష్కారం...**

సెప్టెంబర్ 12న నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో కమిషనరేట్ పరిధిలో 4,268 కేసులు పరిష్కారమయ్యాయని సీపీ తెలిపారు. ఇందులో 451 ఎఫ్ఐఆర్ కేసులు, 1,019 ప్రమాదాలు, ఇతర కేసులు, 2,798 మోటారు వాహన కేసులు, 34 సైబర్ కేసులు ఉన్నాయి. అత్యధిక కేసుల పరిష్కారానికి కృషి చేసిన కరీంనగర్ ట్రాఫిక్, కరీంనగర్--1 టౌన్ పోలీస్ స్టేషన్ల అధికారులు, ప్రభుత్వ న్యాయవాదులను సీపీ అభినందించారు. గణేష్ నవరాత్రి వేడుకలను భక్తిశ్రద్ధలతో, శాంతియుతంగా నిర్వహించడంతో పాటు నిబంధనలు పాటించి పోలీస్ శాఖకు ప్రజలు, ఉత్సవ కమిటీలు సహకరించాలని గౌష్ ఆలం కోరారు. సమావేశంలో అదనపు డీసీపీ వెంకటరమణ, న్యాయశాఖ ఉప సంచాలకులు పి. కృష్ణమూర్తి, ఏసీపీలు, సీఐలు, ఇతర పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

## మాజీ మంత్రి మోత్కుపల్లికి మున్సిపల్ చైర్ పర్సన్ ఘన సన్మానం




**జమ్మికుంట సెప్టెంబర్ 13 (సింగిడి):** జమ్మికుంట పట్టణంలోని ఎం పి ఆర్ గార్డెన్ లో ఆదివారం నిర్వహించిన మాదిగ మహా శక్తి ఆత్మీయ సమ్మేళనానికి ముఖ్య అతిథిగా వచ్చిన రాష్ట్ర మాజీ మంత్రి మోత్కుపల్లి నరసింహులు ను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో ఘనంగా సన్మానించిన హుజురాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ రౌంటాల సుహాసిని. మాదిగ మహాశక్తి ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న మున్సిపల్ చైర్ పర్సన్ సుహాసిని నీ ఉద్దేశించి మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులు మాట్లాడుతూ ఒక దళిత బిడ్డ రాజకీయంగా ఎదిగితే కుల మతాలకు అతీతంగా మన దగ్గరికి వస్తారని ప్రతి ఒక్కరూ ఈ ఆడబిడ్డను ఆదర్శంగా తీసుకొని రాజకీయంగా ముందుకు వెళ్లాలని సూచించారు. దళితుల ఓటు దళితులకు అన్న నినాదంతో ప్రతి ఒక్కరు ఐకమత్యంతో మన దళిత బిడ్డలను గెలిపించుకోవాలని సూచించారు.. అనంతరం మున్సిపల్ చైర్ పర్సన్ సుహాసిని ని మాజీ మంత్రి అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి ప్రణవ్ బాబు జమ్మికుంట కాంగ్రెస్ పార్టీ మండల మహిళ తోట స్వప్న మైనార్టీ నేత సజ్జు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా పూర్వ విద్యార్థుల" అపూర్వ" సమ్మేళనం



**జమ్మికుంట సెప్టెంబర్ 13 (సింగిడి):** జమ్మికుంట మండలంలోని బిజిగిరి షరీఫ్ గ్రామం లో గల జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో 1992–93 విద్యాసంవత్సరం పదవ తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు తాము చదువుకున్న రోజుల్లో అనుభూతులను గుర్తు చేసుకుంటూ ఆటపాటలతో ఉత్సాహంగా గడిపారు. అనంతరం తమకు విద్యా బుద్ధులు నేర్పిన గురువులైన రాజిరెడ్డి ,రాజగోపాల్ ,నర్సింహారెడ్డి ,వెంకటేశ్వర చారి,చంద్ర మోహన్ ,ప్రభాకర్,రాజేశం లను పూల మాలలు శాలువాలు మెమొంటో లతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు రాజేందర్ ,మహేందర్,సంపత్ రావు ,జలీల్ ,శ్రీనివాస్,చంద్రశేఖర్,వీరేశలింగం పోచయ్య,ఉమారాణి,స్వరూప విజయ ధనలక్ష్మి విజయ తదితరులు పాల్గొన్నారు.

## గ్యాస్ ఏజెన్సీ ఎత్తివేతపై బిఆర్ఎస్ శ్రేణుల ధర్నా



**మహాదేవపూర్ సెప్టెంబర్ 13 (సింగిడి):** గిరిజన సహకార సంస్థ ఆధ్వర్యంలో మారుమూల మండలాలకు గ్యాస్ సరఫరా చేస్తున్న ఏజెన్సీని జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రానికి తరలించడం పట్ల మహాదేవపూర్ మండల కేంద్రంలో బిఆర్ఎస్ పార్టీ శ్రేణులు ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు శ్రీపతి బాపు, కేదారి గీత, అలీమ్ ఖాన్, మహేష్, వెంకటస్వామి, కూరతోట రాకేష్, సాజిద్, అరుణ, స్వప్న, అర్జున్, నర్సిన కృష్ణ, జక్కయ్య పాల్గొన్నారు.

ప్రభాతనవ సింగిడి ప్రతి రంగూ ఓ నిజం
Singidi సోమవారం 14-9-2026

# అలరించిన పూర్వ విద్యార్థుల సమావేశం

- 37 సంవత్సరాల తర్వాత కలుసుకున్న పూర్వ విద్యార్థులు



**జమ్మికుంట, సెప్టెంబర్ 13 (నినాదం):** హుజురాబాద్ పట్టణం లోని మధువని గార్డెన్ లో ఆదివారం స్థానిక ప్రభుత్వ హైస్కూల్లో 1989 ఎస్ఎస్సి బ్యాచ్ విద్యార్థుల పూర్వ విద్యార్థుల సమ్మేళనం జరిగింది. ఈ సమావేశానికి ఆనాటి ఉపాధ్యాయులతో పాటు సుమారు 150 మంది పూర్వ విద్యార్థులు హాజరయ్యారు. తాము చదువుకున్న పాఠశాలను సందర్శించి పాత జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. నాటి ఉపాధ్యాయులను ఆహ్వానించి ఘనంగా స్వాగతం పలకడంతో పాటు ఘనంగా సన్మానించారు. నాటి ప్రభుత్వ హైస్కూలు ఉపాధ్యాయుల ప్రోత్సాహం వల్లే తాము ఉన్నత స్థానాల్లో స్థిరపడ్డామని గుర్తు చేసుకున్నారు. భవిష్యత్తులో పాఠశాలను పరిరక్షించడంతోపాటు, పాఠశాల అభివృద్ధికి కృషి చేయాలని, సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించాలని నిర్ణయించుకున్నట్టు పూర్వ విద్యార్థులు తెలిపారు. 37 సంవత్సరాల తర్వాత పూర్వ విద్యార్థులను కలుసుకోవడం సంతోషంగా ఉందని ఉపాధ్యాయులు తెలిపారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు విద్యార్థులు తమ అనుభవాలను పంచుకున్నారు. భవిష్యత్తులోనూ ఇలాగే సమావేశాలు నిర్వహించుకోవాలని పాఠశాల అభివృద్ధికి సమాజాభివృద్ధికి తోడ్పాటు అందించాలని సూచించారు. నాడు ప్రభుత్వ పాఠశాలను ఒక ప్రైవేటు పాఠశాల లాగా నడిపించారని, విద్యార్థుల భవిష్యత్తు కోసం కృషి చేశారని, నేడు అన్ని రంగాల్లో విద్యార్థులు ఉన్నత స్థానాల్లో స్థిరపడ్డారని పలువురు ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో నాటి ఉపాధ్యాయులు ఆలేటి మదన్ మోహన్ రెడ్డి, రామకృష్ణారెడ్డి, కవ్వ లక్ష్మారెడ్డి, గూడూరు మల్లారెడ్డి, గుజ్జుల నారాయణరెడ్డి, దొనకొండ ప్రభాకర్ రెడ్డి, రాధా కిషన్ పాల్గొన్నారు. 1989 బ్యాచ్ పూర్వ విద్యార్థుల సంఘం ప్రతినిధులు శనిగరపు నరేందర్, గోలి సురేష్, పోన్నోజు సంతోష్ కుమార్, అనుముల ప్రవీణ్ శర్మ, అక్కినపల్లి అనిల్ కుమార్ తదితరులు కార్యక్రమాన్ని సమన్వయం చేశారు. కార్యక్రమానికి సమన్వయకర్తలుగా బొమ్మ కంటి మురళీధర్, కొల్లూరు అనిల్ కుమార్ వ్యవహరించారు.

## మట్టి గణపతు లను పూజిద్దాం పర్యావరణాన్ని రక్షిద్దాం

### ఆవోపా ఆధ్వర్యంలో మట్టి గణపతుల పంపిణీ



**జమ్మికుంట, సెప్టెంబర్ 13 (సింగిడి):** పర్యావరణాన్ని రక్షించడానికి ప్రతి ఒక్కరు మట్టి గణపతులను ఏర్పాటు చేసుకొని పూజించాలని జమ్మికుంట ఆవోప అధ్యక్షులు ఆకినపల్లి శ్రీనివాస్ తెలిపారు. జమ్మికుంట ఆవోప ఆధ్వర్యంలో మట్టి గణపతి లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రతి సంవత్సరం వినాయక చవితి పండుగను పురస్కరించుకుని ఆవోప ఆధ్వర్యంలో మట్టి గణపతులను అందించడం జరుగుతుందని పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు. ప్రతి ఒక్కరూ పవిత్రంగా గణపతి నవరాత్రి ఉత్సవాలను ప్రశాంతమైన వాతావరణం లో జరుపుకోవాలని భక్తిశ్రద్ధలతో గణపతిని పూజిస్తే సకల విఘ్నాలు తొలిగిపోతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి కొండ్లె నాగేష్ కోశాధికారి మంచాల రాంబాబు గందె ప్రవీణ్ తాటిపల్లి సురేష్ దొడ్డే శ్యామ్ పాల్గొన్నారు.

## శిక్షా రత్నా అవార్డు గ్రహీతలకు ఆర్డీవో అభినందన



**మిర్యాలగూడ సెప్టెంబర్ 13(సింగిడి):** ఇటీవల ప్రతిష్టాత్మక సంస్థల నుంచి శిక్షా రత్నా అవార్డులు అందుకున్న కేఎల్ఎన్ విద్యాసంస్థల ప్రిన్సిపాళ్లు బికుమల్ల కిరణ్‌కుమార్, తుమ్మలపల్లి నరేందర్‌రెడ్డిని మిర్యాలగూడ ఆర్డీవో ఎస్. రమణారెడ్డి అభినందించారు. మిర్యాలగూడ ఆర్డీవో కార్యాలయంలో కార్యాలయంలో వారిని సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ విద్యారంగంలో విశేష సేవలందిస్తూ ప్రతిష్టాత్మక అవార్డులు అందుకోవడం అభినందనీయమన్నారు. ఇదే స్ఫూర్తితో విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించి, వారిని ఉన్నత శిఖరాలకు చేర్చేందుకు కృషి చేయాలని సూచించారు. మిర్యాలగూడ పట్టణానికే కాకుండా తెలంగాణ రాష్ట్రానికి కూడా సేవలందించేలా విద్యార్థులను తీర్చిదిద్దాలని ఆకాంక్షించారు. విద్యా రంగంలో ఉత్తమ సేవలకు గుర్తింపుగా శిక్షా రత్నా అవార్డులు లభించడం సంతోషకరమైన విషయమని పేర్కొంటూ, భవిష్యత్తులో మరిన్ని ఉన్నత స్థాయి అవార్డులు అందుకోవాలని ఆర్డీవో ఆకాంక్షించారు. ఈ సందర్భంగా అవార్డు గ్రహీతలు ఆర్డీవోకు కృతజ్ఞతలు తెలిపారు.

## ఒక్క ఓటు మిస్ కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

### ఆర్డీఓ రమణారెడ్డి



**మిర్యాలగూడ సెప్టెంబర్ 13(సింగిడి):** ఒక్క ఓటు పోకుండా జాగ్రత్తగా నోటీసుల విచారణ చేయాలని మిర్యాలగూడ డివిజన్ ఎఈఆర్ఓ, ఆర్డిఓ ఎస్. రమణారెడ్డి ఆదేశించారు. మిర్యాలగూడ శాసనసభ నియోజకవర్గంలో మిర్యాలగూడ పట్టణం, మండలం పోలింగ్ బూత్ నెం. 81కి చెందిన నోటీసుల హియరింగ్ ప్రక్రియ పనులను, తహసిల్దార్ పి. శ్రీనివాస్ తో కలిసి ఆర్డిఓ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటర్లకు ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. ఎంపీపీఎస్ గీత మందిర్ వద్ద ఎస్ఐఆర్ నోటీసు హియరింగ్ ను పరిశీలించారు. కౌన్సిలర్ షబానా అయుబ్, బిఎల్ఓల సూపర్వైజర్ శ్రీనివాస్, బిఎల్ఓలు గౌసియా, విజయ, వెంకటేశ్వర్లు, జ్యోతితో కలిసి ఎస్ఐఆర్ ప్రక్రియను పరిశీలించి, పలు సూచనలు చేశారు. తొలుత శనివారం ఉదయం ఆర్డీఓ రమణా రెడ్డి దామరచర్ల మండలం గ్రామపంచాయతీలో నిర్వహిస్తున్న నోటీసుల విచారణ ప్రక్రియ పనులను తహసీల్దార్ జవహర్ లాల్, బీఎల్ఓ సూపర్ వైజర్‌లతో కలిసి తనిఖీ చేశారు. దామరచర్ల మండలం రాళ్లవాగుతండా పోలింగ్ బూత్ నెంబర్ 213 లో నోటీస్ హియరింగ్ ప్రక్రియ పనులను సందర్శించి, తనిఖీ చేశారు.

# పోషక విలువలతో కూడిన ఆహారం తీసుకోవాలి

- హనుమకొండ జిల్లా వైద్య అధికారి డాక్టర్ అల్లం అప్పయ్య



**హన్మకొండ, సెప్టెంబర్ 13(సింగిడి):** టీబీ పేషంట్స్ చికిత్స సమయంలో పోషక విలువలతో కూడిన ఆహారం తీసుకోవాలని హనుమకొండ జిల్లా వైద్య అధికారి డాక్టర్ అల్లం అప్పయ్య సూచించారు. టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా శనివారం జిల్లా వైద్యాధికారి కార్యాలయంలో టీబీ వ్యాధితో బాధపడుతున్న పదిమందికి 10 నిక్షయ్ పోషణ కిట్లను జిల్లా డాక్టర్ అప్పయ్య మరియు డిప్యూటీ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి ఇంచార్జ్ క్షయ నివారణ అధికారి డాక్టర్ ప్రదీప్ రెడ్డి గారు టీబీ పేషెంట్లకు పోషణ కిట్లను పంపిణీ చేయడం జరిగినది. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి మాట్లాడుతూ స్వచ్ఛంద సంస్థలు, కార్పొరేట్ సంస్థలు సామాజిక బాధ్యతతో క్షయ వ్యాధిగ్రస్తులను దత్తత తీసుకోవడానికి ముందుకు రావాలని, టీబి అంతంలో నిశ్చాయ్ మిత్ర పాత్ర గుండెకాయ లాంటిది, టీబీ వ్యాధితో భాధ పడుతున్న వారికీ చికిత్స సమయంలో పోషణ సహకారంను అందించినట్లయితే సమాజంలో క్షయ వ్యాధినీ నియంత్రించడం సాధ్యముతుందని, ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా డిప్యూటీ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా. ప్రదీప్ రెడ్డి మాట్లాడుతూ క్షయ వ్యాధి లేని సమాజాన్ని నిర్మించాలని దానికి అందరి సహకారం అవసరమని ప్రతి ఒక్కరూ క్షయ వ్యాధి పట్ల అవగాహన కలిగి ఉండాలని తెలపడం జరిగినది ఈ కార్యక్రమంలో సీ హెచ్ ఓ మాధవ రెడ్డి, టిబి కోఆర్డినేటర్లు కిరణ్, నగేష్, సూపర్వైజర్ విజయ్ స్టాఫ్ పాల్గొన్నారు.

# కాలుష్య రహిత వినాయకోత్సవాలకు పిలుపు



**మిర్యాలగూడ సెప్టెంబర్ 13(సింగిడి):** విద్యార్థులు చదువుతోపాటు సమాజ హితం గురించి కూడా ఆలోచించాలని, కాలుష్య రహిత వినాయకోత్సవాలను నిర్వహించుకోవాలని కె.ఎన్.ఎం. ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రధానాచార్యులు మల్లిరెడ్డి భీమార్జున రెడ్డి విద్యార్థులకు పిలుపునిచ్చారు. వినాయక విగ్రహాలను కాలుష్యరహితంగా తయారు చేసుకోవాలని, ప్లాస్టర్ ఆఫ్ పారిస్, రసాయనాలతో తయారయ్యే రంగులతో తయారయ్యే విగ్రహాల వల్ల పర్యావరణానికి హాని కలుగుతుందని, మట్టి వినాయకుల వినియోగం ద్వారా నీటి కాలుష్యాన్ని నివారించవచ్చని పేర్కొన్నారు. విద్యార్థులు పర్యావరణ పరిరక్షణ పట్ల బాధ్యతతో వ్యవహరించాలని సూచించారు. వినాయక విగ్రహాల నిమజ్జనం సమయంలో కూడా యువత తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, మద్యం, మత్తు పదార్థాలకు దూరంగా వుండాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. ఎన్.ఎస్.ఎస్. మరియు ఎకో -- క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సమన్వయకర్తలు శ్రీనివాస రావు. డా. స్వప్న, ఐ.క్యు.ఏ.సి. సమన్వయ కర్త నాగరాజు, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

# గణేష్ ఉత్సవాలను శాంతియుత వాతావరణంలో నిర్వహించుకోవాలి


- సీఐ వెంకటేశ్వర్లు



**మహాదేవపూర్ సెప్టెంబర్ 13(సింగిడి):** గణేష్ ఉత్సవాలను శాంతియుత వాతావరణంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించుకోవాలని జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ సిఐ వెంకటేశ్వర్లు తెలిపారు. శనివారం గణేష్ ఉత్సవాల మండపాల నిర్వాహకులతో స్థానిక పోలీస్ స్టేషన్లో సమావేశం నిర్వహించారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ వారికి పలు సూచనలు చేశారు. గణేష్ మండపాల ఏర్పాటు కోసం ఇంటిమేషన్ ఫామ్ తప్పనిసరిగా ఆన్లైన్లో నమోదు చేసుకోవాలని, మండపం వద్ద సైబర్ క్రైమ్ అవగాహన ఫ్లెక్సీ, అత్యవసర ఫోన్ నెంబర్లు ఒక పేపర్ పై వ్రాసి అందరికి కనిపించే విధంగా, అత్యవసర సేవల కోసం డయల్ 112, స్థానిక ఎస్సై ఫోన్ నెంబర్ 8712658116, సైబర్ క్రైమ్ హెల్ప్ లైన్ 1930 నెంబర్లను అతికించాలని సూచించారు. అధిక సౌండ్ సిస్టం ఏర్పాటు చేసి ప్రజలకు ఇబ్బంది కలగకుండా చూడాలని, భక్తి పాటలు మాత్రమే ప్రసారం చేయాలని, రాత్రి సమయంలో మండపం వద్ద కనీసం ముగ్గురు వ్యక్తులు ఉండి భద్రతను పర్యవేక్షించాలని అన్నారు. ఓట్లపై ట్రాఫిక్ కు అంతరాయం కలిగించే విధంగా గణేష్ మండపాలను ఏర్పాటు చేయకూడదని, ప్రజలు మరియు వాహనాల రాకపోకలకు ఇబ్బంది కలగకుండా నిర్వాహకులు చర్యలు తీసుకోవాలని సూచించారు. మండపాల నిర్వాహకులు పోలీసులకు పూర్తిస్థాయిలో సహకరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ హసీనాబాను, ఎస్సై సాంబమూర్తితో పాటు మండపాల నిర్వాహకులు పాల్గొన్నారు.

# కాకతీయ విశ్వవిద్యాలయం గోల్డెన్ జూబ్లీ వేడుకలను ఘనంగా నిర్వహించాలి

- మలిదశ తెలంగాణ ఉద్యమకారుల హక్కుల సాధన సమితి కన్వీనర్ రావు అమరేందర్ రెడ్డి



**హన్మకొండ, సెప్టెంబర్ 13(సింగిడి):** కాకతీయ విశ్వవిద్యాలయం గోల్డెన్ జూబ్లీ వేడుకలను ఘనంగా నిర్వహించాలని మలిదశ తెలంగాణ ఉద్యమకారుల హక్కుల సాధన సమితి కన్వీనర్, కేయూ పూర్వ విద్యార్థి, అడ్వకేట్, రావు అమరేందర్ రెడ్డి డిమాండ్ చేశారు. కాకతీయ విశ్వవిద్యాలయం 50 ఏళ్లు పూర్తి చేసుకున్న ఈ చారిత్రక సందర్భం విద్యార్థులు, పూర్వ విద్యార్థులు, అధ్యాపకులు, ఉత్తర తెలంగాణ ప్రజలందరికీ ఎంతో గర్వకారణమని పేర్కొన్నారు. వేడుకల నిర్వహణపై రిటైర్డ్ ప్రొఫెసర్లు, విద్యార్థులు వైస్ ఛాన్సలర్‌ను కలిశానని, నిధుల కొరత కారణంగా ప్రభుత్వం సహాయం చేస్తేనే కార్యక్రమాలు నిర్వహిస్తామని విసి చెప్పడం విచారకరమన్నారు. గతంలో ఉస్మానియా యూనివర్సిటీలో గోల్డెన్, ప్లాటినం జూబ్లీ ఉత్సవాలు నిర్వహించడమే కాకుండా, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి యూనివర్సిటీకి ?1,000 కోట్లు కేటాయించారని ఆయన గుర్తు చేశారు. కానీ తెలంగాణ సాధనలో కీలక పాత్ర పోషించిన కాకతీయ విశ్వవిద్యాలయం పట్ల ఈ వివక్ష ఎందుకని ఆయన ప్రశ్నించారు. అన్ని అభివృద్ధి పనులు చేస్తున్నామని చెప్పే స్థానిక ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, ఎంపీ కడియం కావ్యలు ఈ విషయంపై ఎందుకు స్పందించడం లేదని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజాప్రతినిధులు వెంటనే స్పందించి ఈ అంశాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి ప్రత్యేక నిధులు మంజూరు చేయించాలని డిమాండ్ చేశారు. ఈ విషయంలో హనుమకొండ జిల్లా కలెక్టర్ కూడా స్పందించి, ప్రభుత్వానికి సమగ్ర నివేదిక పంపి వేడుకలు జరిగేలా చూడాలని విజ్ఞప్తి చేశారు.

# గణేష్ ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించాలి

- నల్గొండ డీఎస్పీ శివరాం రెడ్డి



**నల్గొండ ప్రతినిధి, సెప్టెంబర్ 13(సింగిడి):** నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో గణేష్ ఉత్సవాలను నిర్వహించనున్న నిర్వాహకులకు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నల్గొండ డీఎస్పీ శివరాం రెడ్డి ఉత్సవ నిర్వాహకులకు పలు ముఖ్యమైన సూచనలు చేశారు. గణేష్ ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, ప్రశాంతమైన వాతావరణంలో నిర్వహించాలని, ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా నిర్వాహకులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు పాల్పడకుండా పోలీస్ శాఖ సూచనలు, నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని స్పష్టం చేశారు. ఉత్సవాల సందర్భంగా ప్రజలకు, వాహనదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేసుకోవాలని, ఉత్సవాలు సజావుగా జరిగేలా పోలీస్ శాఖకు నిర్వాహకులు పూర్తి సహకారం అందించాలని కోరారు. శాంతిభద్రతలు, ప్రజా క్రమాన్ని కాపాడటంలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని డీఎస్పీ సూచించారు. ఈ కార్యక్రమంలో నల్గొండ వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ ఏమిరెడ్డి రాజశేఖర్ రెడ్డి, నల్గొండ టూటౌన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఆదిరెడ్డి, వన్‌టౌన్ ఎస్ఐలు జి. ముత్తయ్య, జె. సైదులు, టూటౌన్ ఎస్ఐ సైదాబాబు, నల్గొండ రూరల్ ఎస్ఐ శివప్రసాద్, మున్సిపల్ అధికారులు, విద్యుత్ శాఖ అధికారులు, శాంతి కమిటీ సభ్యులు, హిందూ, ముస్లిం, క్రిస్టియన్ మత పెద్దలు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

# కోదాడ క్రికెటర్ల ప్రతిభ.. లీగ్‌కు 12 మంది ఎంపిక

**కోదాడ, సెప్టెంబర్ 13(సింగిడి):** అండర్-14 ఇంట్రా డిస్ట్రిక్ట్ క్రికెట్ లీగ్‌కు కోదాడ క్రికెట్ అకాడమీకి చెందిన 12 మంది క్రీడాకారులు ఎంపికయ్యారు. ఈ నెల 12న నల్గొండలోని మేకల అభినవ్ అవుట్‌డోర్ స్టేడియంలో నిర్వహించిన ఎంపికల్లో వారు ప్రతిభ కనబరిచారు. మణి సుందర్, అనీష్, హరిగోపాల్, నవదీప్, మురారి, హిందూవర్ధన్, నూర్, మహాదేవ్, యోగేశ్వర్, లలిత్, అయాజ్, హితేష్ ఎంపికయ్యారు. వీరు ఉమ్మడి నల్లగొండ జిల్లా తరపున లీగ్‌లో పాల్గొంటారని కోచ్ షేక్ సిద్ధిక్ తెలిపారు. ఎంపికైన క్రీడాకారులను అభినందిస్తూ రాబోయే పోటీల్లో మరింత ప్రతిభ కనబరచాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో అకాడమీ నిర్వాహకులు, సిబ్బంది పాల్గొన్నారు.




## శ్రీ మహాశక్తి ఆలయంలో నేటినుంచి గణేశ్ నవరాత్రి ఉత్సవాలు

- ప్రత్యేక హోమంలో పాల్గొననున్నా కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్



**కరీంనగర్, సెప్టెంబర్13(సింగిడి):** విఘ్నేశ్వరుడి ఆరాధనతో కరీంనగర్ నగరం భక్తి పరవశంలో మునిగిపోనుంది. శ్రీ మహాశక్తి ఆలయంలో నేటి నుంచి ఈ నెల 22వ తేదీ వరకు గణేశ్ నవరాత్రి ఉత్సవాలను వైభవంగా నిర్వహించనున్నారు. హంపి విరూపాక్ష విద్యారణ్య పీఠాధిపతులు శ్రీశ్రీశ్రీ విద్యారణ్య భారతి స్వామివారి ఆశీస్సులతో గత 16 ఏళ్లుగా కొనసాగుతున్న ఈ ఉత్సవాలకు ఈసారి కూడా విస్తృత ఏర్పాట్లు చేశారు. నవరాత్రుల సందర్భంగా తొమ్మిది రోజుల పాటు సహస్ర మోదక గణపతి హోమం నిర్వహించనున్నారు. ప్రతిరోజూ ఉదయం 9 గంటలకు గణపతి పూజ, హోమం, సాయంత్రం 6.30 గంటలకు ప్రత్యేక పూజలు జరుగుతాయి. కుటుంబ సౌఖ్యం, ఆయురారోగ్యాలు, ఐశ్వర్యం, సుఖశాంతులు కలగాలని ఆకాంక్షిస్తూ భక్తులు హోమంలో పాల్గొననున్నారు. గత 16 ఏళ్లుగా సంప్రదాయబద్ధంగా నిర్వహిస్తున్న ఈ ఉత్సవాలకు చిన్నారులు, మహిళలు, యువత, వృద్ధులు పెద్ద సంఖ్యలో హాజరవుతారు. దీంతో తొమ్మిది రోజుల పాటు ఆలయ ప్రాంగణం భక్తులతో సందడిగా మారనుంది.

**23న గణేశ్ నిమజ్జనం**

ఈ నెల 23న గణేశ్ నిమజ్జన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించనున్నారు. ఆరోజు ఉదయం 8 గంటలకు సహస్ర మోదక గణపతి హోమం, పూర్ణాహుతి, ఉత్తర పూజ అనంతరం నిమజ్జనం చేపట్టనున్నారు. మధ్యాహ్నం జరిగే ప్రత్యేక హోమ కార్యక్రమంలో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ పాల్గొననున్నారు. శ్రీ మహాశక్తి ఆలయంలో జరిగే గణేశ్ నవరాత్రి ఉత్సవాల్లో భక్తులందరూ పాల్గొని గణనాథుడి ఆశీస్సులు పొందాలని ఆలయ నిర్వాహకులు విజ్ఞప్తి చేశారు.

## రాజీమార్గమే రాజమార్గం



- జిల్లా జడ్జి, చైర్మన్ న్యాయ సేవా సంస్థ సంపత్

**నల్గొండ, సెప్టెంబర్ 13(సింగిడి):** రాజీ మార్గమే రాజమార్గమని జిల్లా జడ్జి, చైర్మన్ న్యాయ సేవ సమితి ఈ సంపత్ అన్నారు. శనివారం జాతీయ లోకాదాలతో రాష్ట్ర న్యాయ సేవా అధికార సంస్థ ఆదేశాలతో జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ, నల్లగొండ వారి ఆధ్వర్యం లో జిల్లా లోని అన్ని కోర్ట్ ప్రాంగణాలలో జాతీయ లోక్ అదాలత్ పాల్గొని మాట్లాడుతూ ఈ లోక్ అదాలత్ కొరకు జిల్లా వ్యాప్తంగా 14 లోక్ అదాలత్ బెంచిలను ప్రజల సౌకర్యార్థం ఏర్పాటు చేయడం జరిగింది. లోక్ అదాలత్ లో 33- సివిలు, 2813 - క్రిమినలు, 68- మోటార్ వాహన ప్రమాద భీమా కేసులు, మరియు 9281-ట్రాఫిక్ చలాన్ కాసులు, 77 - బ్యాంకు రికవరీ కేసులు మరియు 11 - సైబర్ క్రైమ్ కేసులు, మొత్తం -- 12283 (పెండింగ్ మరియు ప్రి-లిటిగేషన్) కేసులు పరిష్కరించబడినవి. ఇందులో ప్రమాద భీమా కేసులలో రూ. 7,62,44,348/- నష్టపరిహారం ఇప్పించగ, బ్యాంకు రికవరీ - 6217000/-, ట్రాఫిక్ చలాన్ -31,32,180/, మరియు సైబర్ క్రైమ్ కేసులలో రూ. 117262/- రికవరీ డబ్బులు యిప్పించడం జరిగింది అన్నారు. ఈ కార్యక్రమములో జిల్లా జడ్జి కార్యదర్శి హిమబిందు గొల్ల ఇతర న్యాయమూర్తులు, బార్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు ఎ. సతీష్ కుమార్, బి. అశోక్ కుమార్, ఇతర న్యాయవాదులు, బ్యాంకు, బి ఎస్ ఎన్ ఎల్ అండ్ ఇతర ఫైనాన్స్ ఇన్స్టిట్యూషన్స్ ఆఫీసర్స్, కక్షిదారులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

## డిజిటల్ క్రాప్ సర్వేలో పంటల వివరాలు నమోదు చేయించాలి

### సెప్టెంబర్ 30 చివరి తేదీ, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వినోద్ కుమార్



**నల్గొండ ప్రతినిధి సెప్టెంబర్ 13(సింగిడి):** వానాకాలం సీజన్‌లో జిల్లాలో రైతులు సాగు చేసిన వివిధ రకాల పంటల వివరాలను డిజిటల్ క్రాప్ సర్వే ద్వారా తప్పనిసరిగా నమోదు చేయించుకోవాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వినోద్ కుమార్ తెలిపారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలో పత్తి, వరి, కంది, ఉద్యానవన పంటలతో పాటు వర్షాభావ పరిస్థితుల కారణంగా సాగు చేసిన ప్రత్యామ్నాయ పంటలను కూడా సర్వేలో నమోదు చేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరలతో పాటు, ప్రభుత్వం సూచించిన ఏడు రకాల సన్న వడ్లను సాగు చేసిన రైతులకు క్వింటాలుకు రూ. 500 చొప్పున బోనస్ కూడా వర్తిస్తుందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ప్రతి సర్వే నంబర్‌లో సాగు చేసిన పంటల వివరాలను డిజిటల్ క్రాప్ సర్వేలో నమోదు చేయడం కీలకమని తెలిపారు. గ్రామాల్లో నియమించిన సర్వేయర్లు ప్రతి రైతు పొలానికి వెళ్లి పంటను పరిశీలించి, ఫొటో తీసి వివరాలను డిజిటల్‌గా నమోదు చేస్తున్నారు. దీనివల్ల జిల్లాలో ఏ పంటను ఎంత విస్తీర్ణంలో సాగు చేశారనే వివరాలు ఖచ్చితంగా నమోదు కావడంతో పాటు, పంటల కొనుగోలు సమయంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉంటుందని అధికారులు వివరించారు. ఈ డిజిటల్ క్రాప్ సర్వేను పంటల కొనుగోలు ప్రక్రియతో అనుసంధానం చేసినట్లు తెలిపారు. కావున గ్రామాల్లో డిజిటల్ క్రాప్ సర్వే జరుగుతున్న సమయంలో రైతులు సర్వేయర్ వెంట వెళ్లి తమ పంట చేనును చూపించాలని, లేదా సర్వేయర్‌ను స్వయంగా పంట పొలంలోకి తీసుకెళ్లి సాగు చేసిన పంట వివరాలను నమోదు చేయించాలని జిల్లా వ్యవసాయ శాఖ కోరింది. ముఖ్యంగా వరి సాగు చేసిన రైతులు తాము వేసిన వరి రకాన్ని కూడా తప్పనిసరిగా నమోదు చేయించుకోవాలని సూచించారు. డిజిటల్ క్రాప్ సర్వేలో పంటల నమోదు ప్రక్రియకు సెప్టెంబర్ 30, 2026 చివరి తేదీ అని జిల్లా వ్యవసాయ అధికారి తెలిపారు. రైతులందరూ గడువులోగా తమ పంటల వివరాలను నమోదు చేయించుకోవాలని కోరారు.


## రైతాంగ పోరాట స్ఫూర్తిని కొనసాగించాలి

### జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు



**కోదాడ, సెప్టెంబర్ 13(సింగిడి):** అనంతగిరి మండలం శాంతినగర్‌లో తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాల్లో భాగంగా ర్యాలీ నిర్వహించి అమరవీరుల స్థూపాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, భూస్వామ్య, నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా రైతులు సాగించిన పోరాటం చరిత్రలో చిరస్థాయిగా నిలిచిందన్నారు. అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ వారి ఆశయాల సాధనకు ప్రజలను చైతన్యపరచాలని పిలుపునిచ్చారు. రైతులు, కూలీలు, పేదల సమస్యలపై నిరంతరం పోరాడాలని అన్నారు. నేటి తరానికి రైతాంగ సాయుధ పోరాట చరిత్ర, అమరవీరుల త్యాగాలను వివరించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు బద్దం కృష్ణారెడ్డి, మండల కార్యదర్శి ఎర్రసాని రవి, దేగ వీరన్న, బత్తిని వీరబాబు, సర్పంచ్ వాడకొప్పుల ఉమ, ఉపసర్పంచ్ గరిడేపల్లి స్వాతి, నాగభద్రం తదితరులు పాల్గొన్నారు.

# డిటాక్స్ డ్రింక్ పవర్‌ఫుల్ !



ఆధునిక జీవనశైలిలో ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి డిటాక్స్ పానీయాలు ఎంతగానో ఉపయోగపడతాయి. అటువంటి వాటిలో దాల్చినచెక్క, తేనె డిటాక్స్ డ్రింక్ ఒకటి..దీనిని దాల్చిన చెక్క పొడి, తేనె, నిమ్మకాయ రసంతో సులభంగా తయారుచేసుకోవచ్చు. ఈ ఆరోగ్యకరమైన పానీయం శరీరంలోని విషపదార్థాలను తొలగించడంలో, రోగనిరోధక శక్తిని పెంచడంలో కీలక పాత్ర పోషిస్తుందని ఆయుర్వేద నిపుణులు చెబుతున్నారు. ఈ మిశ్రమంలో ఎన్నో పోషకాలు దాగున్నాయి.. దాల్చినచెక్క-తేనె డిటాక్స్ డ్రింక్.. యాంటీఆక్సిడెంట్లు (పాలిఫెనాల్స్), సిన్నమాల్డిహైడ్ (దాల్చినచెక్కలో), ఫినోలిక్ సమ్మేళనాల (తేనెలో) గొప్ప మూలం.. ఇది జీవక్రియను మెరుగుపరచడం, రక్తంలో చక్కెర స్థాయిలను స్థిరీకరించడం, వాపును తగ్గించడం, బరువు తగ్గడంలో సహాయపడుతుందని పేర్కొంటున్నారు.

**దాల్చిన చెక్క తేనె డిటాక్స్ డ్రింక్‌కు కావలసిన పదార్థాలు:**
దాల్చిన చెక్క పొడి, తేనె, నిమ్మకాయ, నీరు..

**తయారీ విధానం:**

సిన్నమన్ హనీ డిటాక్స్ తయారుచేయడం చాలా సులభం. ముందుగా, ఒక పాత్రలో తగినంత నీటిని తీసుకుని పొయ్యి మీద పెట్టి బాగా మరిగించాలి. నీరు మరిగిన తర్వాత, దానికి తగినంత దాల్చిన చెక్క పొడిని కలపాలి. నీటి పరిమాణం, దాల్చిన చెక్క ఘాటును బట్టి పొడిని సర్దుబాటు చేసుకోవాలి. దాల్చిన చెక్క పొడి వేసిన తర్వాత మరికొద్దిసేపు మరిగించాలి. అప్పుడే దాల్చిన చెక్కలోని పోషకాలు నీటిలో కలుస్తాయి. ఆ తర్వాత ఈ ద్రావణాన్ని ఒక గ్లాసులోకి వడకట్టుకోవాలి. చివరగా, దానికి కొద్దిగా నిమ్మకాయ రసం, ఒక స్పూన్ తేనెను కలిపి బాగా కలుపుకుంటే వేడివేడి సిన్నమన్ హనీ డిటాక్స్ సిద్ధం అవుతుంది. నిమ్మకాయ, తేనె దాల్చిన చెక్క ఘాటైన రుచిని సమతుల్యం చేస్తాయి.



### ఎప్పుడు తీసుకోవాలి?

ఈ డిటాక్స్ పానీయాన్ని ఉదయం పూట తీసుకోవడం ఉత్తమం. చాలా మంది ఉదయం టీ లేదా గ్రీన్ టీ తీసుకుంటారు. దాని స్థానంలో ఈ సిన్నమన్ హనీ డిటాక్స్ ను తీసుకోవచ్చు. డిటాక్స్ డైట్‌లో ఉన్నప్పుడు, రోజులో అనేక రకాల డిటాక్స్ టీలను ప్రతి రెండు లేదా మూడు గంటలకు ఒకసారి తీసుకోవాల్సి ఉంటుంది.. అందులో ఇది ఒక రకం. డిటాక్స్ సమయంలో పాలు కలిపిన టీలను నివారించాలి. కాబట్టి పాల బదులు నీటితో తయారుచేసిన ఈ డిటాక్స్ పానీయం అనుకూలంగా ఉంటుంది.

### ఎన్నో పోషకాలు.. మరెన్నో ఆరోగ్య ప్రయోజనాలు..


దాల్చిన చెక్క, తేనె, నిమ్మకాయల కలయిక అనేక ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తుంది. దాల్చిన చెక్కలో యాంటీ ఫంగల్, యాంటీ బ్యాక్టీరియల్, యాంటీ వైరల్ గుణాలు పుష్కలంగా ఉంటాయి. ఇవి శరీరంలో ఉండే హానికరమైన బ్యాక్టీరియా, వైరస్‌లతో పోరాడి ఆరోగ్యాన్ని కాపాడతాయి. ఈ డిటాక్స్ పానీయం శరీరంలోని టాక్సిన్స్‌ను సమర్థవంతంగా తొలగిస్తుంది.. తద్వారా జీర్ణక్రియ మెరుగుపడుతుంది. అలాగే, ఇది రోగనిరోధక శక్తిని కూడా బలోపేతం చేస్తుంది.. శరీరాన్ని వ్యాధుల నుండి రక్షించడానికి సహాయపడుతుంది.

దాల్చిన చెక్క కొద్దిగా ఘాటుగా ఉంటుంది. కాబట్టి, గ్యాస్ట్రిక్ లేదా అల్సర్ సమస్యలతో బాధపడేవారు దీనిని తీసుకునేటప్పుడు జాగ్రత్తగా ఉండాలి. అల్సర్ తీవ్రతను బట్టి, వారు దీనిని తక్కువ మోతాదులో లేదా అప్పుడప్పుడు (రెండు, మూడు రోజులకు ఒకసారి) తీసుకోవాలి. అల్సర్ తీవ్రంగా ఉన్నవారు ఈ పానీయాన్ని పూర్తిగా నివారించడం మంచిది. ఏదేమైనా.. ఏదైనా కొత్త ఆహార పదార్థాన్ని డైట్‌లో చేర్చుకునే ముందు వైద్య నిపుణుడిని సంప్రదించడం మంచిది..

---

ఆన్‌లైన్ షాపింగ్ చేసేవారికి గుడ్‌న్యూస్..

## ఇ-కామర్స్ సంస్థలకు కొత్త రూల్స్





ఇ-కామర్స్ ప్లాట్‌ఫామ్స్ కొనుగోళ్లు భారీగా పెరిగాయి. ఫ్లిప్ కార్ట్, అమెజాన్, మీషో, మింత్రా అంటూ ఎన్నో ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్స్ వచ్చాయి. అయితే, ఇ-కామర్స్ కొనుగోళ్ల సమయంలో ధరలు తారు మారు చేయడం, నకిలీ డిస్కౌంట్లు చూపించడం, మోసాలకు పాల్పడడం వంటివి సైతం పెరుగుతున్నాయి. ఈ క్రమంలో కేంద్ర ప్రభుత్వం నిబంధనలు కఠినతరం చేసింది. ఇలాంటి మోసాలకు చెక్ పెట్టేందుకు సిద్ధమైంది. కొత్త నిబంధనలను జనవరి 1, 2027 నుంచి అమలులోకి తేనుంది. మరి ఆ వివరాలు తెలుసుకుందాం. ఇ-కామర్స్ ప్లాట్‌ఫామ్స్ ద్వారా కొనుగోళ్లు చేస్తున్నప్పుడు జరుగుతున్న మోసాలకు కళ్లెం వేస్తూ మరింత భరోసా కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వ వినియోగదారుల వ్యవహారాల మంత్రిత్వ శాఖ రంగంలోకి దిగింది. యూజర్లను తప్పుదోవ పట్టించే మోసపూరిత పద్ధతులకు అడ్డుకట్ట వేయాలని నిర్ణయించింది. ఈ మేరకు కన్స్యూమర్ ప్రొటెక్షన్ (ఇ-కామర్స్) రూల్స్ 2020కి సవరణలు చేసింది. కన్స్యూమర్ ప్రొటెక్షన్ (ఇ-కామర్స్) సవరణ నిబంధనలు 2026ను గురువారం రోజున నోటిఫై చేసింది. ఈ కొత్త రూల్స్ 2027, జనవరి 1వ తేదీ నుంచి అమలులోకి రానున్నాయి. కొత్త రూల్స్ ప్రకారం.. ఏదైనా వస్తువుపై డిస్కౌంట్ ఇస్తున్నట్లు ప్రకటించినప్పుడు తగ్గించిన ధరతో పాటు, అంతకు ముందు ఉన్న ధరను సైతం స్పష్టంగా చూపించాల్సి ఉంటుంది. రాయితీ ప్రకటించేందుకు ముందు 30 రోజుల్లో ఆ వస్తువు అమ్ముడైన అత్యల్ప ధరనే ప్రయర్ ప్రైస్ గా పరిగణించాలి. ధరలు పెంచి ఆ తర్వాత రాయితీ ఇస్తున్నట్లు భ్రమ కల్పిస్తూ మోసాలు చేసే వారికి అడ్డుకట్ట వేయనుంది. యూజర్లు వెతికే కీవర్డ్‌లకు సంబంధం లేకుండా సెర్చ్ ఫలితాలను తారుమారు చేస్తూ వారిని తప్పుదోవ పట్టించే విధానాలను నిషేధించారు. ప్రకటనలతో చూపించే స్పాన్సర్డ్ లిస్టింగ్స్ ఏవో యూజర్లకు స్పష్టంగా కనిపించేలా స్పెషల్ లేబుల్స్ వేయాలని తెలిపారు. ప్రతి ఇ-కామర్స్ కంపెనీ తప్పనిసరి నేషనల్ కన్స్యూమర్ హెల్ప్ లైన్ సిస్టమ్ తో లింక్ కావాల్సి ఉంటుంది. 2025లో 17.71 లక్షల ఫిర్యాదులు రాగా దాదాపు 5.11 లక్షలు ఇ-కామర్స్ రంగంలోనే ఉండటం గమనార్హం. యూజర్లు ఫిర్యాదు చేసినప్పుడు గ్రీవెన్స్ అధికారి వద్ద నమోదైన రికార్డు కాపీని అందించాలని షరతు పెట్టారు. అలాగే యూజర్లకు తెలియకుండానే కొనేలా చేసే డార్క్ ప్యాటర్న్స్ అంతర్గత నియంత్రణ మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాల్సి ఉంటుంది. ప్రతి ఇ-కామర్స్ కంపెనీ స్వీయ ఆడిట్ నిర్వహించి రూల్స్ పాటిస్తున్నట్లు సర్టిఫికెట్ వెబ్‌సైట్లో పెట్టాలి. వస్తువులకు సంబంధించి ఎక్స్‌పైరీ లేదా బెస్ట్ బిఫోర్ తేదీలు, రిటర్నులు, రీఫండ్, వారంటీలు, డెలివరీ ఛార్జీల వంటి అన్ని వివరాలు కొనుగోలుకు ముందే స్పష్టంగా చెప్పాలి. దిగుమతి చేసుకున్న వస్తువులపై ఏ కంట్రీలో తయారైంది, దిగుమతిదారు వివరాలు ముద్రించాలి. యూజర్ అనుమతి లేకుండా వ్యక్తిగత డేటాను ఇతర అవసరాలకు ఉపయోగించకూడదు. అదే విధంగా ప్లాట్‌ఫామ్ తో సంబంధం లేని సర్వీసుల కోసం అదనపు ఫీజులు వసూలు చేయకూడదు.

## 17 నుంచి బెంగళూరు టెక్ సమ్మిట్ 2026




హైదరాబాద్, (సింగిడి): ఆసియాలోనే అతిపెద్ద టెక్నాలజీ ఈవెంట్‌గా పేరొందిన 29వ బెంగళూరు టెక్ సమ్మిట్ (బీటీఎస్ 2026) నవంబర్ 17 నుంచి 19 వరకు బెంగళూరులోని బీఐఈసీలో జరగనుంది. 'ఏఐ & బియాండ్' థీమ్‌తో నిర్వహిస్తున్న ఈ సదస్సులో 75కు పైగా దేశాల నుంచి 1,800కుపైగా ఎగ్జిబిటర్లు, 25 వేలకుపైగా ప్రతినిధులు, 1,000కుపైగా స్టార్టప్‌లు, 60 వేలకుపైగా వ్యాపార సందర్శకులు పాల్గొననున్నట్లు కర్ణాటక ప్రభుత్వం తెలిపింది. బెంగళూరు టెక్ సమ్మిట్ రోడ్‌షోలో భాగంగా హైదరాబాద్‌లో నిర్వహించిన ఇండస్ట్రీ ఇంటరాక్షన్ మీట్‌లో కియోనిక్స్ చైర్మన్, ఎమ్మెల్యే శరత్‌కుమార్ బాచేగౌడ పాల్గొన్నారు. ఏఐ, డీప్‌టెక్, సెమీకండక్టర్లు, బయోటెక్, ఫిన్‌టెక్, స్పేస్‌టెక్, ఎలక్ట్రిక్ మొబిలిటీ తదితర రంగాలపై సదస్సులో చర్చలు జరగనున్నాయి. స్టార్టప్‌లను ఇన్వెస్టర్లు, మెంటార్లు, ప్రపంచ మార్కెట్లతో అనుసంధానించేందుకు 'ఫ్యూచర్ మేకర్స్' కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు.

## బ్రిటిష్ రుచులకు హైదరాబాద్‌లో వేదిక





హైదరాబాద్, (సింగిడి): బ్రిటన్‌కు చెందిన నాణ్యమైన ఆహార, పానీయ ఉత్పత్తులను భారతీయ వినియోగదారులకు పరిచయం చేసేందుకు 'గ్రేట్ ఫుడ్ ఫ్రమ్ గ్రేట్ బ్రిటన్' రిటైల్ క్యాంపెయిన్ ప్రారంభమైంది. సెప్టెంబరు నెలంతా హైదరాబాద్‌తో పాటు ముంబయి, ఢిల్లీ, అహ్మదాబాద్, బెంగళూరులో ఈ కార్యక్రమం కొనసాగనుంది. ఫుడ్ స్క్వేర్, ఫుడ్‌హాల్ స్టోర్లలో ఉత్పత్తుల ప్రదర్శనలు, శాంప్లింగ్, వంట ప్రదర్శనలు నిర్వహించనున్నారు. చీజ్, బిస్కెట్లు, జామ్‌లు, టీ, కాఫీ, చాక్లెట్లు తదితర ఉత్పత్తులను వినియోగదారులకు పరిచయం చేయనున్నారు. యూకే--భారత్ వాణిజ్య ఒప్పందంతో బ్రిటిష్ ఆహార ఉత్పత్తులకు భారత మార్కెట్లో మరిన్ని అవకాశాలు ఏర్పడ్డాయని దక్షిణాసియా వాణిజ్య సలహాదారు మార్క్ బిరెల్ తెలిపారు.

## భారీగా పడిపోయిన బంగారం ధర

**ఒక్కరోజే రూ.10,000 తగ్గిన వెండి..**

పసిడి ప్రియులకు బిగ్ అలర్ట్. బంగారం ధరల్లో ఊహించని మార్పులు కనిపిస్తున్నాయి. అంతర్జాతీయంగా అనిశ్చిత పరిస్థితులు, క్రూడ్ ఆయిల్ ధరలు, ఫెడ్ వడ్డీ రేట్ల వంటి అంశాలతో బంగారం ధరలు తీవ్ర ఒత్తిడికి గురవుతున్నాయి. ఒక రోజు పెరిగితే మరుసటి రోజు భారీగా పడుతున్నాయి. ఈరోజు గ్లోబల్ మార్కెట్లో 80 డాలర్ల వరకు తగ్గడంతో దేశీయంగా ధరలు కుప్పకూలాయి. ఈ క్రమంలో సెప్టెంబర్ 11వ తేదీన హైదరాబాద్, విజయవాడ, విశాఖలో గోల్డ్, సిల్వర్ రేట్లు ఎలా ఉన్నాయో తెలుసుకుందాం. భారతీయులకు బంగారం అంటే చాలా ఇష్టమని ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. ఏదైనా పొదుపునా కొనుగోలు చేస్తూనే ఉంటారు. ఇక పెళ్లిళ్లు, పండగల సీజన్ అయితే బంగారం దుకాణాలు కిటకిటలాడుతుంటాయి. అయితే, గత కొద్ది రోజుల నుంచి బంగారం ధరల్లో ఊహించని మార్పులు కనిపిస్తున్నాయి. పసిడి రేట్లు ఒక రోజు తగ్గితే ఒక రోజు పెరుగుతున్నాయి. భారీగా తగ్గింది అనుకునే లోపే భారీగా పెరిగి షాకిస్తున్నాయి. పశ్చిమాసియాలో కొనసాగుతున్న ఉద్రిక్తత, క్రూడ్ ఆయిల్ ధర 100 డాలర్లకు చేరడం, ఫెడ్ వడ్డీ రేట్ల అంచనా, డాలర్ విలువ వంటివి బంగారం ధరలను తీవ్రంగా ప్రభావితం చేస్తున్నాయి. ఈరోజు గ్లోబల్ మార్కెట్లో పసిడి ధర భారీగా తగ్గింది. ఈ ప్రభావం దేశీయంగా ఉంటుందని అంచనా వేస్తున్నారు. ఈ క్రమంలో సెప్టెంబర్ 11న హైదరాబాద్, విజయవాడలో బంగారం, వెండి రేట్లు తెలుసుకుందాం. కథనం చివర్లో అప్‌డేట్ సమాచారం ఉంది.

**హైదరాబాద్‌లో బంగారం, వెండి ధరలు**

హైదరాబాద్ బులియన్ మార్కెట్లో ఈరోజు పసిడి ధరలు మారాయి. 24 క్యారెట్ల బంగారం రేటు చూసుకుంటే 10 గ్రాములపై రూ. 1200 మేర పెరిగి రూ. 1,55,510 వద్ద ట్రేడవుతోంది. అలాగే 22 క్యారెట్ల ఆభరణాల బంగారం ధర రూ. 1100 పెరగడంతో తులం రేటు రూ. 1,42,550 వద్ద ఉంది. ఇక కిలో వెండి రేటు మాత్రం గత 8 సెషన్ల నుంచి ఎలాంటి మార్పు లేకుండా రూ. 2,55,000 వద్ద స్థిరంగా కొనసాగుతూ వస్తోంది.




**విజయవాడ, విశాఖలో గోల్డ్ రేట్లు**

ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నం, విజయవాడ బులియన్ మార్కెట్లలో ఈరోజు పసిడి రేట్లు స్వల్పంగా పెరిగాయి. 24 క్యారెట్ల మేలిమి గోల్డ్ రేటు తులంపై రూ. 1200 పెరిగింది. దీంతో రూ. 1,55,510 వద్ద తులం ధర కొనసాగుతోంది. ఇక 22 క్యారెట్ల నగల బంగారం రేటు తులానికి రూ. 1100 పెరగడంతో రూ. 1,42,550 వద్ద కొనసాగుతోంది. అలాగే వెండి రేటు కిలోకు రూ. 2,55,000 వద్ద అమ్ముడవుతోంది.

**గ్లోబల్ మార్కెట్లో పసిడి రేట్లు డౌన్**

అంతర్జాతీయ మార్కెట్లో బంగారం ధరలు కుప్పకూలాయి. క్రూడ్ ఆయిల్ ధర బ్యారెల్‌కు 100 డాలర్లు దాటడం, ఫెడ్ వడ్డీ రేట్లు తగ్గించకపోవచ్చన్న అంచనాలు బంగారం ధరలను పడేలా చేస్తున్నాయి. ఈరోజు స్పాట్ గోల్డ్ రేటు ఔన్సుకు 76 డాలర్లకు పైగా పడిపోయి 4338 డాలర్ల వద్దకు దిగివచ్చింది. ఇక స్పాట్ సిల్వర్ రేటు ఏకంగా 6 శాతానికి పైగా పడి 63 డాలర్ల స్థాయికి పడిపోయింది. దేశీయ మార్కెట్లో బంగారం, వెండి ధరలు భారీగా దిగివచ్చాయి. హైదరాబాద్, విజయవాడ వంటి మార్కెట్లలో 24 క్యారెట్ల బంగారం రేటు 10 గ్రాములకు ఏకంగా రూ. 2620 మేర పడిపోయింది. దీంతో తులం రేటు రూ. 1,52,890 వద్దకు దిగివచ్చింది. అలాగే 22 క్యారెట్ల బంగారం రేటు తులానికి రూ. 2400 మేర తగ్గడంతో రూ. 1,40,150 వద్దకు పడిపోయింది. ఇక వెండి రేటు ఒక్కరోజే రూ. 10,000 తగ్గింది. దీంతో కిలో రూ. 2,45,000 వద్దకు దిగొచ్చింది.

## స్టాక్ మార్కెట్
Stock Market

### 6 నెలల్లోనే 245 శాతం లాభం

**-ఇప్పుడు 1 షేరు కొంటే 10 షేర్లొస్తాయ్..**
**-ఈనెల 18 రికార్డ్ తేదీ!**




ఫైనాన్షియల్ సర్వీసెస్ రంగానికి చెందిన స్మాల్ క్యాప్ కేటగిరి కంపెనీ క్రైఓ సాఫ్ట్ ఏఐ సొల్యూషన్స్ లిమిటెడ్ కీలక ప్రకటన చేసింది. ఈ సంస్థ బోర్డు డైరెక్టర్లు ఇటీవలే 1:10 రేషియోలో స్టాక్ స్ప్లిట్ చేయాలని నిర్ణయం చేశారు. రికార్డు డేట్ సెప్టెంబర్ 18గా ఫిక్స్ చేశారు. అలాగే 1 షేరు కొంటే 10 షేర్లుగా మారనున్నాయి. రూ. 162 స్థాయిలో ఉన్న షేరు ధర రూ. 16 స్థాయికి తగ్గనుంది. ఈ స్టాక్ స్ప్లిట్ గురించిన పూర్తి వివరాలు తెలుసుకుందాం. స్మాల్ క్యాప్ కేటగిరీలోని ఫైనాన్షియల్ సర్వీసెస్ సెక్టార్ కంపెనీ క్రైఓ సాఫ్ట్ ఏఐ సొల్యూషన్స్ లిమిటెడ్ తమ షేర్ హోల్డర్లకు కీలక ప్రకటన చేసింది. ఈ సంస్థ బోర్డు ఆఫ్ డైరెక్టర్లు ఇటీవల సమావేశమై 1:10 రేషియోలో స్టాక్ స్ప్లిట్ చేపట్టే ప్రతిపాదనకు ఆమోదం తెలుపగా తాజాగా దానికి సంబంధించిన రికార్డు డేట్ సెప్టెంబర్ 18గా నిర్ణయం చేసినట్లు తెలిపింది. అలాగే ఒక షేరు కొన్న వారికి రికార్డ్ తేదీ తర్వాత 10 షేర్లు వస్తాయి. ఈ స్టాక్ స్ప్లిట్, స్టాక్ పని తీరు గురించి తెలుసుకుందాం. ఈ మేరకు తమ ఎక్స్ఛేంజ్ ఫైలింగ్‌లో వివరాలు సమర్పించింది. మరోవైపు ఈ కంపెనీ గత ఏడాదిలో తమ షేర్ హోల్డర్లకు 107 శాతం లాభాన్ని ఇచ్చింది. గత ఆరు నెలల్లో చూస్తే 245 శాతానికి పైగా లాభం ఇచ్చి మల్టీబ్యాగర్ స్టాక్స్‌లో నిలిచింది. ఇక స్టాక్ స్ప్లిట్ తర్వాత ప్రస్తుతం రూ. 162 స్థాయిలో ఉన్న షేర్ ధర సుమారు రూ. 16.2 స్థాయికి తగ్గనుంది. కంపెనీ ఎక్స్ఛేంజ్ ఫైలింగ్ ప్రకారం ఇటీవలే క్రైఓ సాఫ్ట్ సొల్యూషన్స్ కంపెనీ బోర్డు ఆఫ్ డైరెక్టర్లు 1:10 రేషియోలో స్టాక్ స్ప్లిట్ చేపట్టాలని నిర్ణయించారు. దీని అర్థం రూ. 10 ఫేస్ వ్యాల్యూ ఉన్న 1 షేరు రూ. 1 ఫేస్ వ్యాల్యూ ఉండే విధంగా 10 షేర్లుగా విభజిస్తారు.

ప్రభాతనవ
# సింగిడి
ప్రతి రంగూ ఓ నిజం
Singidi
సోమవారం 14-9-2026

కులాంతర వివాహం కారణంగా
## దళితుల ఇల్లు కూల్చివేత
**నిందితులందరినీ అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలి: సామాజిక ప్రజా సంఘాల నేతలు**



**గద్వాల(సింగిడి):** జోగులాంబ గద్వాల మండలం రేపల్లె గ్రామంలో కులాంతర వివాహం చేసుకున్నారనే కారణంతో దళిత కుటుంబానికి చెందిన ఇంటిని కూల్చివేసిన ఘటనపై సామాజిక ప్రజా సంఘాల నేతలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం రేపల్లె గ్రామాన్ని సందర్శించిన వారు నేలమట్టమైన ఇంటిని పరిశీలించారు. దళిత యువకుడు బీసీ యువతిని ప్రేమించి వివాహం చేసుకున్న నేపథ్యంలో సుమారు 20 మంది జేసీబీ, ట్రాక్టర్, గడ్డపారలతో ఇంటిని కూల్చివేశారని వారు ఆరోపించారు. ఘటనలో పాల్గొన్న వారందరినీ వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం ఆరుగురిని మాత్రమే అరెస్టు చేశారని, మిగిలిన వారిని కూడా అరెస్టు చేయాలని కోరారు. బాధిత కుటుంబానికి రూ. 50 లక్షల నష్టపరిహారం, మూడు ఎకరాల భూమి, ఇందిరమ్మ పథకం కింద పక్కా ఇల్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఇంటి కూల్చివేతకు గ్రామ సర్పంచ్ ప్రోద్బలం ఉందన్న ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరారు. జిల్లా కలెక్టర్, ఎస్పీ వెంటనే గ్రామాన్ని సందర్శించి బాధిత కుటుంబాన్ని పరామర్శించి భరోసా కల్పించాలని అన్నారు. ఎంపీలు డీకే అరుణ, మల్లు రవి, ఎమ్మెల్యే కృష్ణమోహన్ రెడ్డి రేపల్లె గ్రామాన్ని సందర్శించాలని డిమాండ్ చేశారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం ప్రకారం కేసులు నమోదు చేసి బాధితులకు న్యాయం చేయాలని కోరారు. గ్రామంలో పౌర హక్కుల పరిరక్షణ దినం నిర్వహించి సహపంక్తి భోజనం, మానవహారం చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి. స్కైలాబ్ బాబు, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్. వెంకట్రాములు, విసీకే పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ తెలంగాణ శ్యామ్, విజ్ఞాన దర్శిని రాష్ట్ర అధ్యక్షుడు బొల్లి ఆదాం రాజ్, గొప్పుని పద్మ, ఆకేపోగు పరంజ్యోతి, గట్టు మారన్న, విజయ్ కుమార్, ఆంజనేయులు, లాజర్, గోపాలకృష్ణ, గోవింద్, ప్రసంగి, బైరాములు, దామయ్య, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## వినాయక మండపాలకు పోలీసు అనుమతి తప్పనిసరి..!
**డీజేలు, అధిక శబ్దంతో లౌడ్‌స్పీకర్లకు అనుమతి లేదు.. ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా మండపాలు ఏర్పాటు చేయాలి..**
**నాగర్ కర్నూల్ జిల్లా ఎస్పీ సంగ్రామ్‌సింగ్ జీ పాటిల్**



**నాగర్‌కర్నూల్,(సింగిడి):** వినాయక చవితి సందర్భంగా నాగర్‌కర్నూల్ జిల్లా పరిధిలో గణేష్ మండపాల్లో విగ్రహాలను ఏర్పాటు చేసే నిర్వాహకులు తప్పనిసరిగా పోలీసుశాఖకు సమాచారం అందించి అనుమతి పొందాలని జిల్లా ఎస్పీ సంగ్రామ్‌సింగ్ జీ పాటిల్ సూచించారు. ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, శాంతియుత వాతావరణంలో నిర్వహిస్తూ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా పోలీసుశాఖ సూచనలు, నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని ఆయన కోరారు.

**ఆన్‌లైన్‌లో వివరాల నమోదు**
గణేష్ మండపాల నిర్వాహకులు https://policeportal.tspolice.gov.in వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్ ద్వారా వివరాలు నమోదు చేయాలని ఎస్పీ సూచించారు. దరఖాస్తుదారుడి వివరాలతో పాటు విగ్రహం ఏర్పాటు చేసే ప్రదేశం, సంబంధిత పోలీస్‌స్టేషన్ పరిధి, విగ్రహం ఎత్తు, మండపం ఎత్తు, కమిటీ సభ్యుల పేర్లు, ఫోన్ నంబర్లు, విగ్రహ ప్రతిష్ఠాపన తేదీ, నిమజ్జనం తేదీ, సమయం, ప్రదేశం, నిమజ్జనానికి ఉపయోగించే వాహనం తదితర వివరాలను పూర్తిగా నమోదు చేయాలన్నారు. మండప నిర్వాహకులు, గణపతి కమిటీ సభ్యులు, వాలంటీర్ల పేర్లు, ఫోన్ నంబర్లు, చిరునామాలను కూడా పొందుపరచాలని తెలిపారు. ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు చేయలేని వారు సమీప పోలీస్‌స్టేషన్‌ను సంప్రదించాలని సూచించారు. పర్యావరణ పరిరక్షణకు ఉత్సవ కమిటీలు మట్టి వినాయక విగ్రహాల ప్రతిష్ఠాపనకు ప్రాధాన్యం ఇవ్వాలని ఎస్పీ కోరారు. గణేష్ మండపాలను ప్రజలకు, వాహనాల రాకపోకలకు ఎలాంటి ట్రాఫిక్ ఇబ్బంది కలగకుండా ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. మండపం ఏర్పాటు చేసే స్థలానికి సంబంధిత శాఖల నుంచి తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలన్నారు.

**విద్యుత్ భద్రతపై జాగ్రత్తలు**
గణేష్ మండపాలకు విద్యుత్ శాఖ అనుమతితోనే విద్యుత్ కనెక్షన్ తీసుకోవాలని, షార్ట్‌సర్క్యూట్ ప్రమాదాలు జరగకుండా నాణ్యమైన వైరును వినియోగించాలని సూచించారు. షెడ్ నిర్మాణంలోనూ మంచి నాణ్యత కలిగిన సామగ్రిని ఉపయోగించాలని తెలిపారు. మండపాల వద్ద కమిటీ వివరాలు, బాధ్యత వహించే వ్యక్తుల పేర్లు, ఫోన్ నంబర్లతో కూడిన ఫ్లెక్సీలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. మండపాల్లో 24 గంటలూ ఇద్దరు వాలంటీర్లు ఉండేలా నిర్వాహకులు చర్యలు తీసుకోవాలని సూచించారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని క్యూలైన్లు ఏర్పాటు చేయడంతో పాటు తగినంత మంది వాలంటీర్లను నియమించుకోవాలని తెలిపారు. ప్రతి మండపం వద్ద తప్పనిసరిగా పాయింట్ పుస్తకం ఏర్పాటు చేసుకోవాలని, పోలీసు అధికారులు తనిఖీకి వచ్చినప్పుడు అందులో వివరాలు నమోదు చేసి సంతకం చేస్తారని ఎస్పీ పేర్కొన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ పెద్ద శబ్దాలతో కూడిన లౌడ్‌స్పీకర్లు, డీజేలకు అనుమతి లేదని ఎస్పీ స్పష్టం చేశారు. అత్యవసర పరిస్థితుల్లో పోలీసు యంత్రాంగం 24 గంటలూ అందుబాటులో, అప్రమత్తంగా ఉంటుందని తెలిపారు. ప్రజలు వెంటనే డయల్ 100 లేదా 112కు సమాచారం అందించాలని సూచించారు.

రేపల్లె బాధిత కుటుంబానికి
## మాదిగ సంఘాల అండ
**కుల వివక్ష, దాడులను సహించేది లేదు: మాజీ ఆర్మీ జవాన్ ఆకేపోగు మైరాముడు**



**గద్వాల(సింగిడి):** జోగులాంబ గద్వాల జిల్లా గద్వాల మండలం రేపల్లె గ్రామంలో మాదిగ కుటుంబానికి చెందిన ఇంటిని కూల్చివేసిన ఘటనపై మాజీ ఆర్మీ జవాన్ ఆకే పోగు మైరాముడు స్పందించారు. ఆదివారం రేపల్లె గ్రామాన్ని సందర్శించి కూల్చివేసిన ఇంటిని పరిశీలించారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడి వారికి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కులం పేరుతో ఏ వర్గం పైనైనా వివక్ష, దాడులు, దౌర్జన్యాలకు పాల్పడటం చట్టవిరుద్ధమని అన్నారు. రేపల్లె గ్రామంలోని మాదిగ కుటుంబాలకు తాము అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం, అధికారులు తక్షణమే న్యాయం చేయాలని, ఇంటిని కోల్పోయిన కుటుంబానికి పరిహారంతో పాటు పునరావాసం కల్పించాలని కోరారు. ఇటిక్యాల మండలంలోని ఇటిక్యాల, ఉదండాపురం గ్రామాలకు చెందిన మాదిగ సంఘాల ప్రతినిధులు కూడా రేపల్లె గ్రామాన్ని సందర్శించి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. రేపల్లెలో మాదిగలపై భవిష్యత్తులో ఎలాంటి దాడులు, కుల వివక్ష, వేధింపులు జరిగినా చట్టపరంగా ఎదుర్కొంటామని వారు స్పష్టం చేశారు. ఘటనకు బాధ్యులైన వారిపై సమగ్ర విచారణ జరిపి చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గ్రామంలో అన్ని కులాల ప్రజలు శాంతియుతంగా, సోదరభావంతో జీవించేలా అధికారులు చర్యలు చేపట్టాలని కోరారు. బాధిత కుటుంబానికి భద్రత కల్పించడంతో పాటు ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా పోలీసులు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని మాదిగ సంఘాల నాయకులు విజ్ఞప్తి చేశారు.

### ఘనంగా ఆర్ కృష్ణయ్య జన్మదిన వేడుకలు



**నిజామాబాద్(సింగిడి):** జిల్లా కేంద్రంలోని గీతా భవన్ నందు ఆదివారం జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఆర్ కృష్ణయ్య జన్మదిన సందర్భంగా పుట్టినరోజు వేడుకలు నిర్వహించారు. బీసీ నాయకులు అంద రూ జై బీసీ అని నినాదాలు చేసి, బీసీల ఐక్యతను ముందుకు తీసుకుపోదామని అన్నారు. అంతే కాకుండా జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఆర్ కృష్ణయ్య తో పాటుగా జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు కెంపుల నాగ రాజు పుట్టినరోజు అయినందున ఇద్దరు పుట్టినరోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీసీల ఐక్యతను కాపాడుతూ.. మరింత ముందుకు తీసుకువెళ్లే దిశగా కృషి చేస్తామని నాయకులు అన్నారు. ఈ కార్యక్రమములే రాష్ట్ర, జిల్లా నాయకులు పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణకు మట్టి వినాయకుడే ముద్దు
**కొత్తగూడెంలో ఆర్యవైశ్య మహాసభ ఆధ్వర్యంలో ఉచిత మట్టి విగ్రహాల పంపిణీ**





**కొత్తగూడెం, (సింగిడి):** వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని కొత్తగూడెం పట్టణ ఆర్యవైశ్య మహాసభ ఆధ్వర్యంలో ఉచిత మట్టి వినాయక ప్రతిమల పంపిణీ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించా రు. ఈ సందర్భంగా మహాసభ ప్రతినిధులు, ఆర్యవైశ్యు లు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించిన అనం తరం భక్తులకు మట్టి వినాయక ప్రతిమలను ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా 51వ డివిజన్ కార్పొరేటర్ కంభంపాటి దుర్గాప్రసాద్ హాజర య్యారు. పట్టణ ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు కొదు మూరి సురేష్‌బాబు ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహిం చారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా మట్టి వినా యక ప్రతిమలను ప్రోత్సహించడం, ప్రజల్లో పర్యావరణ హితమైన వినాయక చవితి నిర్వహణపై అవగాహన కల్పించడం కార్యక్రమం ప్రధాన ఉద్దేశంగా నిర్వాహ కులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి రేపాక మనోహర్, కోశాధికారి కూరా ప్రసాద్, గౌరవ అధ్యక్షులు దారా నాగేష్, పల్లపోతు శ్రీనివాస్ (వాసు), పల్లపోతు శ్రీనివాస్ (చిన్న వాసు), కంభంపాటి రమేష్, వల్లాల రమణ, శీమకుర్తి నాగరాజా తరుణ్, దారా కిరణ్, నరేంద్రుల రిషి, చెల్లా శేఖర్, చారుగుల్ల సుధాకర్, దొంతుల అరుణ్‌కుమార్, ఉప్పల శ్రీనివాస్, వంగవీటి శ్రీకాంత్, గరిని చిన్న, కొదుమూరి సత్యనారాయణ, వందనపు రవికిషోర్, కొయ్యడ నాగేష్, గునీపాటి సుధాకర్, వారణాశి సురేష్, వెమిశెట్టి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## దేశ భవిష్యత్తులో - దేశ సమాజంలో గురువులే కీలకం...





**ఆర్మూర్,(సింగిడి):** దేశ భవిష్యత్తులో, దేశ సమాజంలో గురువులు అత్యంత కీలకమని మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి కొని యాడారు. నిజామాబాద్ జిల్లా బాల్కొండ నియోజకవర్గం మండల కేంద్రమైన మోర్తాడ్ గ్రామంలో గల ఆర్. ఎన్. బి. ఫంక్షన్ హాల్ లో బి.స్మార్ట్, బడ్జెట్ స్కూల్ మేనేజ్మెంట్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ ఆధ్వర్యంలో నిర్వహించిన గురు పూజోత్సవ కార్యక్రమానికి బాల్కొం డ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రసంగించారు. ఉపాధ్యాయులు పాఠాలు చెప్పే వ్యక్తు లు కాదని, విద్యార్థుల భవిష్యత్తులో తీర్చిదిద్దే శిల్పులని ఆయన కొనియాడారు. మాతృదేవోభవ, పితృదేవోభవ, ఆచార్య దేవోభవ అని మన సమాజం భావిస్తుందని అన్నారు. విద్యార్థులు పాఠశాలల్లో చేరినప్పుడు ప్రపం చం గురించి ఎలాంటి అవగాహన ఉండాలని, అలాంటి ప్రతి విద్యార్థులకు తల్లిదండ్రుల తర్వాత, ప్రపంచం గురించి క్రమశిక్షణ, జ్ఞానం బోధన, మంచి నడవడిక నేర్పించి, విద్యార్థుల భవిష్యత్తును దేశస్థాయిలో కొనసా గేలా తీర్చిదిద్దేది గురువులేనని ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డి పేర్కొన్నారు. గురువుల వల్లే సమాజంలో శాస్త్రవే త్తలు, ఇంజనీర్లు, వైద్యులుగా, రాజకీయ రంగా లలో పిఎంలు, సీఎంలు, ఎమ్మెల్యేలు, రాజకీయ ప్రజాప్రతి నిధులుగా ఎదిగేలా కృషి చేసేది ఉపాధ్యాయులు అని అది గుర్తు చేసుకోవాలన్నారు. బడ్జెట్ స్కూల్ నిర్వాహ కులు వ్యాపారంగా కాకుండా, తమ బ్రతుకుతెరువు కోసం, విద్యార్థులను ఉన్నత స్థాయిలో తీర్చిదిద్దుతూ, ఉపాధ్యాయులకు ఉపాధి కల్పిస్తూ సమాజ సేవ చేసే వ్యవస్థగా ముందుకు సాగుతుందని ప్రశంసించారు. ఇద్దరు ఉపాధ్యాయులను బెస్ట్ టీచర్ గా ఎంపిక చేసి సన్మానించి అవార్డులను అందించి సత్కరించడం అభినందనీయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో బి స్మార్ట్ రాష్ట్ర అధ్యక్షులు శ్రీపతి శేఖర్ రెడ్డి, ఫౌండర్ షఫీ, జిల్లా నంబుల గిరి, కార్యదర్శి రవీందర్, కోశాధికారి హరీష్, ఆయా పాఠశాలల మేనేజ్మెంట్ నిర్వాహకులు, ఉపాధ్యాయుల బృందం సభ్యులు, విద్యార్థిని, విద్యార్థులు, తదితరులు, పాల్గొన్నారు.

లక్ష్మీ బాయి విఠల్ గుప్తా చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో మట్టి వినాయకుల పంపిణీ



**నిజామాబాద్(సింగిడి):** మట్టి వినాయకుడిని పూజించి పర్యావరణాన్ని కాపాడాలని ధన్ పాల్ లక్ష్మీ బాయి విఠల్ గుప్తా చారిటబుల్ ట్రస్టు సభ్యులు ప్రణయ్ కుమార్ తెలిపారు. నగరంలోని జవహర్ రోడ్డులో గల కిసాన్ షాపింగ్ మాల్ వద్ద ఉచితంగా మట్టి వినాయకుల ప్రతిమలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ హిందూ సంప్రదాయంలో వినాయకుడికి ప్రత్యేక స్థానం ఉందన్నారు. విఘ్నాలను తొలగించే భగవంతుడు వినాయకుడు అని తెలిపారు. తమ ట్రస్టు ద్వారా ప్రతి సంవత్సరం మట్టి వినా యకులను పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. ఇప్పటికే నగరంలోని అన్ని మండపాలకు చెందా రూపంలో సహకారం చేశామని చెప్పారు. పురాణాల ప్రకారం మట్టి వినాయకులను పూజించాలన్నారు. అలాగే స్వాతంత్రోద్యమంలో ఐక్యత కోసం బాలగంగాధర్ తిలక్ వినాయకుల ఉత్సవాలను ప్రారంభించా రని గుర్తు చేశారు. కార్యక్రమంలో 19వ డివిజన్ కార్పొరేటర్ నాగోల్ల లక్ష్మీనారాయణ, జ్యోతి మురళి, నాయకులు మరవార్ కృష్ణ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బెంచ్ ప్రెస్, డెడ్‌లిఫ్ట్ జిమ్‌లతో ప్రతిఒక్కరు
## ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దుతాయి...



**ఆర్మూర్,(సింగిడి):** జిల్లా కేంద్రంలో డిఎస్ ఆర్నాల్డ్ జిమ్ నిర్వాహకులు ఏర్పాటు చేసిన బెంచ్ ప్రెస్, డెడ్ లిఫ్ట్, పవర్ లిఫ్ట్, జిమ్ లను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకుంటే ఆరోగ్యకరంగా ఉంటారని బిసి సాధికారత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుస్సాపూర్ శంకర్, కార్పొరేటర్ కల్పే చిరంజీవి, నవీన్ మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి వైద్యులునవీన్, విద్యుత్ శాఖ అధికారి బాబా శ్రీనివాస్, వాకర్ అసోసియేషన్ అధ్యక్షులు పృథ్వీరాజ్, గణేష్‌టెంపుల్ చైర్మన్ భూషణ్ చారి, మురళీకృష్ణ, బీసీ సాధికార సంఘం జిల్లా ఉపాధ్యక్షులు పసుల లక్ష్మణ్, మోహన్ గైక్వాడ్ లు అన్నారు. బెంచ్ ప్రెస్, డెడ్ లిఫ్ట్, పవర్ లిఫ్టింగ్, డి ఎస్ ఆర్నాల్డ్ జిమ్ నిర్వాహకులు ఏర్పాటు చేసిన పలు క్రీడా పోటీలకు ముఖ్య అతిథిగా విచ్చేసి యువతను, క్రీడాకారులను ఉద్దేశించి మాట్లాడారు. ఈ క్రీడలలో విజేతలకు 4,999 ప్రథమ కనబరిచిన క్రీడాకారులకు బహుమతి ప్రధానం గావించారు. ప్రతిభ కనబరిచిన పలువురు క్రీడాకారులను ముఖ్యఅతిథిగా విచ్చేసిన వారు అభినందించారు. బెంచ్ ప్రెస్, డెడ్ లిఫ్ట్, పవర్ లిఫ్ట్ క్రీడలను ఉపయోగించుకుంటే శక్తి సామర్థ్యాలతో పాటు, దేహ దారుఢ్యం పెంపొందుతుందని వారు అన్నారు. ఈ క్రీడా పోటీలను నిర్వహించిన ఆర్నాల్డ్ జిమ్ నిర్వాహకులు డీలోడ్ శేఖర్ ను ముఖ్య అతిథిగా విచ్చేసిన పలువురు అభినందించారు.

అభివృద్ధికి నిధులు మంజూరుకు
## సీఎంకు ఎమ్మెల్యే వినపత్రం అందజేత
నాయకుల చిత్రపటాలకు పాలాభిషేకాలు..



**ఆర్మూర్,(సింగిడి):** నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ పట్టణ మున్సిపల్ అభివృద్ధికి వంద కోట్లు కేటాయించాలని, మున్సిపల్ నూతన భవన నిర్మాణానికి ఏడు కోట్ల 50 లక్షల రూపాయలు నిధులు కేటాయిం చాలని, ఆర్మూర్ నియోజకవర్గంలో పేరుకుపో యిన పెండింగ్ పనులకు సైతం నిధులు విడుదల చేయాలంటూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ప్రత్యే కంగా ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి వినపత్రం అందజేశారు. దీంతో సానుకూలంగా స్పందించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆర్మూర్ మున్సిపల్ నూతన భవన నిర్మాణానికి 7.50 కోట్ల నిధులు మంజూరు చేయడం జరిగింది. కాకుండా పనులకు సైతం అనుమ తులు అందించారు. దీంతో ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి నిధులు మం జూరు చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజే శారు. ఆర్మూర్ మున్సిపల్ నూతన భవన నిర్మాణానికి ముఖ్యమంత్రి చే నిధులు మంజూరుకు ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి కృషి చేయడం పట్ల బిజెపి పట్టణ శాఖ ఆధ్వర్యంలో ఆర్మూర్ బిజెపి నాయకులు ఎమ్మెల్యే రాకేష్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. మరోపక్క ఆర్మూర్ మున్సిపల్ నూతన భవన నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేయడం పట్ల మండల కాంగ్రెస్ నాయకులు సీఎం రేవంత్ రెడ్డి, పిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, ప్రభుత్వ సలహాదారులు పి. సుదర్శన్ రెడ్డి, ఇన్చార్జి మంత్రి సీతక్క, ఆర్మూర్ ఇన్చార్జ్ నాయకులు వినయ్ కుమార్ రెడ్డి చిత్రపటాలకు కాంగ్రెస్ నాయకులు, తాజా మాజీ ప్రజా ప్రతినిధులు, పాలాభిషేకం నిర్వహించారు.



## లక్ష సభ్యత్వ లక్ష్యాన్ని చేరుకుందాం..
**వాసవి క్లబ్ జాతీయ కార్యదర్శి జూలూరు రమేష్ బాబు**





**కల్వకుర్తి (సింగిడి):** సామాజిక సేవలను మరింత విస్తృతం చేసేందుకు నూతన క్లబ్బుల ఏర్పాటు అవసరం సమిష్టి కృషితో లక్ష సభ్యత్వాన్ని సాధిద్దాం వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో ప్రపంచ వ్యా ప్తంగా అనేక సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహి స్తూ, ఆపదలో ఉన్న ఎంతోమందికి చేయూతనందిస్తూ ముందుకు సాగుతున్నామని వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ సెక్రటరీ సర్వీసెస్ జూలూరు రమేష్ బాబు అన్నారు. వాసవి క్లబ్ డిస్టిక్ వి-103 ఏ రెండో క్యాబినెట్ సమా వేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అంతర్జాతీయ అధ్యక్షుడు సిద్ధ సూర్య ప్రకాశరావు నిర్దేశించుకున్న లక్ష్యాలను సాధించేందుకు ప్రతి ఒక్క వాసవి క్లబ్ సభ్యుడు భాగస్వామి కావాలని పిలుపుని చ్చారు. ప్రపంచవ్యాప్తంగా లక్ష మంది వాసవి క్లబ్ సభ్య త్వాలను సాధించాలన్నది అంతర్జాతీయ అధ్యక్షుడి ఆకాంక్ష అని, ఆ లక్ష్యాన్ని సమిష్టి కృషితో సాధించి ఆయ నకు జన్మదిన కానుకగా అందించాలని రమేష్ బాబు కోరారు. సెప్టెంబర్ 11న అంతర్జాతీయ అధ్యక్షుడు సిద్ధ సూర్య ప్రకాశరావు జన్మదినోత్సవం సందర్భంగా, సెప్టెంబర్ 10వ తేదీలోపు లక్ష సభ్యత్వాల లక్ష్యాన్ని పూర్తి చేసేందుకు వాసవి క్లబ్ కుటుంబ సభ్యులంతా తమ వంతు కృషి చేయాలని సూచించారు. సామాజిక సేవా కార్యక్రమాలను భవిష్యత్తులో మరింత పెద్ద ఎత్తున చేపట్టాలంటే సభ్యత్వాలను పెంచడంతో పాటు నూతన వాసవి క్లబ్బులను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంద న్నారు. ఇందులో భాగంగా వి-103 ఏ డిస్టిక్ పరిధిలో ఐదు నూతన క్లబ్బులను ఏర్పాటు చేయాలని సమావేశం నిర్ణయించింది. కార్యక్రమానికి వాసవి క్లబ్ ఇంటర్నేష నల్ మాజీ అధ్యక్షుడు పాత సుదర్శన్ ప్రత్యేక అతిథిగా హాజరయ్యారు. డిస్టిక్ గవర్నర్ వారాల శ్రీనివాస్, ఇరుకుల వీరేశం, గుడిపల్లి రమేష్, ఉప్పల హరేందర్, విశ్వనాథ శ్రీనివాస్, ఆలిమిల్ల మనోజ్ కుమార్, నాగరాజు, గట్టు రాణితో పాటు జిల్లా పరిధిలోని పీఎస్‌టీలు, వాసవి క్లబ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

బోధన్ లో లయన్స్ క్లబ్స్ ఆధ్వర్యంలో
## 5వేల మట్టి వినాయక ప్రతిమల పంపిణీ



**బోధన్ ప్రతినిధి, (సింగిడి):** బోధన్ పట్టణంలోని అంకు టవర్స్ వద్ద లయన్స్ క్లబ్ ఆఫ్ బోధన్, లయన్స్ క్లబ్ ఆఫ్ ఆచన్ పల్లి ఆధ్వర్యంలో ఉచితంగా మట్టి వినాయక ప్రతిమల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన బోధన్ ఆర్డీవో విజయ కుమారి, ఏసీపీ శ్రీనివాస్, పట్టణ సీఐ వెంకటనారాయణ, తహసిల్దార్ విఠల్, లయన్స్ ఫాస్ట్ డిస్ట్రిక్ గవర్నర్లు బసవేశ్వర రావు, వేమూరి లక్ష్మి చేతులమీదుగా ప్రజలకు పంపిణీ చేశారు. లయన్స్ క్లబ్స్ తరపున పట్టణంలో సుమారు 5వేలమట్టి వినాయక ప్రతిమలను ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆర్డీవో విజయ కుమారి మాట్లాడుతూ పర్యావరణహితమైన మట్టి గణపతి ప్రతిమలను ప్రతిష్టించి పూజించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. గత 12 సంవత్సరాలుగా మట్టి వినాయక ప్రతిమలను పంపిణీ చేస్తూ పర్యావరణ హితానికి లయన్స్ క్లబ్స్ చేస్తున్న కృషిని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో పిసిసి డెలిగేట్ గంగాశంకర్, పట్టణ అధ్యక్షులు అంకు దామోదర్, పట్టణ ట్రాన్స్కో ఏఈ నాయిని కృష్ణ, లయన్స్ క్లబ్ ఆఫ్ బోధన్ అధ్యక్షులు నాగేశ్వరరావు, ఆచన్ పల్లి క్లబ్ అధ్యక్షులు దుర్గారావు, వివిధ క్లబ్స్ ప్రతినిధులు రమణారెడ్డి, గాంధీ, వై. శ్రీనివాసరావు, శ్రీనివాసరాజు, ఇల్తేపు శంకర్, అనంతలక్ష్మి, జమీల్ సైబర్, హరిబాబు, తదితరులు పాల్గొన్నారు.

## వాట్సాప్‌లో మర్డర్ స్కెచ్.. అర్ధరాత్రి హత్య..
**అక్రమ సంబంధానికి అడ్డుగా ఉన్నాడని భర్తను కడతేర్చిన భార్య..**
**వరుసకు మరిది అయిన వ్యక్తితో కలిసి పన్నాగం..రెండు రోజుల్లోనే హత్య మిస్టరీని ఛేదించిన నాగర్‌కర్నూల్ పోలీసులు**




**నాగర్‌కర్నూల్, (సింగిడి):** జీవితాంతం తోడుగా ఉంటానని పెళ్లి చేసుకున్న భర్తనే అక్రమ సంబంధానికి అడ్డుగా ఉన్నాడని భావించి హతమార్చింది. తనకు వరుసకు మరిది అయిన వ్యక్తితో కలిసి భర్తను హత్య చేయించిందని పోలీసులు తెలిపారు. నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో సెప్టెంబర్ 10న జరిగిన హత్య కేసు మిస్టరీని పోలీసులు రెండు రోజుల్లోనే ఛేదించారు. నాగర్‌కర్నూల్ డీఎస్పీ బుర్రి శ్రీనివాస్‌యాదవ్, సీఐ అశోక్‌రెడ్డి, ఎస్ఐ వెంకట్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం. మృతుడి తమ్ముడు గగ్గలపల్లి గ్రామానికి చెందిన ఎండి హుస్సేన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు విచారణ చేపట్టారు. ఈ క్రమంలో మృతుడి భార్య సలీమా బేగం కు నాగపూర్‌కు చెందిన ఆమె వరుసకు మరిది అయిన ఎండి గౌస్ పాషా 29సం. వ్యక్తితో గత రెండేళ్లుగా అక్రమ సంబంధం ఉన్నట్లు గుర్తించారు. వారిద్దరూ బైక్‌పై తిరుగుతున్న విషయాన్ని గమనించిన మృతుడు ఎండి కరీం 43 సం. భార్యను మందలించడంతో భార్యాభర్తల మధ్య తరచూ గొడవలు జరిగేవి. కుటుంబ సభ్యులు, పెద్దమనుషులు పలుమార్లు సర్దిచెప్పినా వారి ప్రవర్తనలో మార్పు రాలేదని పోలీసులు తెలిపారు. సుమారు రెండు నెలల క్రితం పెద్దమనుషుల సమక్షంలో పంచాయితీ పెట్టి మృతుడు నిందితుడు గౌస్ పాషాను మందలించడంతో అతడు ఆగ్రహానికి గురయ్యాడు. ఎప్పటికైనా నిన్ను చంపేస్తానంటూ అప్పట్లో శపథం చేసినట్లు పోలీసులు వెల్లడించారు.

**వాట్సాప్‌లోనే మర్డర్ స్కెచ్!**
అప్పటి నుంచి మృతుడిని ఎలాగైనా హతమార్చాలని నిందితుడు సమయం కోసం ఎదురుచూస్తున్నాడు. మృతుని భార్య, నిందితుడు ఎవరికీ అనుమానం రాకుండా తరచూ వాట్సాప్‌లో మాట్లాడుకునేవారని పోలీసులు తెలిపారు. సెప్టెంబర్ 7న మృతుడి భార్య నెల్లూరు దర్గా వద్దకు వెళ్తున్న విషయాన్ని వాట్సాప్ కాల్ ద్వారా నిందితుడికి తెలియజేసింది. మృతుడి ఆస్తి భార్య పేరుపైనే ఉండటంతో.. భర్తను అడ్డు తొలగిస్తే ఆస్తిని అనుభవించడంతో పాటు హంతకుడితో అక్రమ సంబంధాన్ని కొనసాగించవచ్చని ఇద్దరూ భావించినట్లు పోలీసులు తెలిపారు.

**అర్ధరాత్రి ఇంటికి వచ్చి..**
సెప్టెంబర్ 9 రాత్రి సుమారు 7.30 గంటలకు మృతుడిని ఆ రాత్రే హత్య చేస్తానని నిందితుడు వాట్సాప్ కాల్ ద్వారా మృతుడి భార్యకు తెలిపినట్లు పోలీసులు వెల్లడిం చారు. అనంతరం రాత్రి సుమారు 2.30 గంటలకు ముందుగానే తెచ్చిపెట్టుకున్న కత్తి, గ్లౌజులు, ఒక జత దుస్తులతో నాగర్‌కర్నూల్‌కు చేరుకున్నాడు. మృతుడి ఇంటికి వెళ్లి డోర్‌బెల్ కొట్టాడు. మృతుడు నిద్రలో ఉండగా తలుపు తీయడంతో కత్తితో విచక్షణారహితంగా దాడి చేసి గొంతు కోసి హత్య చేసిన అనంతరం అక్కడి నుంచి పరారైనట్లు పోలీసులు తెలిపారు.

**మృతుని భార్య సలీమా బేగంను అదుపులోకి తీసుకుని విచారణ**
హత్యపై అనుమానం రావడంతో మృతుడి భార్యను అదుపులోకి తీసుకుని పోలీసులు విచారించగా అసలు విషయం వెలుగులోకి వచ్చింది. ఆమె ఇచ్చిన సమాచారం ఆధారంగా నిందితుని అదుపులోకి తీసుకుని విచారించగా.. తానే మృతుడిని హత్య చేసినట్లు అంగీకరించి నేరాన్ని ఒప్పుకున్నాడని డీఎస్పీ తెలిపారు. మృతుడికి ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నట్లు పోలీసులు తెలిపారు. నిందితులిద్దరినీ అరెస్టు చేసి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు వెల్లడించారు.

**పోలీసులకు డీఎస్పీ అభినందనలు**
హత్య కేసును చాకచక్యంగా దర్యాప్తు చేసి కేవలం రెండు రోజుల్లోనే మిస్టరీని ఛేదించిన నాగర్‌కర్నూల్ సీఐ, ఎస్ఐతో పాటు ఐడీ పార్టీ సిబ్బంది వెంకటేష్, భీముడు, రమేష్‌లను డీఎస్పీ శ్రీనివాస్‌యాదవ్ అభినందించారు.

ప్రభాతనవ
సింగిడి
తెలుగు దినపత్రిక
ప్రతి రంగూ ఓ నిజం
Singidi
సోమవారం
14-9-2026

# రాజ్యాధికారం కోసం మాదిగలు ఏకం కావాలి

## హక్కుల సాధనకై ఉద్యమించాలి: మాజీ మంత్రి మోత్కుపల్లి నరసింహులు
## ఘనంగా మాదిగ మహాశక్తి ఆత్మీయ సమ్మేళనం

**జమ్మికుంట,(సింగిడి):** రాజ్యాధికారం దక్కాలంటే మాదిగలు, బీసీలు కులాలు ఏకం కావాలని మాదిగ మహాశక్తి వ్యవ స్థాపక అధ్యక్షుడు మోత్కుపల్లి నర్సింహులు అన్నారు. కరీంనగర్ జిల్లా జమ్మికుంట పట్టణం లోని ఎంపీఆర్ - గార్డెన్ లో మాదిగల బీసీల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ముఖ్య అతిథిగా మాదిగ మహాశక్తి వ్యవస్థాపక అధ్యక్షుడు మోత్కుపల్లి నర్సింహులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన



మాట్లాడుతూ రాజ్యా ధికారం దక్కాలంటే మాదిగలు, బీసీ కులాలు ఏకంకావాలన్నారు. స్వతంత్రం వచ్చినప్పటి నుండి రెడ్డి కులస్తులు ముఖ్యమంత్రులు అవుతు న్నారని,వారు తిన్న తర్వాత వాళ్ళ కులానికి పంచుకోని మనకు సంక్షేమ పథకాలు ఇస్తున్నా రని అని అన్నారు. 119అసెంబ్లీ సీట్లలో 43సీట్లు ఒక్క రెడ్డి కులస్తులే తీసుకున్నారని, మన జాతుల్లో ఐకమత్యం లేకనే ఇలాంటివి జరుగుతున్నాయని వెల్లడించారు. ఎమ్మెల్సీ పదవిలో ఉండి తాతా మధు స్పీకర్ పై వాఖ్యలు చేయడాన్ని ఖండించారు .వేరే కులపు వాళ్లను అలా తిట్టలేదు, దళితుడు కాబట్టే తిట్టాడని ధ్వజమెత్తారు. 22ఏ జీవో కింద రాష్ట్రంలోని అన్ని భూములను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లాక్కున్నాడని అన్నారు. లబ్ధిదారులకు రెండవ విడత దళితబంధు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఆర్థికంగా రాజకీయంగా మాదిగలకు, బీసీలకు, రావలసిన హక్కులను పదవులను దక్కించుకోవాలని అన్నారు. దళి తుల అభ్యున్నతి కోసం కాంగ్రెస్ పార్టీ కృషి చేస్తుందని రానున్న రోజుల్లో అతి త్వరలో దళిత బంధు నిధుల విడుదలలో ప్రజా పాలన



కాంగ్రెస్ ప్రభుత్వం ప్రభుత్వం కృషి చేస్తుందని నియోజకవర్గ ఇన్చార్జి ప్రణవ్ బాబు అన్నారు. ఈ కార్యక్రమంలో హుజురాబాద్ మునిసిపల్ చైర్మన్ రొంటాల సుహాసిని జమ్మికుంట కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు సుంకరి రమేష్ మండలాధ్యక్షుడు పరశురామారావు నాయ కులు సాయిని రవి తోపాటు జమ్మికుంట హుజరాబాద్ మున్సిపల్ కౌన్సిలర్లు ఎంఎంఎస్ నాయకులు గుండెడప్పు కనకయ్య, ప్రొఫెసర్ మురళీ దర్శన్ , రాష్ట్ర నాయకులు విజయ్ కుమార్ , రాష్ట్ర నాయకులు ఆసంపల్లి శ్రీనివాస్ వీరస్వామి , పలువురు నాయకులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ ప్రక్రియను పకడ్బందీగా పూర్తి చేయాలి

### అర్హుడి పేరు గల్లంతు కాకుండా చూడాలి: కలెక్టర్ చిత్రా మిశ్రా

**కరీంనగర్,(సింగిడి):** ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్-2026) ప్రక్రి యను ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం పకడ్బందీగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా అధికారులను ఆదేశించారు. ఓటర్ల జాబితాలో ఒక్క అనర్హుడికి చోటు లేకుం డా, ఒక్క అర్హుడి పేరు గల్లంతు కాకుండా నిష్పక్షపాతంగా పనిచేయాలని సూచించారు. ఓటర్ల వివరాల పరిశీలనలో గుర్తించిన వ్యత్యా సాలు, అనుసంధానం కాని ఓట్లు, ఇతర మార్పు లకు సంబంధించి సంబంధిత ఓటర్లకు వెంటనే నోటీసులు జారీ చేయాలని బూత్ స్థాయి అధికారులను ఆదేశించారు. నోటీసుల అనం తరం క్షేత్రస్థాయి విచారణలను పారదర్శకంగా నిర్వహించి, నివేదికలను నిర్ణీత గడువులోగా సమర్పించాలని సూచించారు. జిల్లాలో సుమారు 2.70లక్షల మంది ఓటర్లకు నోటీసులు అందించాల్సి ఉండగా, ఇప్పటివరకు 2,24, 263 మందికి నోటీసులు అందించామని, దాదాపు లక్ష మంది వాటికి సమాధానాలు ఇచ్చారని



కలెక్టర్ తెలిపారు. నోటీసులు అందుకున్న ఓటర్లు తమ ఓటు హక్కును నిర్ధారించుకునేందుకు ఎన్నికల సంఘం సూచించిన గుర్తింపు పత్రాలను అధికారులకు సమర్పించాలని కోరారు.

**దరఖాస్తులు పెండింగ్‌లో ఉంచొద్దు...**
కొత్త ఓటరు నమోదుకు ఫారం 6, పేరు తొలగింపు లేదా అభ్యంతరాలకు ఫారం 7, పేరు, చిరునామా తదితర వివరాల మార్పులకు ఫారం 8 ద్వారా వచ్చిన దరఖాస్తులను ఎలాంటి జాప్యం లేకుండా పరిష్కరించాలని తహశీల్దార్లను ఆదేశించారు. ప్రత్యేక ప్రచార దినాల్లో స్వీకరించిన దరఖాస్తులను కూడా నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని సూచించారు. బూత్ స్థాయి అధికారులు నిర్వహించిన పనులను పర్యవేక్షకులు క్షేత్రస్థాయిలో పరిశీలించి పునఃపరిశీలన చేయాలని, ఓటర్ల వివరాల పరిశీలన నుంచి నోటీసుల జారీ, దరఖాస్తుల పరిష్కారం వరకు ప్రతి దశను పర్యవేక్షించాలని కలెక్టర్ ఆదేశించారు. విధుల్లో నిర్లక్ష్యం వహించే వారిపై నిబంధనల ప్రకారం క్రమశిక్షణా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రతి ఓటరూ తమ పేరు, చిరునామా, ఇతర వివరాలు ఓటర్ల జాబితాలో సరిగ్గా ఉన్నాయో లేదో పరిశీలించుకోవాలని కలెక్టర్ కోరారు. 18 ఏళ్లు నిండిన అర్హులైన యువత ఓటరుగా నమోదు చేసుకోవాలని, మార్పులు లేదా తప్పులు ఉంటే సంబంధిత ఎన్నికల సిబ్బందికి తెలియజేయాలని సూచించారు. ఆన్‌లైన్‌లోనూ ఫారం 6, 7, 8 ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరి పేరు జాబితాలో ఉండటం, అనర్హుల పేర్లను తొలగించడం, వివరాల్లో ఎలాంటి తప్పులు లేకుండా చూడటమే ఎస్ఐ ఆర్ లక్ష్యమని కలెక్టర్ స్పష్టం చేశారు. అధికా రులు, ఎన్నికల సిబ్బందితోపాటు ప్రజలు కూడా భాగస్వాములై సహకరించాలని కోరారు.

# శాంతియుత వాతావరణంలో గణేష్ ఉత్సవాలు జరుపుకోవాలి

### నిమజ్జన ప్రాంతాల్లో పటిష్ట బందోబస్తు.. సీసీ కెమెరాలతో నిరంతర నిఘా : కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం

**కరీంనగర్,(సింగిడి):** గణేష్ నవరాత్రి ఉత్సవాలు, నిమజ్జన వేడుకలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు పటిష్ట భద్రతా చర్యలు చేపట్టినట్లు కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం తెలి పారు. ఉత్సవాల భద్రతా ఏర్పాట్లపై పోలీసు అధికారు లతో సమీక్ష నిర్వ హించిన ఆయన పలు సూచ నలు, ఆదేశాలు జారీ చేశారు. కమిషనరేట్ పరిధిలోని ముఖ్య కూడళ్లు, సమస్యాత్మక ప్రాంతాలు, నిమజ్జన మార్గా లపై నియంత్రణ కేంద్రం ద్వారా సీసీ కెమెరాలతో నిరంతర నిఘా కొనసాగుతుందని తెలిపారు. ప్రతి గణేష్ మండపం వద్ద నిర్వాహకులు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడంతో పాటు స్వచ్ఛంద సేవకులను అందుబాటులో ఉంచాలని సూచించారు. అత్యవసర ఫోన్ నంబర్లను మండపాల




వద్ద ప్రదర్శించాలని ఆదేశించారు. మానకొండూరు, కొత్తపల్లి, చింతకుంట తదితర ప్రధాన నిమజ్జన ప్రాం తాల్లో పటిష్ట బందోబస్తు, భారీ క్రేన్లు, విద్యుత్ దీపాలు, గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచుతున్నట్లు సీపీ వెల్లడించారు. విగ్రహాల ఊరేగింపు మార్గాల్లో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ముందస్తు మార్గ ప్రణాళిక అమలు చేస్తున్నా మని, విద్యుత్ తీగలు, చెట్ల కొమ్మలను తొలగిం చినట్లు తెలిపారు. సామాజిక మాధ్యమాల్లో రెచ్చగొట్టే పోస్టులు, వదంతులు వ్యాప్తి చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరిం చారు. అనుమానాస్పద వ్యక్తులు లేదా వస్తు వులు కనిపిస్తే వెంటనే అత్యవసర సేవల నంబర్ 112 లేదా స్థానిక పోలీసులకు సమా చారం ఇవ్వాలని ప్రజలను కోరారు. గణేష్ నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, చట్టప రమైన నిబంధనలు పాటిస్తూ, విజయవం తంగా నిర్వహించేందుకు ప్రజలు, ఉత్సవ కమిటీలు పోలీసులకు సహకరించాలని గౌష్ ఆలం విజ్ఞప్తి చేశారు.

# దళితుల సంక్షేమం కోరేది కాంగ్రెస్ ప్రభుత్వమే

### దళితులపై బీఆర్ఎస్‌కు కపట ప్రేమ..
### త్వరలోనే దళిత బంధు రెండో విడత నిధులు..
### ఎంఎంఎస్ సభలో తీపి కబురు చెప్పిన ప్రణవ్

**జమ్మికుంట,(సింగిడి):** దళిత బంధు పథకం విషయంలో ఇక్కడ ఇంచార్జిగా ప్రణవ్ మంత్రులను, ఇంచార్జి మంత్రులను కలిసి నిధులు విడుదల అయ్యేందుకు కృషి చేస్తున్నాడని మాజీ మంత్రి మోత్కుపల్లి నరసింహులు అన్నారు. ఆదివారం నాడు జమ్మికుంట పట్టణంలోని ఎంపీఆర్ గార్డెన్స్ లో మాదిగ మహాశక్తి ఆధ్వర్యంలో మాదిగల ఆత్మీయ సమావేశానికి ముఖ్య అతిథిగా మాజీ మంత్రి మోత్కుపల్లి నరసింహులు, హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల



ప్రణవ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా నిర్వహకులు ఘన స్వాగతం పలికారు. అనంతరం ప్రణవ్ మాట్లాడుతూ దళిత జాతి అభ్యున్నతి కోసం కాంగ్రెస్ పార్టీ నిత్యం కృషి చేస్తుందని, ఎస్సీ వర్గీకరణ కోసం ఏ పార్టీ చేయని పనిని కాంగ్రెస్ ప్రభుత్వం రేవంత్ రెడ్డి చేసి చూపెట్టారని అన్నారు. దళిత స్పీకర్ గా ఉన్న వ్యక్తిపై వ్యక్తిగతదూషణ, తర్వాత వారు తిరిగిన ప్రాంతాన్ని పసుపునీటితో శుద్ధిచేయడం లాంటివి సమాజంలో ఎలాంటి పరిస్థితిని బీఆర్ఎస్ సృష్టిస్తుందో అర్థం చేసుకోవచ్చని విమర్శించారు. గత ప్రభుత్వంలో ఆనాడు ఎన్నికల సమయంలో ప్రవేశపెట్టిన దళితబంధు పథకం లబ్ధిదారులకు పూర్తి స్థాయిలో ఇవ్వకుండా వారిని రాజకీయాల్లో ఓట్ల కోసం వాడుకున్నారని, ఓట్లతో సంబంధం లేకుండా కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 8వేల చిల్లర పై చిలుకు ఉన్న దళితబంధు లబ్ధిదారులను 2025లో గ్రౌండింగ్ ప్రక్రియను మరల చేపట్టి అయిదువేల వరకు తీసుకువచ్చామని, వాటిని ఆపాలని ఎన్ని ప్రయత్నాలు చేసినా ప్రభుత్వం నిధుల విడుదలకు సిద్ధంగా ఉందని ఆ దిశగా ముందుకు వెళు న్నామని, త్వరలోనే ఆ ప్రక్రియ చేపడతామని శుభవార్త తెలిపారు. ఈ ప్రకటనతో దళిత బంధు లబ్ధిదారుల్లో సంతోషం వెల్లివిరిసింది. ఈ కార్యక్రమంలో ఎంఎంఎస్ నిర్వాహకులు, కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రతినిధులు, నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# శ్రీకర హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం

### 500 మందికి వైద్య పరీక్షలు, ఉచిత మందులు, నిర్ధారణ పరీక్షలు



**కరీంనగర్,(సింగిడి):** కరీంనగర్ పట్టణంలోని వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయంలో వాసవి ఫౌండేషన్ ఆధ్వర్యంలో, శ్రీకర ఆసుపత్రి సౌజన్యంతో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఎముకలు, కీళ్ల సమస్యలకు సంబంధించిన నిపుణులైన వైద్యులు శిబిరంలో పాల్గొని సుమారు 500 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి నిర్ధారణ పరీక్షలు చేయడంతో పాటు ఉచితంగా మందులు అందజేశారు. ఈ సందర్భంగా వాసవి ఫౌండేషన్, వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయం అధ్యక్షులు చిట్టిమల్ల శ్రీనివాస్ మాట్లాడుతూ, ప్రజలు ఇలాంటి ఉచిత వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. శ్రీకర ఆసుపత్రి మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. వైద్యుడు అఖిల్ మాట్లాడుతూ,..నగరం లో 500 మందికి ఉచిత వైద్యం అందించడం తమకు ఆనందంగా ఉందన్నారు. ఎముకలకు సంబంధించిన వ్యాధులను తొలిదశలోనే గుర్తిస్తే సులభమైన వైద్యంతో నియంత్రించ వచ్చని తెలిపారు. ఎముకలు, కీళ్ల సమస్యలతో బాధపడుతున్న వారు వైద్యులను సంప్రదించాలని సూచించారు. అత్యాధునిక రోబోటిక్ సాంకేతికతతో వైద్య సేవలు అందిస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో శిబిర నిర్వాహకులు, వైద్య సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.

## మట్టి గణపతులనే పూజిద్దాం..

### పర్యావరణ పరిరక్షణ ప్రతిఒక్కరి బాధ్యత, 300 మట్టి విగ్రహాల పంపిణీ
### డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు



**కరీంనగర్, (సింగిడి):** పర్యావరణ పరిరక్షణలో భాగంగా మట్టి వినాయక ప్రతిమలను పూజించాలని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, నగర డిప్యూటీ మేయర్, మాజీ మేయర్ యాదగిరి సునీల్ రావు పిలుపునిచ్చారు. వినాయక చవితి పురస్కరించుకుని కరీంనగర్ 42వ డివిజన్ భగత్‌నగర్‌లోని తన శిబిర కార్యాలయం వద్ద మట్టి గణపతి విగ్రహాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సునీల్ రావు మాట్లాడుతూ, ప్లాస్టర్ ఆఫ్ పారిస్, రసాయన రంగులతో తయారైన విగ్రహాల వల్ల జలాశయాలు కలుషితమై పర్యావరణానికి, జలచరాలకు నష్టం జరుగుతుందని అన్నారు. ప్రకృతి పరిరక్షణకు మట్టి గణపతుల వినియోగాన్ని ప్రోత్సహించాలని సూచించారు. నగరపాలక సంస్థ పరిధిలో వినాయక విగ్రహాలతో పాటు తన సొంత నిధులతో 300 మట్టి గణపతి ప్రతిమలను కానుకగా చేసి ప్రజలకు పంపిణీ చేసినట్లు తెలిపారు. గణేష్ నవరాత్రులను ప్రశాంత వాతావరణంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించుకోవాలని ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో మహిళలు, స్థానిక ప్రజలు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**12వ డివిజన్‌లో అభివృద్ధి పనులకు శ్రీకారం..**
నగరపాలక సంస్థ పరిధిలోని 12వ డివిజన్ హస్నాపూర్‌లో 15వ ఆర్థిక సంఘం నిధులతో చేపట్టనున్న తాగునీటి పైప్‌లైన్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. మేయర్ కోలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు, స్థానిక కార్పొరేటర్ చొప్పరి జయశ్రీ, వేణు కలిసి పనులను ప్రారంభించారు. డివిజన్ ప్రజల తాగునీటి అవసరాలను తీర్చే లక్ష్యంతో చేపట్టిన పనులను నాణ్యతా ప్రమాణాలతో వేగంగా పూర్తి చేయాలని అధికారులకు, కాంట్రాక్టర్లకు సూచించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు, స్థానిక కాలనీ వాసులు పాల్గొన్నారు.

## ఘనంగా పూర్వ విద్యార్థుల" అపూర్వ" సమ్మేళనం



**జమ్మికుంట, (సింగిడి):** జమ్మికుంట మండలంలోని బిజిగిరి షరీఫ్ గ్రామం లో గల జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో 1992-93 విద్యాసంవత్సరం పదవ తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు తాము చదువుకున్న రోజుల్లో అనుభూతులను గుర్తు చేసుకుంటూ ఆటపాటలతో ఉత్సాహంగా గడిపారు. అనంతరం తమకు విద్యా బుద్ధులు నేర్పిన గురువులైన రాజిరెడ్డి ,రాజగోపాల్ ,నర్సింహారెడ్డి ,వెంకటేశ్వర చారి,చంద్ర మోహన్ ,ప్రభాకర్,రాజేశం లను పూల మాలలు శాలువాలు మెమెంటో లతో ఘనంగా సత్కరించారు. ఈకార్యక్రమంలో పూర్వ విద్యార్థులు రాజేందర్,మహేందర్,సంపత్ రావు ,జలీల్ , శ్రీనివాస్,కొమురయ్య,చంద్రశేఖర్, వీరేశలింగం పోచయ్య,ఉమారాణి,స్వరూప విజయ ధనలక్ష్మి విజయ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ఆర్.కృష్ణయ్య జన్మదిన వేడుకలు

### బీసీల హక్కుల సాధనకు ఆయన చేసిన పోరాటం చిరస్మరణీయం. బీసీ సంఘం నాయకులు
### బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు ఆది మల్లేశం పటేల్, బీసీ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు నర్సింగోజు శ్రీనివాస్



**కరీంనగర్, (సింగిడి):** తెలంగాణ చౌక్: బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్య సభ సభ్యుడు ఆర్. కృష్ణయ్య 72వ జన్మదిన వేడుకలను బీసీ సంఘం నాయకులు తెలంగాణ చౌక్‌లో ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు ఆది మల్లేశం పటేల్, బీసీ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు నర్సింగోజు శ్రీనివాస్ మాట్లాడుతూ, గత ఐదు దశాబ్దాలుగా దేశవ్యాప్తంగా బీసీల హక్కులు, విద్య, ఉపాధి, రాజకీయ ప్రాతినిధ్యం, సామాజిక న్యాయం కోసం ఆర్. కృష్ణయ్య చేసిన పోరాటం చిరస్మరణీయమని అన్నారు. బీసీలకు న్యాయమైన వాటా, సమాన అవకాశాల కోసం ఆయన కొనసాగిస్తున్న ఉద్యమం యువతకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. బీసీ సమాజం ఐక్యంగా ముందుకు సాగేందుకు, రాజ్యాంగబద్ధమైన హక్కుల సాధన కోసం ఆర్. కృష్ణయ్య నాయకత్వంలో ఉద్యమాన్ని మరింత బలోపేతం చేస్తామని తెలిపారు. ఆయన ఆయురారోగ్యాలతో నిండు నూరేళ్లు ప్రజాసేవలో కొనసాగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో బీసీ సంఘం నాయకులు చిగుర్ల శ్రీనివాస్, గుంటి స్వరూప, ఉమామహేశ్వర్, గున్నాల కన్నయ్య, నల్లగొని శ్రీనివాస్, పెద్ది శ్రీనివాస్, నరాల శ్రీకాంత్, కొలనూర్ భార్గవ్, బుర్ర లీల, సుమ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా మెడ్‌వేవ్ ఆసుపత్రి ప్రారంభం

### తక్కువ ధరలకు నాణ్యమైన వైద్యం అందించడమే మా హాస్పిటల్ లక్ష్యం: డాక్టర్ అఖిల్ అల్లా



**కరీంనగర్,(సింగిడి):** నగరంలోని మంచిర్యాల చౌరస్తాలో మెడ్ వేవ్ ఆసుపత్రి ఘనంగా ప్రారంభమైంది. జిల్లా ప్రజలకు ఆధునిక వైద్య సేవలను అందుబాటులోకి తీసుకురావాలనే లక్ష్యంతో ఆసుపత్రిని ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ప్రారంభోత్సవానికి నగర మేయర్ కోలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు, డాక్టర్ అఖిల్ అల్లా, దేవి అనూష తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్ అఖిల్ అల్లా మాట్లాడుతూ, మా హాస్పిటల్‌లో అన్ని ఆధునిక సౌకర్యాలతో పాటు, అత్యాధునిక వైద్య సాంకేతికతను ఆసుపత్రిలో అందుబాటులోకి తీసుకొచ్చినట్లు తెలిపారు. సాధారణ వైద్యం, మహిళల వైద్యం, కేన్సర్ చికిత్సకు నిపుణులైన వైద్యులు అందుబాటులో ఉంటారని చెప్పారు. తక్కువ ఖర్చుతో నాణ్యమైన వైద్యం అందించడమే తమ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. అలాగే ప్రజల సౌకర్యార్థం. ఈ నెల 14 నుంచి 19వ తేదీ వరకు ఉచిత ఓపి సేవలు నిర్వహిస్తున్నామని, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రారంభోత్సవ కార్యక్రమంలో టీఎన్జిఓ జిల్లా అధ్యక్షులు దారం శ్రీనివాస్ రెడ్డి, కాశెట్టి శ్రీనివాస్, వేముల లక్ష్మీనారాయణ, మెతుకు సత్యం తదితర ప్రముఖులు, వైద్య సిబ్బంది పాల్గొని ఆసుపత్రి నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలిపారు.

### మెడికవర్ అస్పత్రిలో గుండెకు అరుదైన
## ఆపరేషన్ విజయవంతం

### క్లిష్టమైన ఎడమ ప్రధాన హృదయ ధమనిలో అడ్డంకికి విజయవంతంగా స్టెంట్, 24 గంటల్లోనే రోగి ఇంటికి, డాక్టర్ కార్డియాలజిస్టు డాక్టర్ సతీష్‌కుమార్



**కరీంనగర్,(సింగిడి):** అత్యంత కీలకమైన ఎడమ ప్రధాన హృదయ ధమనిలో ఏర్పడిన తీవ్రమైన అడ్డంకికి కరీంనగర్ మెడికవర్ ఆసుపత్రి వైద్యులు విజయవంతంగా స్టెంట్ అమర్చారు. కార్డియాలజిస్టు డాక్టర్ సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో ఈ చికిత్స నిర్వహించి రోగిని ప్రాణాపాయ పరిస్థితి నుంచి కాపాడినట్లు వైద్యులు తెలిపారు. ఆదివారం ఆసుపత్రిలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో డాక్టర్ సతీష్‌కుమార్ చికిత్స వివరాలను వెల్లడించారు. హైదరాబాద్‌కు చెందిన క్రిష్టోఫర్ స్టాన్లీ బంటు తీవ్ర గుండె నొప్పితో ఆసుపత్రికి రాగా, పరీక్షలు నిర్వహించగా గుండెకు రక్తాన్ని సరఫరా చేసే అత్యంత కీలకమైన ఎడమ ప్రధాన హృదయ ధమనిలో తీవ్రమైన అడ్డంకి ఉన్నట్లు గుర్తించినట్లు తెలిపారు. ఈ ప్రాంతంలో అడ్డంకి ఏర్పడితే గుండె కండరాలకు రక్త సరఫరా తగ్గి తీవ్రమైన గుండెపోటు వచ్చే ప్రమాదం ఉంటుందని వివరించారు. రోగి పరిస్థితిని పూర్తిగా అంచనా వేసిన అనంతరం అత్యాధునిక చికిత్సా విధానంతో అడ్డంకి ఉన్న ప్రాంతంలో విజయవంతంగా స్టెంట్ అమర్చినట్లు చెప్పా రు. ఈ ప్రక్రియ అత్యంత క్లిష్టమైనదైనా వైద్య బృందం సమ న్వయంతో విజయవంతంగా పూర్తి చేసినట్లు తెలిపారు. చికిత్స అనంతరం రోగి ఆరోగ్యం నిలకడగా ఉండటంతో 24 గంటల్లోనే ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ చేసినట్లు వెల్లడించారు. కరీంనగర్ మెడికవర్‌లో ఆధునిక హృదయ చికిత్సా సదుపాయాలు, అనుభవజ్ఞులైన వైద్య బృందం, ఆధునిక హృదయ పరీక్షల ప్రయోగశాల అందుబాటులో ఉండటంతో హైదరాబాద్‌కు వెళ్లాల్సిన అవసరం లేకుండా క్లిష్టమైన గుండె సంబంధిత కేసులకు చికిత్స అందిస్తున్నామని డాక్టర్ సతీష్‌కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా క్రిష్టోఫర్ మాట్లాడుతూ, తాను కరీంనగర్‌లోనే జన్మించానని, ఇక్కడే మెడికవర్ వైద్యులు తనకు పునర్జన్మ ప్రసాదించారని భావిస్తున్నానని, వైద్యులకు కృతజ్ఞతలు తెలిపారు. ఆసుపత్రి కేంద్ర అధిపతి గుర్రం కిరణ్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో మత్తు వైద్యం విభాగం అధిపతి డాక్టర్ వినయ్, అత్యవసర చికిత్స విభాగం అధిపతి డాక్టర్ ఉపేందర్‌రెడ్డి, మార్కెటింగ్ విభాగం అధిపతి కోట కర్ణాకర్ తదితరులు పాల్గొన్నారు.

## మాజీ మంత్రి మోత్కుపల్లికి ఘన సన్మానం



**జమ్మికుంట,(సింగిడి):** జమ్మికుంట పట్టణంలోని ఎం పి ఆర్ గార్డెన్ లో ఆదివారం నిర్వహించిన మాదిగ మహా శక్తి ఆత్మీయ సమ్మేళనానికి ముఖ్య అతిథిగా వచ్చిన రాష్ట్ర మాజీ మంత్రి మోత్కుపల్లి నరసింహులు ను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో ఘనంగా సన్మానిం చిన హుజురాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ రొంటాల సుహాసిని. మాదిగ మహాశక్తి ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న మున్సిపల్ చైర్ పర్సన్ సుహాసిని నీ ఉద్దేశించి మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులు మాట్లాడుతూ ఒక దళిత బిడ్డ రాజకీయంగా ఎదిగితే కుల మతాలకు అతీతంగా మన దగ్గరికి వస్తారని ప్రతి ఒక్కరూ ఈ ఆడబిడ్డను ఆదర్శంగా తీసుకొని రాజకీయంగా ముందుకు వెళ్లాలని సూచించారు. దళితుల ఓటు దళితులకు అన్న నినాదంతో ప్రతి ఒక్కరు ఐకమత్యంతో మన దళిత బిడ్డలను గెలిపిం చుకోవాలని సూచించారు.. అనంతరం మున్సిపల్ చైర్ పర్సన్ సుహాసినిని మాజీ మంత్రి అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి ప్రణవ్ బాబు జమ్మికుంట కాంగ్రెస్ పార్టీ మండల మహిళ తోట స్వప్న మైనార్టీ నేత సజ్జు తదితరులు పాల్గొన్నారు.

# తల్లిదండ్రుల జ్ఞాపకార్థం.. హనుమాన్ ఆలయ కమాన్ నిర్మాణం

**జమ్మికుంట (సింగిడి):** తనుగుల గ్రామా నికి చెందిన తోట రాయలింగు - ఆగమ్మ దంపతుల జ్ఞాపకార్థం వారి సంతానం, తనుగుల హనుమాన్ దేవా లయానికి రోడ్ ద్వారం వద్ద 24000 వేల రూపాయలతో ఐరన్ కమాన్ చేయించి, వినాయక నవరాత్రి ఉత్సవాల సందర్భంగా నిలపడం జరిగింది. గతంలో మెయిన్ రోడ్ నుండి గుడి వరకు సిమెంట్ రోడ్ వేస్తున్న సందర్భంలో గ్రామ పెద్దల కోరిక మేరకు రోడ్ నిర్మాణానికి కొంత స్థలాన్ని ఇవ్వడం జరిగింది. సర్పంచ్ కిరణ్ మాట్లాడుతూ వీరి కుటుంబ సభ్యులు గ్రామానికి సేవ చేయాలనే ఉద్దేశంతో ముందుకు వచ్చి ఈ పనులు చేయించడం ఎంతో అభినందనీయమన్నారు. సామాజిక కార్యకర్త అంబాల రజనీకాంత్ మాట్లాడుతూ గతములో స్కూల్ విద్యార్థులు అందరికీ మధ్యన భోజనం ప్లేట్లు అందిం చడం, పలు సేవా కార్యక్రమాలు చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ జక్కే కిరణ్, సామాజిక కార్యకర్త అంబాల రజనీకాంత్, గ్రామ పురోహితులు వల్లూరి పవన్ కుమార్, విష్ణు, వాసాల సుధీర్, దేవేందర్ రెడ్డి, వెంకట్ రెడ్డి, యాద కిషన్, రాజు, దాసారపు రాజయ్య, ప్రశాంత్, సంజీవ్, సంపత్, కొమురయ్య, గ్రామ పంచాయతీ సిబ్బంది, దాత కుటుంబసభ్యులు తోట రాజు, సరిత, లక్ష్మీప్రియ, ఈశ్వర్ కార్తీక్, స్వరూప,



కౌటమ్ రాజ్ కుమార్, అంజలి తదితరులు పాల్గొన్నారు.

# బాడుగ దిన్నెకు బస్సును నడపండి

**కోడేరు, (సింగిడి):** కోడేరు మండల పరిధిలోని బాడుగదిన్నె గ్రామానికి ఆర్టీసీ బస్సులు నడపాలని సిపిఐ మండల కార్యదర్శి కిరణ్ అన్నారు స్వతంత్రం వచ్చి 80 సంవత్సరాలు కావస్తున్న ఇప్పటివరకు బాడుగదిన్నె గ్రామానికి బస్సు లేకపోవడంతో గ్రామ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు .

ఆర్టీసీ బస్సు ఎక్కాలంటే సింగోటం లేదా నర్సాయిపల్లి గ్రామాలకు వెళ్లి గమ్యం చేరుకోవాల్సిన పరిస్థితి బాడుగదిన్నె గ్రామ ప్రజలకు దాపురించిందని ఆయన అన్నారు ఎంతో మంది నాయకులు ఎమ్మెల్యేలు గ్రామానికి బస్సు నడుపుతామని ఎన్నికల ముందు ఇస్తారు హామీలు తప్ప ఇప్పటివరకు బస్సు నడపడంలో అధికారులు గానీ రాజకీయ నాయకులు గాని విఫలమయ్యారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు అత్యవసర పరిస్థితుల్లో గ్రామస్తులు ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించక తప్పడం లేదు డెలివరీ సమయాల్లో వేలకు వరూపాయలు వెచ్చించి గమ్యం చేసుకోవాల్సిన పరిస్థితి బాడుగు దిన్నె ప్రజలకు దాపురించిందని ఆయన అన్నారు ప్రభుత్వం ప్రజల సౌకర్యార్థం ప్రతి గ్రామానికి బస్సులను నడుపుతున్నామని చెప్పడమే తప్ప ఆచరణలో విఫలమైందని ఆయన తెలిపారు బాడుగ దిన్నె ప్రజలకు కాలినడక ఇప్పటికైనా తప్పిస్తారని ప్రైవేటు వాహనాలను ఆశ్రయించడం ఇప్పటికైనా తప్పుతుందని గ్రామ ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు ఆర్టీసీ అధికారులు కానీ రాజకీయ నాయకులు గాని చొరవ తీసుకొని గ్రామానికి బస్సు నడిపి గ్రామ ప్రజలకు సౌకర్యంగా చేస్తారని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు .

ప్రభాతవం సింగిడి ప్రతి రంగూ ఓ నిజం
Singidi సోమవారం 14-9-2026

# ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లు పరిశీలించిన కలెక్టర్

**నల్లగొండ ప్రతినిది (సింగిడి):** రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి నకిరేకల్ పర్యటన ఏర్పాట్లను పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ అధికారులను ఆదేశించారు. గురువారం అయన నకిరేకల్ పట్టణంలో ముఖ్యమంత్రి రాక ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఈనెల 5న రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి నకిరేకల్ పట్టణం లో నూతనంగా నిర్మించిన ప్రాంతీయ వైద్యశాలను ప్రారంభించనున్నారు. అంతేకాక యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల, తెలంగాణ పబ్లిక్ స్కూల్, ఇంటిగ్రేటెడ్ మండల్ ఆఫీస్ కాంప్లెక్స్, అలాగే వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేయనున్నారు. ప్రాంతీయ వైద్యశాలలో ప్రారంభోత్సవ ఏర్పాట్లను, శిలాఫలకం ఏర్పాటు చేయాలని, ఆస్పత్రి ఆవరణ మొత్తం పరిశుభ్రంగా ఉంచాలని, ఆస్పత్రిలో లైటింగ్ తో పాటు, పూలతో డెకరేషన్ చేయించాలని, బిల్డింగ్ మొత్తాన్ని ఆటోమేటిక్ బల్బుల ద్వారా విద్యుత్ దీపాలతో అలంకరించాలని కలెక్టర్ ఆదేశించారు. అంతేకాక రాష్ట్ర ముఖ్యమంత్రి ఆస్పత్రిలో ప్రారంభించే వివిధ విభాగాలను కూడా సిద్ధం చేసి ఉంచాలని ,సూపరింటీండెంట్ గది తో పాటు, ఆస్పత్రిలోని అన్ని విభాగాలు, టాయిలెట్లు, లిఫ్ట్, ఆపరేషన్ థియేటర్లు ,వార్డులు, ప్రతీ విభాగాన్ని ముందే శుభ్రపరచి సిద్ధం చేయాలని ఆదేశించారు. ఆస్పత్రిలో స్టాండ్ బై జనరేటర్ కూడా సిద్ధంగా ఉంచాలని డిసిహెచ్ఎస్ మాతృ నాయక్, సూపరింటెండెంట్ శోభ రాణిలను ఆదేశించారు. అనంతరం పక్కనే ఉన్న స్టేడియం గ్రౌండ్లో ఏర్పాటు చేస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి హాజరుకానున్న బహిరంగ సభ ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ పర్యవేక్షించారు. సభా వేదిక ,వాహనాల పార్కింగ్ ,వివిధ అభివృద్ధి కార్యక్రమాల శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలకు ఏర్పాటు చేసే శిలాఫలకాలు, బ్యారికేడింగ్, బహిరంగ సభ కు హాజరయ్యే ప్రజా ప్రతినిధులు, అధికారులు, ప్రజలకు అవసరమైన ఏర్పాట్లు, కుర్చీలు, టెంట్లు, తాగునీరు అవసరమైన అన్ని ఏర్పాట్లను పూర్తిచేయాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆ తర్వాత జిల్లా కలెక్టర్ వివిఎం పాఠశాల గ్రౌం డ్లో ఏర్పాటు చేస్తున్న హెలిప్యాడ్ ఏర్పాట్లను కూడా పరిశీలించారు. సాధ్యమై నంత త్వరగా హెలిప్యాడ్ నిర్మాణాన్ని పూర్తి చేయాలని ఆర్ అండ్ బి అధికా రులను ఆదేశించారు. వివి ఏం పాఠశాల గ్రౌండ్లో డబుల్ బ్యారికెడింగ్ తో పాటు ,లైటింగ్, గ్రీన్ రూమ్ ఏర్పాట్లను చేయాలని, ఏర్పాట్లలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా చూడాలని ఆదేశించారు. స్థానిక సంస్థల ఇంచార్జ్ అదనపు కలెక్టర్ ప్రేమ్ కరణ్ రెడ్డి, శిక్షణ సహాయ కలెక్టర్ శ్రీకాంత్ రెడ్డి, జిల్లా ఆస్పత్రుల సమన్వయకర్త డాక్టర్ మాతృనాయక్, ఆర్ అండ్ బి ఎస్ ఈ పున్నమోహన్, ఈఈ శ్రీధర్ రెడ్డి ,మున్సిపల్ కమిషనర్ సతీష్, తహసిల్దార్ యశ్వంత్, పోలీసు, రెవెన్యూ, ఫైర్, ఎక్సైజ్, శాఖల అధికారులు ,తదితరులు ఉన్నారు.



# నర్సాపూర్‌లో కాళేశ్వరం కాలువ పనులను పరిశీలించిన మాజీ మంత్రి హరీష్ రావు

**రెడ్డిపల్లిలో మోడువారిన కాళేశ్వరం కాలువలు.. కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై హరీష్ రావు, సునీతా లక్ష్మారెడ్డి ఆగ్రహం**



**కొల్చారం (సింగిడి):** నర్సాపూర్ నియోజకవర్గంలోని రెడ్డిపల్లి గ్రామ శివారులో కొనసాగుతున్న కాళేశ్వరం కాలువ పనులను సిద్ధిపేట ఎమ్మెల్యే, మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు, నర్సాపూర్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి సునీతా లక్ష్మారెడ్డి గురువారం పరిశీలించారు. వారి వెంట బీఆర్ఎస్ నాయకులు, రైతులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. కాలువ పనుల వద్ద పేరుకుపోయిన కలుపు మొక్కలు, నిలిచిపోయిన మట్టి పనులు, తుప్పు పట్టిన ఇనుప చువ్వలను పరిశీలించిన అనంతరం వారు కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. ఈ సందర్భంగా హరీష్ రావు మాట్లాడుతూ.. "కేసీఆర్ హయాంలో 90 శాతం పూర్తయిన కాళేశ్వరం కాలువలను కాంగ్రెస్ ప్రభుత్వం కావాలనే ఆపేసింది. నర్సాపూర్, సిద్ధిపేట రైతుల గొంతు కొట్టే కుట్ర చేస్తోంది. నీళ్లు ఇవ్వడం చేతకాక, కేసీఆర్ కట్టిన ప్రాజెక్టుపై బురద జల్లడమే పనిగా పెట్టుకుంది. ఇక్కడ రెడ్డిపల్లిలో చూడండి, కాలువ తవ్వి వదిలేశారు, లైనింగ్ చేయలేదు. దీంతో రైతుల పొలాలు ఎడారిగా మారాయి" అని ధ్వజమెత్తారు. ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. "నర్సాపూర్ నియోజకవర్గానికి కాళేశ్వరం జలాలు వస్తే లక్ష ఎకరాలకు సాగునీరు అందేది. కానీ ఈ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి ఒక్క రూపాయి కూడా కాలువలకు ఖర్చు చేయలేదు. కాంట్రాక్టర్లకు బిల్లులు ఇవ్వకపోవడంతో వారు పనులు మధ్యలోనే వదిలేసి వెళ్లిపోయారు. ఇది రైతు ద్రోహం కాదా?" అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ హయాంలోనే కాళేశ్వరం పూర్తయి ఉంటే నర్సాపూర్ చెరువులన్నీ నిండి ఉండేవని, ఇప్పుడు ప్రభుత్వ నిర్లక్ష్యంతో కాలువలు మోడువారి, రైతులు వలస వెళ్లే పరిస్థితి వచ్చిందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే మేల్కొని కాళేశ్వరం కాలువ పనులను పునఃప్రారంభించకపోతే రైతులతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

# అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలి



**కొమురం భీం ఆసిఫాబాద్ ప్రతినిధి, (సింగిడి):** జిల్లాలో వివిధ శాఖలు, ప్రభుత్వ పథకాల ద్వారా చేపడుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేసి నిర్ణీత సమయంలోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కె. హరిత అధికారులను ఆదేశించారు. జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో గురువారం ఐటీడీఏ ఉట్నూర్ ప్రాజెక్టు అధికారి మంద మకరందు, జిల్లా అటవీ అధికారి బాలమణి, కాగజ్ నగర్, ఆసిఫాబాద్ డివిజన్ అటవీ అధికారులు భార్గవ్, అప్పయ్యలతో కలిసి అభివృద్ధి పనులు, అటవీశాఖ అనుమతుల పురోగతిపై కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భూముల రీ-సర్వేలో రెవెన్యూ, అటవీ శాఖల మధ్య వివాదాలున్న భూములను సంయుక్తంగా సర్వే చేసి సమస్యలను పరిష్కరించాలని సూచించారు. ఇందిరమ్మ ఇళ్లు, ప్రధానమంత్రి జన్‌మన్ పథకం కింద మంజూరైన ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని, ఇందుకు అటవీశాఖ అధికారులతో సమన్వయం చేసుకోవాలని ఆదేశించారు. లింగాపూర్ మండలంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం ప్రహరీ గోడ నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేయాలని, గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మంజూరైన బీటీ రహదారులు, వంతెనలు, కల్వర్టు పనులకు అవసరమైన అటవీ శాఖ అనుమతులను సత్వరమే పొందాలని సూచించారు. పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో చేపడుతున్న రహదారులు, గ్రామపంచాయతీ భవనాలు, మండల సమాఖ్య భవనాలు, సీసీ రహదారుల నిర్మాణాలను వేగంగా చేపట్టాలన్నారు. మారుమూల గ్రామాలకు మెరుగైన నెట్‌వర్క్ సేవలు అందించేందుకు బీఎస్ఎన్ఎల్, జియో సెల్ టవర్ల నిర్మాణాలకు అవసరమైన అనుమతులను త్వరగా పొందాలని, పనులను పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. అభివృద్ధి పనులకు అట వీశాఖ అనుమతులు అవసరమైన చోట సంబంధిత అధికా రులు సమన్వయంతో పనిచేసి అనుమతుల ప్రక్రియను వేగవం తం చేయాలని సూచించారు. ఈ సమావేశంలో గృహ నిర్మాణ శాఖ పీడీ ప్రకాష్‌రావు, పంచాయతీరాజ్ ఈఈ ధర్మేందర్, జిల్లా పంచాయతీ అధికారి బిక్షపతి, నీటిపారుదల, రహదారులు-భవనాలు, గిరిజన సంక్షేమ శాఖల అధికారులు పాల్గొన్నారు.



# కొత్తగూడెం మేజర్ కాలువకు నీరేదీ?

**చెరువులు నిండే పరిస్థితి లేక.. ఆందోళనలో ఆయకట్టు రైతులు**
**నీటిని పూర్తిస్థాయిలో విడుదల చేయాలని కోరుతున్న రైతులు**

**కోదాడ, (సింగిడి):**
ప్రభుత్వం నాగార్జునసాగర్ నుంచి సాగునీటిని విడుదల చేసినప్పటికీ కొత్తగూడెం మేజర్ కాలువలో పూర్తిస్థాయిలో నీటి ప్రవాహం కనిపించకపోవడంతో ఆయకట్టు రైతులు ఆందోళన చెందుతున్నారు. కాలువకు సరిపడా నీరు రాకపోవడంతో ఆయకట్టు పరిధిలోని చెరువులు నిండే పరిస్థితి లేదని రైతులు చెబుతున్నారు. కొత్తగూడెం మేజర్ కాలువ పరిధిలోని ఖానాపురం, లక్ష్మీపురం, గొండ్రియాల, తమ్మర, బొజ్జగూడెం తండాతో పాటు పలు గ్రామాల రైతులు సాగర్ నీటిపై ఆధారపడి ఉన్నారు. ప్రస్తుతం పంటలకు నీటి అవసరం ఉన్న నేపథ్యంలో చెరువులు నిండకపోతే రానున్న రోజుల్లో సాగునీటికి ఇబ్బందులు తలెత్తుతాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం విడుదల చేసిన నీరు కాలువ చివరి ఆయకట్టు వరకు సక్రమంగా చేరేలా అధికారులు చర్యలు తీసుకోవాలని, కొత్తగూడెం మేజర్ కాలువకు పూర్తిస్థాయిలో నీటిని విడుదల చేసి చెరువులను నింపాలని రైతులు కోరుతున్నారు.

# గణేష్ ఉత్సవాల నిర్వహణకు పటిష్ఠ ఏర్పాట్లు : సీఎంసి కమిషనర్ శ్రీజన



**ఉమ్మడి రంగారెడి (సింగిడి):** గణేష్ ఉత్సవాలు-2026ను సురక్షితంగా, సజావుగా నిర్వహించేందు కు చేపట్టాల్సిన కార్యాచరణ ప్రణాళిక, ముందస్తు ఏర్పాట్లపై సైబరాబాద్‌లో సమన్వయ సమావేశం నిర్వహించారు. సైబరాబాద్ మున్సిపల్ కమిషనర్ డాక్టర్ జి. శ్రీజన, సైబరాబాద్ జాయింట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ (ట్రాఫిక్) సన్‌ప్రీత్ సింగ్, భాగ్యనగర్ గణేష్ ఉత్సవ కమిటీ ప్రతినిధులు, జీహెచ్ఎంసీ అధికారులు, వివిధ శాఖలు, ప్రభుత్వ విభాగాలు, ఏజెన్సీల ప్రతినిధులు సమావేశంలో పాల్గొన్నారు. సైబరాబాద్ పరిధిలో మొత్తం 54 గణేష్ నిమజ్జన కేంద్రాలను ఏర్పాటు చేయనున్న నేపథ్యంలో ప్రతి నిమజ్జన కేంద్రం వద్ద అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేయడంపై సమావేశంలో ప్రధానంగా చర్చించారు. వివిధ శాఖలు, సంబంధిత అధికారులు ప్రస్తావించిన సమస్యలను పరిష్కరించడంతో పాటు సమన్వయంతో ముందుకు సాగాలని నిర్ణయించారు. ప్రధానంగా ట్రాఫిక్ నిర్వహణ, క్రేన్ల ఏర్పాటు, పారిశుధ్యం, విద్యుత్ వెలుగులు, బారికేడింగ్, రహదారులపై గుంతల పూడ్చివేత, భద్రతా చర్యలు, అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనే సన్నద్ధత, కంట్రోల్ రూమ్‌ల ఏర్పాటు తదితర అంశాలపై చర్చించారు. అలాగే సంబంధిత ప్రభుత్వ శాఖలతో నిరంతర సమన్వయం కొనసాగించాలని అధికారులకు సూచించారు. సమావేశంలో వివిధ శాఖల ఉన్నతాధికారులు, జోనల్ కమిషనర్లు, డిప్యూటీ కమిషనర్లు, ఇంజనీరింగ్ అధికారులు, ట్రాఫిక్ పోలీసు అధికారులు, ఇతర సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు. గణేష్ ఉత్సవాల సందర్భంగా శాఖల మధ్య సమన్వయం, ఏర్పాట్లను నిర్ణీత సమయంలో పూర్తి చేయడం, ట్రాఫిక్ మరియు జనసమ్మర్థాన్ని సమర్థవంతంగా నియంత్రించడం అత్యంత కీలకమని అధికారులు పేర్కొన్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా, సైబరాబాద్ వ్యాప్తంగా గణేష్ ఉత్సవాలు సురక్షితంగా, ప్రశాంతంగా, సజావుగా నిర్వహించేలా సమగ్ర ఏర్పాట్లు చేయాలని సమావేశంలో నిర్ణయించారు.







# చిన్నారులు విద్యార్థుల ఆరోగ్యంపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ

**సకాలంలో... పేద ప్రజలకు సన్న బియ్యం పంపిణీ పై ఆరా**
**జవహర్ నగర్ లోని మల్కారం అంగన్వాడీ తదితర కేంద్రాల సందర్శన**
**తెలంగాణ రాష్ట్ర ఫుడ్ సేఫ్టీ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్**

**మేడ్చల్ కలెక్టరేట్, (సింగిడి):** రాష్ట్ర ప్రభుత్వం గర్భిణుల, చిన్నారుల, విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేవ శ్రద్ధ వహిస్తూ వారికి పౌష్టికాహారం అందించడం జరుగుతుందని, అందులో ఏలాంటి నిర్లక్ష్యం వహించిన ఉపేక్షించేది లేదని తెలంగాణ రాష్ట్ర ఫుడ్ సేఫ్టీ కమీషన్ ఛైర్మన్ గోలి శ్రీనివాస్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర ఫుడ్ సేఫ్టీ కమీషన్ ఛైర్మన్ గోలి శ్రీనివాస్, సభ్యులు ఆనంద్, జ్యోతి లు మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో శుక్రవారం పర్యటించారు. మేడ్చల్ తహాసీల్దారు కార్యాలయంలో కీసర ఆర్డీఓ వెంకట్ రెడ్డి ఛైర్మన్ కు, సభ్యులకు పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ముందుగా మేడ్చల్ లోని చౌక ధరల ధుకాణాలను పరిశీలించి డీలర్ తో స్టాక్ వివరాలు, రిజిష్టర్ల నమాదులు పరిశీలించారు. చౌకధరల దుకాణం వద్ద ఫిర్యాదుల బాక్సులు అందుబాటులో ఉంచాలని, అదేవిధంగా ఫిర్యాదులు ఇచ్చేందుకు గాను జిల్లా సివిల్ సప్లై అధికారి, మండల తహాసీల్దార్ల ఫోన్ నంబర్లు ప్రజలకు అందుబాటులో ఉండేలా ప్రదర్శించాలని ఛైర్మన్ సూచించారు. సన్న బియ్యం అందుతున్నాయా అని, మీకు సౌకర్యవంతంగా డీలర్లు బియ్యం అందిస్తున్నారా అని స్థానిక ప్రజలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కిష్టాపూర్ లోని తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్ ని సందర్శించి డైనింగ్ హాల్, స్టోర్ రూం పరిశీలించి ఎక్స్పైరీ డేట్ చెక్ చేస్తూ సరుకులను వాడాలని, నాణ్యమైన సన్నబియ్యం మాత్రమే వండాలని, బియ్యం నాణ్యత లేకుంటే వెంటనే అధికారులకు తెలియజేసి మార్చుకోవాలని తెలిపారు. స్కూలులో ఉడికించిన గుడ్లను పరిశీలించి వాటి రంగు మారిందని, తెల్లగా ఉండాల్సిన గుడ్లరంగు మారడానికి కారణాలు ఎమిటని అడిగారు. గుండ్లను సేకరించి ఎందుకురంగు మారాయని ఫుడ్ స్టేఫ్టీ అధికారి టెస్ట్ చేయించి నివేదిక అందించాలని ఆదేశించారు. విద్యార్థుల హెల్త్ చెకప్ రిజిష్టర్లను పరిశీలించిరక్తహీనత ఉన్న పిల్లల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించి అవసరమైన పౌష్టికాహారాన్ని అందించాలని ప్రిన్సిపల్ కు సూచించారు. పేరెంట్స్ కమిటీ మీటింగులు నిర్వహిస్తున్నారా అని అడిగి తెలుసుకొని సంబంధిత రిజిష్టర్లను పరిశీలించారు. పదవ తరగతి విద్యారుల తో ముచ్చటిస్తూ స్కూల్ లో ఏమైనా సమస్యలు న్నాయా అని, మెను ప్రకారం అల్పాహారం, భోజనం, స్నాక్స్ అందుతున్నాయా అని అడిగి తెలుసుకున్నారు. మంచినీరు టాయిలెట్లు మౌళిక వసతులు సరిగా ఉన్నాయా అని అడిగి, ఏవైనా సమస్యలుంటే ధైర్యంగా తమ దృష్టికి తీసుకురావాలని ఛైర్మన్ విద్యార్థులకు సూచించారు. నిర్భయంగా నిజాన్ని చెప్పే ధైర్యం ఉండాలని, అప్పుడే సమస్యలను ధైర్యంగా ఎదురుకుంటారని, తద్వారా భవిష్యత్తులో సమాజం పట్ల బాధ్యతగా ఉండగలరని విద్యార్థులకు భోధించారు. దమ్మాయిగూడా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ను సందర్శించి విద్యార్థులు అధిక సంఖ్యలో లంచ్ బాక్సులు తెచ్చుకోవడం గమనించిన కమీషన్ సభ్యులు, ఎందుకు ఇంటి నుండి బాక్స్ తెచ్చుకుం టున్నారని అడుగగా, విద్యార్థులు భోజనం సరిగా ఉండడం లేదని కమీషన్ దృష్టికి తీసుకువచ్చారు. ఇలాంటి లోపాలను ఉపేక్షించబోమని విచారించి సంబంధిత అధికారుల పై చర్యలు తీసుకుంటామని ఆదేశించారు. విద్యా ర్థులకు రుచికరమైన భోజనం అందించాలని, తాము మళ్లీ వచ్చి పరిశీలస్తామని అధికారులను హెచ్చరించారు. అనంతరం దమ్మాయిగూడలోని అంబేద్కర్ నగర్ లోని, జవహర్ నగర్ మల్కారం అంగన్ వాడీ కేంద్రాలను ఛైర్మన్ సభ్యులు సందర్శించారు. కేంద్రాలలో ఎంత మంది చిన్నారులున్నారని, ఎంతమంది గర్భిణులు వస్తారని, వారికి సరిపడా పౌష్టికాహారం, గుడ్డు, పాలు అందించడం జరుగుతుందా అని పరిశీలించారు. అంగన్ వాడీ సెంటర్లలో భోజనం మెను ప్రదర్శించాలని అదేశించారు. గర్భిణులు, 14 సంవత్సరాల లోపు పిల్లలకు పౌష్టికాహారం తీసుకోవడం వారి హక్కు అని, చట్టబద్ధమైన ఈ హక్కును కచ్చితంగా అమలయ్యేలా చూడాల్సిన బాధ్యత కమీషన్ పైన ఉందన్నారు. ఈ హక్కుదారులకు నష్టం జరుగకుండా వారి హక్కులకు భంగం కలుగకుండా చూడడానికి కమీషన్ ఎప్పుడు సిద్ధంగా ఉంటుందన్నారు. ఏక్కడైన సమస్యలు ఉంటే తమదృష్టికి తీసుకురావాలని సభ్యులు తమ ఫోన్ నంబర్లను గర్భిణి స్త్రీలకు అందజేసారు. ఈ పర్యటనలో నోడల్ అధికారి సాంబశివరావు, జిల్లా బిసి, ఎస్సీ, ఎస్టి, మైనారిటి సంక్షేమ అధికారులు ఝాన్సీరాణి, వినోద్ కుమార్, పద్మజా, కాంతమ్మ, డిఎం అండ్ హెచ్ఓ ఆనంద్, సివిల్ సప్లై అధికారులు సుగుణబాయి, శ్రీనివాస్, జిల్లా సంక్షేమ అధికారి శారద, తదితరులు పాల్గొన్నారు.

# పంచాయతీ కార్యదర్శి సస్పెన్షన్...

**ఉత్తర్వులు జారీచేసిన కలెక్టర్**



**నాగర్ కర్నూల్(సింగిడి):** ఒకే మరణించిన వ్యక్తికి రెండు వేర్వేరు తేదీలతో మరణ ధృవ పత్రాలు జారీ చేసిన ఘటన పై నాగర్ కర్నూలు జిల్లా అచ్చంపేట మండలం లోని బొమ్మనపల్లి గ్రామ పంచాయతీ కార్యదర్శి వి. రమేష్ బాబును జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ శుక్రవారం సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారని నాగర్ కర్నూల్ జిల్లా పంచాయతీ అధికారి శ్రీరాములు తెలిపారు. ఇటీవలే వివిధ తెలుగు దిన పత్రికల్లో "ఒక్కరికీ రెండు ధృవపత్రాలు" అనే శీర్షికన వెలువడిన వార్తల పై విచారణ చేపట్టాలని అచ్చంపేట డివిజనల్ పంచాయతీ అధికారి ఆదేశించగా, విచారణ అనంతరం సమర్పించిన నివేదిక ఆధారంగా జిల్లా కలెక్టర్ శుక్రవారం ఈ చర్యలు తీసుకున్నారని డిపిఓ తెలిపారు. విచారణ నివేదిక ప్రకారం, బొమ్మన పల్లి గ్రామ పంచాయతీ కార్యదర్శిగా 01.08.2024 నుంచి విధులు నిర్వ హిస్తున్న వి. రమేష్ బాబు హయాంలో ఒకే మరణించిన వ్యక్తికి రెండు పర్యా యాలు వేర్వేరు తేదీలతో మరణ ధృవ పత్రాలు జారీ చేసినట్లు గుర్తించడం జరిగిందని, సంబంధిత వివరాలు ఆన్ లైన్ రికార్డుల్లో రెండుసార్లు నమోదు కాగా, మరణ ధృవపత్రాల జారీ రిజిస్టర్‌లో మాత్రం ఒకసారి మాత్రమే నమోదు చేసినట్లు విచారణలో వెల్లడైందని, ఒకే వ్యక్తికి వేర్వేరు తేదీలతో రెండు మరణ ధృవపత్రాలు జారీ చేయడం, గ్రామ పంచాయతీ చట్టబద్ధ రికార్డులను సక్రమంగా నిర్వహించకపోవడం, అధికారాలను దుర్వినియోగం చేయడం, విధుల నిర్వహణలో నిర్లక్ష్యం వహించడం వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని తెలంగాణ సివిల్ సర్వీసెస్ (క్లాసిఫికేషన్, కంట్రోల్ అండ్ అప్పీల్) రూల్స్, 1991లోని రూల్ 8(1) ప్రకారం తక్షణ ప్రభావంతో సస్పెన్షన్ చేసినట్లు జిల్లా పంచాయతీ అధికారి శుక్రవారం సాయంత్రం తెలిపారు .





# ఆశా కార్యకర్తలతో వెట్టిచాకిరి?





**వడ్డేపల్లి మండలంలో ఆరోగ్యశాఖ తీరుపై విమర్శలు**

**గద్వాల బ్యూరో (సింగిడి):** గ్రామీణ ప్రజలకు ప్రాథమిక ఆరోగ్య సేవలు అందించ డంలో కీలకంగా పనిచేసే ఆశా కార్యకర్తలపై వడ్డేపల్లి మండలంలో అదనపు పనిభారం పడుతున్నట్లు క్షేత్ర స్థాయిలో కనిపిస్తోంది. జోగు లాంబ గద్వాల జిల్లా అలంపూర్ నియోజకవర్గంలోని వడ్డేపల్లి మండలంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశా కార్య కర్తలు టాబ్లెట్లు టాబ్లెట్లు ఇవ్వడం, ఓపీలు రికార్డుల్లో రాయడం, బీపీలు చూడడం వంటి పనులు కనిపించాయి ఈ విషయమే వారిని ఆరా తియ్యగా సిబ్బంది కొరతతో అధికారు లు ఆశా కార్యకర్త లను ప్రతిరోజు డ్యూటీలు వేసినట్లు తెలుస్తోంది ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో టాబ్లెట్లు ఇవ్వడం బీపీలు చూడడం రికార్డులు రాయడం వంటి పనులు కూడా ఆశా కార్యకర్తల విధు ల్లో భాగమ య్యాయా అనే ప్రశ్నలు తలెత్తుతు న్నాయి. కొంతమంది ఆశా కార్యకర్తలు వివిధ గ్రామాల నుంచి వడ్డేపల్లి పీహెచ్‌సీకి వెళ్లేందుకు ఒక్కోసారి రూ. 50 నుంచి రూ. 100 వరకు ప్రయాణ ఖర్చు అవుతున్న పరి స్థితి కూడా ఉంది. చాలీచాలని పారి తోషికంతో పని చేస్తు న్న ఆశా కార్య కర్తలకు అదనపు ప్రయాణ భారం కూడా ఇబ్బందిగా మారుతోం దని పలువురితో ఆవేదన చెందినట్లు సమాచారం. ముఖ్యంగా ఆశా కార్యక ర్తలు ఈ విధులు నిర్వహించ డం పై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తెలిసి తెలియని ఆశా కార్యక ర్తలు టాబ్లెట్లు బీపీలు చూడడం ఏంటి ప్రజలకు ఏదైనా జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారని మండిపడుతు న్నా రు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి (డీఎంహెచ్ ఓ), జిల్లా కలెక్టర్ ఈ అంశంపై దృష్టి సారించి వడ్డేపల్లి పీహెచ్‌సీలోని పరిస్థి తులను క్షేత్రస్థాయిలో పరిశీలించాల్సిన అవస రం ఉంది. ఆశా కార్యకర్తలకు వారి విధుల్లో భాగమైన ఆరోగ్య సేవలను మాత్రమే అప్పగించి, అదనపు పని భారం తగ్గించాలని ప్రజ లు కోరుతు న్నారు. వైద్య సేవల వ్యవస్థలో కీలకం గా పనిచేసే ఆశా కార్యక ర్తలను వెట్టిచాకిరీకి గురిచేస్తున్నా రనే విమర్శలకు అధికారులు సమాధానం చెప్పాల్సిన పరిస్థితి నెలకొంది.

# బోధనలో మేటి.. సేవలో సాటి

**జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా దర్శనాల రామచంద్రం**



**సుల్తానాబాద్, (సింగిడి):** విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తూ, బోధనా రంగంలో విశిష్ట సేవలు అందిస్తున్న కనగర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యా యుడు దర్శనాల రామ చంద్రంకు అరుదైన గౌరవం దక్కిం ది. పెద్దపల్లి జిల్లా స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయు డిగా ఎంపికై అవార్డును అందుకున్నారు. ఓదెల మండల కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎంపీడీవో అనిల్‌కుమార్, మండల విద్యాధి కారి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రమేష్ తదిత రులు పాల్గొని దర్శనాల రామచంద్రంకు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును అందజేసి అభినందించారు. విద్యార్థుల అభ్యున్నతిని లక్ష్యంగా చేసుకుని అంకితభావంతో పనిచేస్తూ, బోధనలో ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్న రామచంద్రంకు జిల్లా స్థాయి గు ర్తింపు లభించడం పట్ల ఉపాధ్యాయులు, విద్యా ర్థులు, తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు. ఈ అవార్డు ఆయన సేవలకు దక్కిన సముచిత గౌర వమని పలువురు కొనియాడారు.

## మృతురాలి కుటుంబానికి అండగా సర్పంచ్ గణేష్ రావు



**కల్వకుర్తి (సింగిడి):** వంగూరు మండల కేంద్రానికి చెందిన రాకొండ ఎల్లమ్మ (85) అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ సర్పంచ్, బీఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు వేనేపల్లి గణేష్ రావు, మాజీ సర్పంచ్ అక్కి లావణ్య ఎల్లాగౌడ్, గ్రామ ఉపసర్పంచ్ బండపల్లి భాస్కర్ మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా మృతురాలి కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ, ఎల్లమ్మ ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు. అనంతరం కుటుంబానికి 10,000 ఆర్థిక సహాయాన్ని అందజేశారు. కష్టకాలంలో బాధిత కుటుంబానికి అండగా నిలిచి ఆర్థిక సహాయం అందించిన వేనేపల్లి గణేష్ రావుకు కుటుంబ సభ్యులు, స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ బీఆర్ఎస్ అధ్యక్షులు బండపల్లి జంగయ్య, వార్డు సభ్యులు సుమన్, అక్కి మురళీ, నారమోని జంగయ్య, బండపల్లి శివకుమార్, లట్టుపల్లి మురళి, సోషల్ మీడియా ఇన్‌చార్జ్ ఎల్లికంటి మురళి, బాషమోని కృష్ణ, అయినాల రమేష్, జంపుల మధు, బాదమోని రాఘవేందర్, రమేష్, బండపల్లి శ్రీశైలం, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

## రేపల్లెలో మాదిగల ఇళ్ల కూల్చివేతపై కఠిన చర్యలు తీసుకోవాలి



**గద్వాల బ్యూరో (సింగిడి):** గద్వాల మండలం రేపల్లె గ్రామంలో మాదిగ సామాజిక వర్గానికి చెందిన యువకుడు, అదే గ్రామానికి చెందిన బీసీ బోయ సామాజిక వర్గానికి చెందిన యువతిని ప్రేమించి వివాహం చేసుకున్న నేపథ్యంలో కుల వివక్షతో మాదిగల ఇళ్లను కూల్చివేశారని ఆరోపిస్తూ బాధితులతో కలిసి ఎమ్మార్పీఎస్ నాయకులు జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా నాయకులు కొంకల భీమన్న మాదిగ, అయిజ రాజు మాదిగ మాట్లాడుతూ.. రేపల్లె గ్రామానికి చెందిన రంగముని, మహేశ్వరి ప్రేమించి వివాహం చేసుకున్నారని తెలిపారు. ఈ వివాహాన్ని జీర్ణించుకోలేక యువతి కుటుంబ సభ్యులు, గ్రామ సర్పంచ్ తదితరుల ప్రమేయంతో కుట్ర చేసి మాదిగల ఇళ్లను కూల్చివేసినట్లు ఆరోపించారు. ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు జిల్లా ఎస్పీని కోరారు. బాధితులకు తక్షణమే న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ,ఎస్టీ, మాని టరింగ్ కమిటీ సభ్యులు కుర్మన్న, పిడిఎస్యు గంజిపేట రాజు, ఎమ్మార్పీఎస్ నా యకులు పరుశరామ్, కన్నా, కాంగ్రెస్ నాయకులు మాల శ్రీను, వాసులు, బి ఆర్ ఇమ్మానియేల్, ప్రజా సంఘాల నాయకులు ఆశన్న పాల్గొన్నారు.


## బిజెపి అధ్యక్షులు ఆధ్వర్యంలో కీసర



## మండల ఎమ్మార్వోకి వినతి పత్రం

**కీసర (సింగిడి):** బిజెపి నాగారం డివిజన్ అధ్యక్షులు కొండబోయిన నాగరాజు యాదవ్ ఆధ్వర్యంలో, సెప్టెంబర్ 17ను "తెలంగాణ విమోచన దినోత్సవంగా అధికారికంగా నిర్వహించాలని, "తెలంగాణ సప్త సంకల్పాలు" అమలు చేయాలని కోరుతూ కీసర మండల ఎమ్మార్వోకి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాజీ మున్సిపల్ చైర్మన్ కౌకుంట్ల చంద్రారెడ్డి మాట్లాడుతూ, 1948 సెప్టెంబర్ 17ను తెలంగాణ చరిత్రలో మరువలేని రోజుగా, నిజాం పాలన, రజాకార్ల దురాగతాలు, జమీందారీ దోపిడీ నుంచి విముక్తి పొంది భారతదేశంలో విలీనమైన చారిత్రక దినంగా పేర్కొన్నారు. సర్దార్ వల్లభభాయ్ పటేల్ రాజకీయ సంకల్పం, ఆపరేషన్ పోలో కీలక పాత్ర పోషించాయని, అమరవీరుల త్యాగాలను గౌరవించడం మన బాధ్యత అని అన్నారు. తెలంగాణ సప్త సంకల్పాలు రాష్ట్ర ప్రభుత్వ అమలు చేయాలని.. ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 17ను అధికారికంగా "తెలంగాణ విమోచన దినోత్సవం"గా నిర్వహించాలి. హైదరాబాద్‌లో సర్దార్ పటేల్‌కు "స్టాట్యూ ఆఫ్ లిబరేషన్ -- తెలంగాణ" నిర్మించాలి. హైదరాబాద్‌లో "హైదరాబాద్ తెలంగాణ విమోచన మ్యూజియం ఏర్పాటు చేయాలి. ప్రతి జిల్లా కేంద్రంలో తెలంగాణ విమోచన స్మృతి కేంద్రం ఏర్పాటు చేయాలి. పాఠ్యపుస్తకాల్లో విమోచన చరిత్ర చేర్చి, అమరవీరుల అధికారిక జాబితా రూపొందించాలి. బైరాన్‌పల్లి, పరకాల వంటి చారిత్రక ప్రాంతాల్లో విమోచన స్మారక స్తూపాలు నిర్మించాలి. చారిత్రక గ్రామాలు, కోటలు, పోరాట కేంద్రాలను అనుసంధానిస్తూ "తెలంగాణ విమోచన పర్యాటక సర్క్యూట్" అభివృద్ధి చేయాలని ఎమ్మార్వోని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ మునిగంటి సురేష్, జిల్లా ఉపాధ్యక్షులు గణపురం శ్యామ్ సుందర్ శర్మ, జిల్లా ప్రధాన కార్యదర్శి బుధవరం లక్ష్మి, మాజీ ఎంపీటీసీ తరిగొప్పుల బలరాం, మాజీ కౌన్సిలర్ బిజ్జా శ్రీనివాస్ గౌడ్, డివిజన్ ప్రధాన కార్యదర్శులు మామిడి జంగారెడ్డి, పోతంశెట్టి వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షులు ఎలసాని నాగరాజ్ యాదవ్, రామారం గిరి గౌడ్, కార్యదర్శి సురేందర్ రెడ్డి, సూర్య శేఖర్ రెడ్డి, జూపల్లి నరేష్, భరత్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా అన్న ప్రసాద వితరణ



**కాప్రా, (సింగిడి):** కాప్రా సర్కిల్ కుషాయి గూడ డివిజన్ పరోదిలోని శ్రీ లక్ష్మీనరసింహస్వామి కాలనీ లోని శ్రీ బంగారు మైసమ్మ దేవాలయం వద్ద శుక్రవారం శుభ పొలం అమావాస్య సందర్భంగా చిందం యాదగిరి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో మూడు వందల మందికి అన్న ప్రసాద వితరణ కార్యక్రమం ను నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరూ ఆయురారోగ్యాలు, సుఖ సంతోషాలతో ఉండేలా చూడాలని అమ్మవారిని వేడుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమం లో కాలనీ అధ్యక్షులు జె సుధాకర్, కార్యదర్శి అఖిల్, ఉపాధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్, రాజేష్, మాదేశ్, శివ కృష్ణ, గౌతమ్, తిరుమల్, సుధాకర్,దేవాలయ కమిటీ సభ్యులు అనిత, అనసూయ, ఎస్ పద్మ, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణకు రూ.70 వేల కోట్లతో ఏఐ సెంటర్

**-ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి**
**-ఒక గిగావాట్ సామర్థ్యంతో ఏఐ కేంద్రం ఏర్పాటు.. సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి శ్రీధర్‌బాబుకు ఎమ్మెల్యే కృతజ్ఞతలు**



**జడ్చర్ల,(సింగిడి):** తెలంగాణ రాష్ట్రానికి రూ.70 వేల కోట్ల భారీ పెట్టుబడితో ఒక గిగావాట్ సామర్థ్యం కలిగిన ఆర్టిఫిషియల్ ఇంటెలి జెన్స్ (ఏఐ) సెంటర్‌ను తీసుకువచ్చినందుకు ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బా బుకు జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి హృదయ పూర్వక ధన్యవాదాలు తెలిపారు. అసెంబ్లీలో జరిగిన చర్చ సందర్భంగా ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. సాఫ్ట్‌వేర్ పరిశ్రమను రాష్ట్రానికి తీసుకురావడం అంత సులభమైన విషయం కాదని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఇందుకు అనేక సమీకర ణాలు, అనుకూల పరిస్థితులు అవసరమవు తాయని తెలిపారు. తాను గతంలో సాఫ్ట్‌వేర్ రంగంలో పనిచేసిన సమయంలో 12 దేశాల్లో సాఫ్ట్‌వేర్ కంపెనీల ఏర్పాటుకు సంబంధించిన అంశాలపై పరిశోధన చేసినట్లు సభలో వివరించారు.

**ఐటీకేంద్రాలకు నగర పరిసర ప్రాంతాలు అనుకూలం**

ఐటీ కేంద్రాల ఏర్పాటుకు నగర పరిసర ప్రాంతాలు అనుకూలంగా ఉంటాయని అనిరుధ్ రెడ్డి అన్నారు. ఐటీ విద్యను అభ్యసించిన యువత పట్టణ ప్రాంతాల్లో నివసించేందుకు ఎక్కువగా ఆసక్తి చూపుతారని, అందువల్ల మౌలిక సదుపాయాలు, మానవ వనరుల లభ్యత ఉన్న నగర పరిసర ప్రాంతాల్లో ఐటీ కేంద్రాలను ఏర్పాటు చేయడం ప్రయోజనకరంగా ఉంటుందని పేర్కొన్నారు.

**పరిశ్రమలను మూడు రకాలుగా విభజించవచ్చు**

పరిశ్రమల విషయానికి వస్తే సాధారణంగా చిన్న తరహా, మధ్య తరహా, భారీ తరహా పరిశ్రమలుగా విభజించవ చ్చని ఎమ్మెల్యే వివరించారు. చిన్న తరహా పరిశ్రమల్లో రూ.5 కోట్ల కంటే తక్కువ పెట్టుబడితో ఏర్పాటు చేసే పరిశ్రమలు ఉంటాయని తెలిపారు. రాష్ట్రంలో పరిశ్రమల అభివృద్ధితో పాటు ఉపాధి అవకాశాలు పెంచేందుకు అనుకూల వాతావరణం కల్పించాల్సిన అవసరం ఉందన్నారు.

## జర్నలిస్టుల జేఏసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ముత్యాల రమేష్



**వలిగొండ/రామన్న పేట,(సింగిడి):** తెలంగాణ జర్నలిస్టుల జాయింట్ యాక్షన్ కమిటీ జేఏసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ము త్యాల రమేష్ నియమి తులయ్యారు. ఈ మేరకు జేఏసీ రాష్ట్ర చైర్మన్ తోగరి కరుణాకర్ శుక్రవారం అధికారిక ఉత్తర్వులు జారీ చేశారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారం, వారి హక్కుల పరిరక్షణతో పాటు సంక్షేమం కోసం ముత్యాల రమేష్ చేస్తున్న కృషిని గుర్తించి ఈ బాధ్యతలు అప్పగించినట్లు జేఏసీ చైర్మన్ తెలిపారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా తనకు బాధ్యతలు అప్పగించిన జేఏసీ రాష్ట్ర చైర్మన్ తోగరి కరుణాకర్‌కు ముత్యాల రమేష్ కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలను జేఏసీ దృష్టికి తీసుకెళ్లి, వాటి పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. జర్నలిస్టుల హక్కులు, సంక్షేమం కోసం జేఏసీ ఆధ్వర్యంలో తనవంతు బాధ్యతను సమర్థవంతంగా నిర్వర్తిస్తానని పేర్కొన్నారు. ముత్యాల రమేష్ నియామకం పట్ల పలువురు జర్నలిస్టులు, జర్నలిస్టు సంఘాల నాయకులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు.

# ఉపాధ్యాయుల సేవలు అభినందనీయం

**-ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్**
**-గండిపేట మండలంలో ఉపాధ్యాయ దినోత్సవం**
**-ఉత్తమ ఉపాధ్యాయులకు ఘన సన్మానం**




**రాజేంద్రనగర్,(సింగిడి):** సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమైనదని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్ అన్నారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకొని గండిపేట మండలం, నార్సింగి సర్కిల్ పరిధిలోని మంచిరేవులలో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తూ రాష్ట్ర, జిల్లా, మండల స్థాయిల్లో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు సాధించిన ఉపాధ్యాయులను ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్, స్థానిక నాయకులతో కలిసి శాలువాలు, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్ మాట్లాడుతూ.. ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైనదని కొనియాడారు. విద్యార్థులకు చిన్ననాటి నుంచే నాణ్యమైన విద్యతో పాటు ఉన్నతమైన విలువలు, క్రమశిక్షణను అందిస్తూ వారి భవిష్యత్తుకు బంగారు బాటలు వేస్తున్న ఉపాధ్యాయుల సేవలు వెలకట్టలేనివని పేర్కొన్నారు. అంకితభావంతో పనిచేస్తూ ఉత్తమ అవార్డులు పొందిన ఉపాధ్యాయులను సన్మానించడం తమకు ఎంతో గౌరవంగా ఉందన్నారు. మండలంలోని ఉపాధ్యాయులందరికీ ఈ సందర్భంగా ఆయన ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గుడిమల్క్ పూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ మల్లేష్, నార్సింగ్ కి మార్కెట్ కమిటీ చైర్మన్ వేణు గౌడ్, కాంగ్రెస్ నాయకులు రామకృష్ణారెడ్డి, శ్రావణ్ కుమార్,గండిపేట విద్యాశాఖ అధికారులు, వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు,

## బైక్‌ను ఢీకొట్టిన ఆటో.. ముగ్గురికి తీవ్ర గాయాలు

**బుద్ధారం పెట్రోల్ బంక్ సమీపంలో ఘటన**
**ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురికి గాయాలు.. కేసు నమోదు**




**గోపాల్‌పేట (సింగిడి):** మండలంలోని బుద్ధారం గ్రామం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండలం మంగనూరు గ్రామానికి చెందిన వేముల రామకృష్ణ తన భార్య రాణి, కూతురు అక్షిత(10)తో కలిసి సెప్టెంబర్ 9న బైక్‌పై గండి ఆంజనేయస్వామి ఆలయం వైపు వెళ్తుండగా ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంక్ సమీపంలో ఎదురుగా వచ్చిన ఆటో ఢీకొట్టింది. ప్రమాదంలో రామకృష్ణ చేతి వేలు విరగడంతో పాటు నుదురు, కనుబొమ్మ, మోకాలికి గాయాలయ్యాయి. రాణి, అక్షితలకు ముఖం, చేతులు, కాళ్లపై గాయాలయ్యాయి. క్షతగాత్రులను వనపర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బాధితుడి అన్న వేముల మధు ఫిర్యాదు మేరకు ఆటో డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు గోపాల్‌పేట ఎస్సై డి. శశిధర్ తెలిపారు.

## జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడికి సన్మానం

**-వినూత్న బోధనతో విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి కృషి : ఎంఈవో హనుమంతు**



**శ్రీరంగాపూర్,(సింగిడి):** నాగసానిపల్లి ప్రాథమిక పాఠశాలలో ఎస్జీటీ ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్న భత్తుల నరేష్ వనపర్తి జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారానికి ఎంపికైన సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకటేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మండల విద్యాధికారి టి. హను మంతు, గ్రామ సర్పంచ్ సుజాత రాజశేఖర్ హాజరై నరేష్‌ను అభినం దించారు. పాఠశాలలో వినూత్న బోధనా పద్ధతులను అవలంబిస్తూ విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి కృషి చేస్తున్నందుకే జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం లభించిందని ఎంఈవో హనుమంతు తెలిపారు. గ్రామానికి చెందిన ఉపాధ్యాయుడికి జిల్లా స్థాయి పురస్కారం రావడం గర్వకారణమని సర్పంచ్ పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనివాస్, స్వామి, వార్డు సభ్యులు, మాజీ సర్పంచ్ ఆంజనేయులు, పంచాయతీ కార్యదర్శి రాజు, అంగన్‌వాడీ టీచర్, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొని నరేష్‌ను అభినందించారు.

# నీటిలో మునిగి వ్యక్తి మృతి



**తొగుట,(సింగిడి):** బుధవారం నాడు తొగుట పోలీస్ స్టేషన్ పరిధిలో పెద్ద మాసం పల్లికి చెందిన బోదాస్ సంజీవ్ ఒక వ్యక్తి కనిపించకుండా పోయినట్లు కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి, వ్యక్తి ఆచూకీ కోసం గాలింపు చర్యలు చేపట్టారు. శుక్రవారం రోజున పెద్ద మాసంపల్లి గ్రామ చెరువులో మృతదేహాన్ని గ్రామస్తులు గుర్తించి పోలీస్ లకు సమాచారం ఇవ్వగా పోలీసులు మృతి దేహాన్ని సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వివరాల్లోకి వెళితే తొగుట ఎస్సై చెప్పిన కథనం ప్రకారం పెద్ద మాసంపల్లి గ్రామానికి చెందిన బోదాసు సంజీవ్ తండ్రి బాలయ్య వయస్సు 21 స్కూల్ బస్సు క్లీనర్ గా పనిచేస్తున్నాడు కుటుంబం ఆర్థిక ఇబ్బందులకు గురి కావడం వల్ల మానసిక ఒత్తిడికి గురై ఇంట్లో ఎవరికీ చెప్పకుండా ఇంటి నుండి వెళ్లి పెద్ద మాసంపల్లి చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు ఎస్సై తెలిపారు .

# పదేపదే అరెస్ట్ చేయడం అప్రజాస్వామికం



**కొడంగల్, (సింగిడి):** పదేపదే అరెస్ట్ చేయడం అప్రజాస్వామికం అని బిఆర్ ఎస్ పార్టీ దుద్యాల మండలం యువజన విభాగం నాయకుడు లగచర్ల సురేష్ అన్నారు. అలజడి ఎక్కడ జరుగుతున్న తనను టార్గెట్ గా చేసుకుని పోలీసులు పదేపదే అరెస్ట్ చేస్తున్నారనీ ఆయన అన్నారు. హైదరాబాద్ లో ఉన్న తనను గురువారం రోజు, శుక్రవారం రోజు వరుసగా పోలీసులు అరెస్ట్ చేయడంతో సురేష్ ఈవిధంగా మాట్లాడారు. శుక్రవారం ఉదయం అరెస్ట్ చేసిన పోలీసులు మధ్యాహ్నం వదిలిపెట్టారు. దుద్యాల మండల పోలీసులు నరేష్ గౌడ్ అరెస్ట్ చేసి మధ్యాహ్నం వదిలి పెట్టారు.

## ప్రభుత్వ జూనియర్ కళాశాలలో డీఐఈఓ ఆకస్మిక తనిఖీ



**శ్రీరంగాపూర్, (సింగిడి):** శ్రీరంగాపూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలను జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి (డీఐఈఓ) నరేంద్ర కుమార్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కళాశాల రికార్డులు, విద్యార్థుల హాజరు, విద్యా ప్రగతి, పరీక్షల నిర్వ హణ తదితర అంశాలను పరిశీలించారు. అనంతరం అధ్యాపకులతో సమావేశమై సిలబస్‌ను నిర్ణీత సమయంలో పూర్తి చేయడం, వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపడం, ప్రతిభావంతులను ప్రోత్సహిం చడం, కళాశాల ఫలితాలను మెరుగుపరిచేందుకు సమన్వయంతో పని చేయాలని సూచించారు. ఇటీవల నిర్వహించిన రెండో యూనిట్ టెస్ట్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు డీఐఈఓ నరేంద్ర కుమార్, ప్రిన్సిపాల్ ఇ.జె. మోజెస్ బహుమతులు అందజేసి అభినందించారు. విద్యార్థులు క్రమశిక్షణ, సమయపాలనతో చదువుతూ ఉన్నత లక్ష్యాలను సాధించాలని డీఐఈఓ సూచించారు.

## గొల్లపల్లిలో జోరుగా మద్యం అమ్మకాలు

**రేవల్లి, (సింగిడి):** వనపర్తి జిల్లా ఏదుల మండలం పరిధిలోని గొల్లపల్లి గ్రామంలో జోరుగా అక్రమ మద్యం అమ్మకాలు జరుగుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తు న్నాయి. గ్రామంలోని కొన్ని కిరాణా షాపుల్లో నిబంధనలకు విరుద్ధంగా మద్యం దర్జాగా విక్రయిస్తున్నట్లు స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బెల్ట్ షాపుల తరహాలో కిరాణా దుకాణాల నుంచే మద్యం అందుబాటులోకి వస్తోందన్న ఆరోపణలు గ్రామంలో చర్చనీయాంశంగా మారాయి.

# అటవీ పరిరక్షణలో ప్రాణత్యాగం చేసిన అమరవీరులకు ఘన నివాళి



**జడ్చర్ల, (సింగిడి):** అటవీ పరిరక్షణలో ప్రాణాలు కోల్పోయిన అమరవీరులకు డాక్టర్ బూర్గుల రామకృష్ణారావు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ వృక్షశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో ఘన నివాళులు అర్పించారు. జాతీయ అటవీ అమరవీరుల దినోత్సవాన్ని పురస్కరించుకుని శు క్రవారం నిర్వహించిన ఈ కార్యక్రమానికి కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ డి. నర్మద అధ్యక్షత వహించారు. తెలంగాణ బొటానికల్ గార్డెన్ సమన్వయకర్త డాక్టర్ బి. సదాశివయ్య మాట్లాడుతూ.. అటవీ సంపదను కాపాడేందుకు ఎందరో అటవీ అధికారులు, సిబ్బంది తమ ప్రాణాలను సైతం పణంగా పెడుతున్నారని తెలిపారు. అడవుల పరిరక్షణ కోసం ప్రాణత్యాగం చేసిన వారి సేవలు, త్యాగాలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. విలువైన అటవీ సంపదను భవిష్యత్ తరాలకు అందించేందుకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని సూచించారు. అకాడమిక్ కోఆర్డినేటర్ డాక్టర్ రాఘవేంద్రరెడ్డి మాట్లాడుతూ.. అడవులను రక్షించడం ద్వారా అటవీ సిబ్బందికి ప్రజలు సహకరించినవార వుతారని, అటవీ పరిరక్షణతో మానవులతో పాటు భూ మిపై ఉన్న అనేక జీవరాశులకు ప్రయోజనం కలుగు తుందని తెలిపారు. కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ డి. నర్మద మాట్లాడుతూ.. 1730లో రాజస్థాన్‌లోని జోధ్‌పూర్ సమీపంలోని ఖేజర్లీ గ్రామంలో చెట్లను కాపాడేందుకు బిష్ణోయి సమాజానికి చెందిన ప్రజలు చేసిన ప్రాణత్యాగాన్ని వివరించారు. చెట్లను నరికివేయకుండా అడ్డుకునే క్రమంలో 363 మంది ప్రాణాలు కోల్పోయిన ఘటన అటవీ పరిరక్షణ చరిత్రలో గొప్ప త్యాగానికి నిదర్శనమని పేర్కొన్నారు. ఈ సంఘటనకు గుర్తుగా భారత ప్రభుత్వం సెప్టెంబర్ 11న జాతీయ అటవీ అమరవీరుల దినోత్సవాన్ని నిర్వహిస్తోందని తెలిపారు. ఇటీవల తెలంగాణలోని భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో అటవీ రక్షణ విధుల్లో ఫారెస్ట్ రేంజ్ అధికారి శ్రీనివాసరావు ప్రాణాలు కోల్పోయిన ఘటన, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ భానోత్ నవీన్ విద్యుత్ తీగల కారణంగా మృతి చెందిన ఘటనలు బాధాకరమని డాక్టర్ సదాశివయ్య పేర్కొన్నారు. ఇలాంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా ప్రజల్లో అటవీ, వన్యప్రాణుల సంరక్షణపై మరింత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. విద్యార్థులు అటవీ, వన్యప్రాణుల సంరక్షణలో చురుకుగా భాగస్వా ములు కావాలని, తమ పరిసరాల్లోని చెట్లను సంరక్షిం చాలని అధ్యాపకులు సూచించారు. అనంతరం తెలంగా ణ బొటానికల్ గార్డెన్‌లో మొక్కలు నాటి నీరు పోశారు. ఈ కార్యక్రమంలో కళాశాల విద్యార్థులు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.



# కాకా.. ధూమ్ ధమాకా! 'క్రేజీ కల్యాణం'

అనుపమ పరమేశ్వరన్, తరుణ్ భాస్కర్, అఖిల్ ఉడ్డేమారి, నరేశ్ ప్రధాన పాత్రధారులుగా బద్రప్ప గాజుల తెరకెక్కించిన చిత్రం 'క్రేజీ కళ్యాణం'. బూసం జగన్ మోహన్ రెడ్డి నిర్మించారు. ప్రస్తుతం ముగింపు దశలో ఉన్న ఈ సినిమా త్వరలో థియేటర్లలోకి రానుంది. ఈ నేపథ్యంలోనే శనివారం ఈ చిత్రం నుంచి పెళ్లి బరాత్ గీతాన్ని విడుదల చేశారు.

"కాకా ధూమ్ ధమాకా.. లగ్గం ఇంట్ల పందిర్లే పడ్డాక" అంటూ హుషారుగా సాగిన ఈ పాటకు సురేశ్ బొబ్బిలి స్వరాలు సమకూర్చడమే గాక స్వయంగా ఆలపించారు. కాసర్ల శ్యామ్ సాహిత్యమందించారు. ఈశ్వర్ పెంటి నృత్యరీతులు అందించారు. ఈ పాటలో అనుపమ వేసిన హుషారైన స్టెప్పులు ఆకర్షణగా నిలిచాయి.
ఈ చిత్రానికి కూర్పు: శ్రావణ్ కటికనేని, ఛాయాగ్రహణం: శ్యామ్ దూపాటి.

# డిమాండ్ చేస్తే యాక్షన్‌కీ వెనకాడను!

"అడుక్కునే వాళ్లకి కూడా ఆదివారం ఉంటుంది కానీ ఈ అప్పుల వాళ్లకి ఉండదు" అంటున్నారు చిట్టిబాబు. మరి ఆయనెవరు.. తన కుటుంబ కథేంటి? తెలియాలంటే 'ఆదర్శ కుటుంబం హౌస్ నెం. 47' చూడాల్సిందే. వెంకటేశ్ కథానాయకుడిగా త్రివిక్రమ్ తెరకెక్కిస్తున్న చిత్రమిది. హారిక అండ్ హాసిని క్రియేషన్స్ పతాకంపై ఎస్. రాధాకృష్ణ నిర్మిస్తున్నారు. శ్రీనిధి శెట్టి కథానాయిక. నారా రోహిత్, నివేదా పేతురాజ్, సత్య తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ సినిమా అక్టోబరు 2న థియేటర్లలోకి రానుంది. ఈ నేపథ్యంలోనే శనివారం ఈ చిత్ర టీజర్‌ను విడుదల చేశారు. "డబ్బుకీ.. సబ్బుకీ ఓ పోలికుంది. మొదటిది చూస్తుండగానే కరిగిపోద్ది. రెండోది ఆలోచించేలోపే అరిగిపోద్ది" అంటూ చిట్టిబాబుగా వెంకీ చెప్పే డైలాగ్‌తో మొదలైన టీజర్ ఆద్యంతం అలరించేలా సాగింది. సగటు మధ్యతరగతి ఉద్యోగిగా చిట్టిబాబు జీవితాన్ని.. భార్య చేసే అప్పుల వల్ల తను పడే తిప్పల్ని ఈ ప్రచార చిత్రంలో ఫన్నీగా చూపించారు. వాళ్లంతా అకస్మాత్తుగా ఒక్కరాత్రిలో ధనవంతులుగా మారడం.. దానివల్ల ఆ కుటుంబానికి ఎదురైన చిక్కులు.. అందులో నుంచి బయట పడేందుకు భార్యాబిడ్డలతో కలిసి చిట్టిబాబు చేసిన సాహసాలు టీజర్‌లో ఆసక్తిరేకెత్తించాయి. "నాకు ఫ్యామిలీ ఇమేజ్ ఉందని నాకు తెలుసు. కానీ, సిట్యువేషన్ డిమాండ్ చేస్తే యాక్షన్ చేయడానికి వెనకాడను" అంటూ వెంకీ చేసిన యాక్షన్ హంగామా ఆకట్టుకుంది.

# అయినా కల నెరవేరలేదనిపిస్తుంది
## మురళీ శర్మ



బాలీవుడ్ నుంచి టాలీవుడ్ వరకు ఎన్నో భాషల్లో విభిన్న పాత్రలు పోషించి మెప్పించారు ప్రముఖ నటుడు మురళీ శర్మ (వీబతీఖ్రీఅ ర్యాష్ట్రుతీమ్ఖి). ఇటీవల ఆయన 'సూపర్ సుబ్బు' వెబ్ సిరీస్‌తో డిజిటల్ రంగంలోకి (ఓటీటీ) అడుగుపెట్టారు. ఈ సందర్భంగా ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ తన సినీ ప్రయాణం గురించి పలు ఆసక్తికర విషయాలు పంచుకున్నారు.
"గతంతో పోలిస్తే ఇప్పుడు సినిమాల్లో చాలా మార్పులొచ్చాయి. ముఖ్యంగా కథ రాసే విధానంలో నాణ్యత బాగా పెరిగింది. ఒక సినిమాకు కథే ప్రాణం. నేను ఇప్పటి వరకు 250కి పైగా చిత్రాల్లో నటించానంటే నాకే నమ్మశక్యంగా లేదు. అయినా నా కల నెరవేరలేదనిపిస్తుంది. ఎందుకంటే, కెరీర్ ప్రారంభంలో ఇంత స్థాయిలో ఎదుగుతానని అనుకోలేదు. అంత పెద్ద కల కనే ధైర్యం కూడా చేయలేదు" అని ఆయన సరదాగా చెప్పుకొచ్చారు.
సినిమాల్లో పాత్ర నిడివి గురించి తానెప్పుడూ ఆలోచించనని మురళీ శర్మ స్పష్టం చేశారు. "ఇచ్చిన పాత్రకు ఎంతవరకు న్యాయం చేశాననేదే నాకు ముఖ్యం. సినిమాలో నా పాత్ర నిడివి ఎంత ఉందనేది ఎప్పుడూ చూడలేదు. అదృష్టవశాత్తూ నా సినీ ప్రయాణంలో ఎన్నో వైవిధ్యభరిత పాత్రలు దక్కాయి. తెలుగులో నన్ను తండ్రి పాత్రలకు కేరాఫ్ అడ్రస్‌గా భావిస్తుంటారు. అయితే, నేను ఎప్పుడూ ఒకే రకమైన పాత్రలు చేస్తున్నానని ఫీల్ కాలేదు. దర్శకుడు నాకు ఏ పాత్ర ఇచ్చినా దానికి వంద శాతం న్యాయం చేయడమే నా బాధ్యతగా భావిస్తాను" అని ఆయన వివరించారు



### టొరంటో అంతర్జాతీయ చిత్రోత్సవంలో...

# డోరతి
## కీర్తి సురేశ్

కథానాయిక కీర్తి సురేశ్, సనంత్, రిషికాంత్ ప్రధాన పాత్రాధారులుగా రూపొందిన తమిళ సినిమా 'డోరతి'. కార్తిక్ సుబ్బరాజ్ తెరకెక్కించిన ఈ చిత్రాన్ని గునీత్ మోంగా కపూర్, అచిన్ జైన్, జ్యోతిదేశ్‌పాండే సంయుక్తంగా నిర్మించారు. తాజాగా ఈ సినిమా టొరంటో అంతర్జాతీయ చలనచిత్రోత్సవం(టిఫ్)2026లో ప్రదర్శితమైనట్లు సామాజిక మాధ్యమాల్లో పంచుకుంది చిత్రబృందం.

ప్రీమియర్ అనంతరం ఈ చిత్రానికి ప్రేక్షకుల నుంచి స్టాండింగ్ ఒవేషన్ లభించింది. దీంతో సినీ బృందం ఇన్‌స్టాలో 'ఈ క్షణాన్ని పంచుకోవడం మరపురానిది. ఈ చిత్రానికి జీవం పోసిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు' అనే క్యాప్షన్‌తో ఫొటోలని పంచుకుంది. దశాబ్ద కాలంలో టిఫ్‌లో ప్రదర్శితమైన తొలి తమిళ చిత్రంగా నిలిచింది 'డోరతి'. 90ల కాలంలో చిన్ననాటి ఇద్దరు స్నేహితులు, వారికి పరిచయమైన డోరతి అనే మహిళ చుట్టూ తిరిగే కథ ఇదని చిత్రవర్గాలు తెలిపాయి. ఈ సినిమా ఈ నెల 25న థియేటర్లలోకి రానుంది

సినిమా సింగిడి
Cinma Singidi
సోమవారం
14-9-2026

Printed and Published by Mohan Pusala on behalf of Flamingo Media Networks, Printed at Sree Seshasai Enterprises Plot no.98/1, Co-operative Industrial Estate, Gandhi Nagar, Near Balanagar, Medchel Malkajgiri Dist.Hyderabad Telangana 500037.and Published from PLOT NO 74 A/D, KAMAKSHI NILAYAM, ESHWARIPURI COLONY, SAINIKPURI, MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500094.
Editor : Pusala mohan, PRGI.REGN.NO. TGTEL/26/A4370. Cell 91 89199 18737